www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 11-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 253

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి మ.1.57 తదుపరి అష్టమి; నక్షత్రం: పుబ్బ తె.3.56 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ.11.08-12.48; దుర్ముహూర్తం: ఉ.10.18-11.02, మ.2.42-3.26; అమృతఘడియలు: రా.9.12-10.53; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.38; సూర్యాస్తమయం: 5.37

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హెచ్1బీ వీసా ఇంటర్వ్యూల రద్దు



సోషల్ మీడియా తనిఖీ తప్పనిసరి

15 నుంచి అమల్లోకి

భారతీయులకు మరిన్ని కష్టాలు

ట్రంప్ కొత్త నిబంధన తెచ్చిన తంటా

ట్రంప్ వచ్చాక 85వేల వీసాల ఉపసంహరణ

వీరిలో 8 వేల మంది విదేశీ విద్యార్థులు

2

4000 కోట్ల ఐడీపీఎల్ భూములు కృష్ణార్పణం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మరికొందరు బడాబాబులపై ఆరోపణలు

తనకు అడ్డొస్తే టిప్పర్‌తో తొక్కించేస్తానంటూ ఎమ్మెల్యే బెదిరించారని ఉద్యోగుల ఆవేదన

ఐడీపీఎల్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 902 ఎకరాల్లో ఇప్పటికే 150 ఎకరాలు స్వాహా

ఎన్ని ఫిర్యాదులు చేసినా కదలని అధికారులు

ఇంత జరుగుతున్నా.. పట్టించుకోని కేంద్రం

ఆక్రమణల పాలవుతున్న ఖరీదైన భూములపై

'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్ దేశానికే ఫార్మా క్యాపిటల్‌గా ఎదగడానికి మూలమైన ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ (ఐడీపీఎల్) భూములు కబ్జాకు గురవుతున్నాయి! విదేశాలపై ఆధారపడకుండా స్వదేశీ ఔషధ పరిశ్రమకు ఊతమిచ్చే ఉద్దేశంతో కేంద్రం ఏర్పాటు చేసిన పరిశ్రమకు రాష్ట్ర సర్కారు ఇచ్చిన భూములను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మరికొందరు బడాబాబులు కలిసి స్వాహా చేసేస్తున్నారని ఆ సంస్థ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు! పేదలను ముందుపెట్టి.. ఆ భూములను ఆక్రమించి విక్రయిస్తున్నారని.. రియల్టర్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆవేదన వెలిబుచ్చుతున్నారు! 'అయ్యా.. ఐడీపీఎల్ భూములు కబ్జాకు గురవుతున్నాయి.. వాటిని కాపాడండి' అంటూ.. రెవెన్యూ అధికారుల నుంచి కలెక్టర్ దాకా.. స్థానిక పోలీసుల నుంచి డీజీపీ దాకా ఎంతో మందికి.. సంస్థ ఉద్యోగుల నుంచి కేంద్ర అధికారుల దాకా ఎన్నో ఫిర్యాదులు చేసినా ఉపయోగం లేకుండా పోయిందని వాపోతున్నారు. 1961లో కేంద్ర ప్రభుత్వ సంస్థగా ఏర్పడిన ఐడీపీఎల్‌కు మూసాపేట, బాలానగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ మండలాల

మిగతా 10వ పేజీలో...

కృష్ణారావు అవినీతిని ఆధారాలతో బయటపెడతా

నాపై వ్యక్తిగత ఆరోపణలు

ఆయన అసహనానికి నిదర్శనం

ఆయన ఆరోపణలకు ఆధారాలతో సమాధానం ఇస్తా

జాగృతి అధ్యక్షురాలు కవిత

10



ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీ వద్ద విద్యార్థుల మధ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





విద్యార్థులు బహూకరించిన గదతో ముఖ్యమంత్రి

సమస్యలపై విద్యార్థులకు కొట్లాడే స్వేచ్ఛ

పార్టీల ఉచ్చులో పడకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం కొట్లాడండి

దమ్ముంటే ఓయూకు వెళ్లాలని సవాల్ చేశారు

వాళ్లలా దొంగను కాదు.. గడీలు కట్టుకోలేదు

విదేశీ భాష రాకున్నా.. పేదోడి మనసు చదవడం వచ్చు

రెండేళ్లలో ఓయూ సమస్యలన్నీ పరిష్కరిస్తాం

పైరవీకొచ్చే మంత్రులు, ఎమ్మెల్యేల ఉద్యోగాలు పీకేస్తాం

ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభలో సీఎం రేవంత్‌రెడ్డి

వర్సిటీ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు విడుదల

ఢిల్లీకి వెళ్లిన రేవంత్.. పవార్ ఇంట్లో విందుకు హాజరు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సమస్యలపై కొట్లాడే స్వేచ్ఛ ఎల్లప్పుడూ ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే రాజకీయ పార్టీల ఉచ్చులో పడకుండా.. రాష్ట్ర ప్రయోజనాల కోసం కొట్లాడాలని సూచించారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిర్వహించిన సభలో సీఎం పాల్గొన్నారు. ఓయూ అభివృద్ధికి రూ.1000 కోట్లు మంజూరు

మిగతా 13వ పేజీలో...

స్టార్టప్‌ల రాజధానిగా హైదరాబాద్!

ఆవిష్కర్తలకు అండగా సర్కారు, గూగుల్: సీఎం

మెస్సీ మేనియా

13న ఉప్పల్‌లో మెస్సీ జట్టుతో సీఎం జట్టు ఫ్రెండ్లీ మ్యాచ్

13

ఆనాటికి రైజ్ అదరహో!

2047నాటికి రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగు

రూ.24 లక్షలకు తలసరి ఆదాయం

హైదరాబాద్‌తో పాటు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఆధునిక సౌకర్యాలు

వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ వంటి నగరాలకు 'స్మార్ట్ కారిడార్లు'

డిజిటల్ గవర్నెన్స్‌తో పంపిణీ వ్యవస్థ

'తెలంగాణ రైజింగ్-2027' విజన్ డాక్యుమెంట్‌లో ప్రభుత్వం భరోసా

TELANGANA RISING 2047

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయా? వారి జీవితాల్లో వెలుగులు విరజిమ్మనున్నాయా? 2047కి ఆధునిక సౌకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆరోగ్య, విద్యా వసతులు అందుబాటులోకి రానున్నాయా? అంటే... అవుననే అంటోంది 'తెలంగాణ రైజింగ్- 2047' దార్శనిక పత్రం. 2047 నాటికి ప్రజా జీవన విధానం మారిపోనుందని, నగరాలు, పట్టణాలు, పల్లెలను అత్యంత నివాస యోగ్యంగా మార్చి నాణ్యమైన జీవనాన్ని

మిగతా 11వ పేజీలో...



నేడే తొలివిడత 'పల్లె పోరు'

పొద్దున 7 నుంచి ఒంటిగంట దాకా పోలింగ్

2 గంటల నుంచి లెక్కింపు.. ఫలితాల వెల్లడి

ఆ వెంటనే ఉప సర్పంచ్‌ల ఎన్నిక

సర్వం సిద్ధం: ఎస్ఈసీ రాణి కుముదిని

12

పంచాయతీ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం

77 మంది సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

130 మందికిపైగా షోకాజ్ నోటీసులు

వికారాబాద్, కామారెడ్డి కలెక్టర్ల చర్యలు

ఓటుకు 3వేల దాకా

కనీసం వెయ్యి.. తొలివిడత సర్పంచ్ ఎన్నికల్లో పోటాపోటీగా పంపకాలు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని ఓ గ్రామంలో ఓటుకు రూ.30 వేలు?

అసెంబ్లీ ఎన్నికలను తలదన్నేలా మద్యం జోరు

బుధవారం సాయంత్రం నుంచే పంపిణీ

నేరుగా నగదు, లేకుంటే యూపీఐతో బదిలీ

ఇంటింటికీ ఖరీదైన మందు, మాంసం

చీరలు, లుంగీలు, కుక్కర్లతో ప్రలోభాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పంచాయతీ ఎన్నికల్లో ఓట్లకు 'నోట్ల' వాన కురుస్తోంది. అభ్యర్థుల మధ్య పోటీ పెరిగిన కొద్దీ పంపకాల జాతర కొనసాగుతోంది. తొలివిడత ఎన్నికలు జరుగుతున్న పంచాయతీల్లో ఓటుకు కనీసం రూ.1000 నుంచి రూ.3వేలకు పైనే పలుకుతోంది! మేజర్ గ్రామ పంచాయతీలు, జనరల్ స్థానాలు, పోటీ ఎక్కువున్న చోట, రియల్టర్లు, వ్యాపారులు బరిలో ఉన్నచోట అంతకు మించీ దూసుకెళుతోంది. ఇక మద్యమైతే అసెంబ్లీ ఎన్నికలను కూడా మించి ఏరులై పారుతోంది. ఒక్కో ఓటరుకు

మిగతా 12వ పేజీలో...

దీపావళికి యునెస్కో గుర్తింపు

2

ప్రధాని మోదీ, షా హర్షం

వివేకా హత్య కేసులో మరింత దర్యాప్తునకు ఓకే!

పాక్షిక విచారణకు నాంపల్లి సీబీఐ కోర్టు అనుమతి

సునీల్ యాదవ్, కిరణ్ యాదవ్‌తో వైఎస్ ప్రకాశ్ రెడ్డి, అర్జున్‌రెడ్డి ఫోన్ సంభాషణలపైనే దర్యాప్తు

నెల రోజుల్లో పూర్తిచేయాలని నిర్దేశం

10

సీఐసీ నియామకంపై రాహుల్ అసమ్మతి నోట్

కమిషనర్ల నియామకాలపై ఎటూ తేల్చని కమిటీ భేటీ!

కేంద్రం ప్రతిపాదించిన పేర్లపై రాహుల్‌గాంధీ అసంతృప్తి

సమావేశంలో పాల్గొన్న ప్రధాని, హోంమంత్రి

ముఖ్య సమాచార కమిషనర్‌తోపాటు 8 మంది కమిషనర్ల పోస్టులు ఖాళీ.. పెండింగ్‌లో 30 వేలకు పైగా కేసులు!

న్యూఢిల్లీ, డిసెంబరు 10 : కేంద్ర సమాచార కమిషనర్ల నియామకంపై బుధవారం ఏర్పాటైన కేంద్ర కమిటీ సమావేశం ఏ నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. కేంద్ర సమాచార కమిషన్లో ఖాళీగా ఉన్న ముఖ్య సమాచార కమిషనర్(సీఐసీ) పోస్టుతోపాటు మరో 8 మంది కమిషనర్లు, ఒక విజిలెన్స్ కమిషన్ సభ్యుడిని ఈ కమిటీ నియమించాల్సి ఉంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సభ్యులుగా

మిగతా 2వ పేజీలో...

షా X రాహుల్

ఎన్నికల సంస్కరణలపై పార్లమెంటులో వాడీ వేడి చర్చ

ఎస్ఐఆర్‌పై అబద్ధాలు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షం

నెహ్రూ నుంచి మన్మోహన్ దాకా ఎస్ఐఆర్ కొనసాగింది: షా

నా మీడియా సమావేశాలపై చర్చకు షా సిద్ధమా?

మేం అడిగిన దానిపై జవాబు చెప్పడం లేదు: రాహుల్

2



నెలాఖరు కల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ

కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్లు, ప్రచార కమిటీ కూడా

ఫ్యూచర్ సిటీలో పార్టీ కోసం స్థలం

సీఎంతో విభేదాల్లేవ్: మహేశ్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరుకల్లా వివిధ కార్పొరేషన్లు, బోర్డుల చైర్మన్లు, ఇతర నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. టీపీసీసీకి కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్లు, ప్రచార కమిటీని అధిష్ఠానం నియమిస్తుందని చెప్పారు. సీఎల్పీలో బుధవారం మహేశ్ గౌడ్ మీడియాతో చిట్‌చాట్

మిగతా 13వ పేజీలో...

ప్రాయోజిత సంక్షోభం?

ఇండిగో విమానాల రద్దు ఉద్దేశపూర్వకమే కావొచ్చు

- పరిష్కారం కోసం అన్ని కోణాలనూ పరిశీలిస్తున్నాం
- అవసరమైతే ఇండిగో సీఈవోను తొలగిస్తాం
- జరిమానాలు, అత్యంత కఠిన చర్యలు ఉంటాయి
- వారం రోజులుగా సరిగా నిద్రకూడా పోలేదు
- పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు
- బుధవారం 250కుపైగా ఇండిగో సర్వీసులు రద్దు



న్యూఢిల్లీ, డిసెంబరు 10: ఇండిగో సంక్షోభం, భారీగా విమానాల రద్దు ఉద్దేశపూర్వకమే అయి ఉండొచ్చని పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. సంక్షోభం ముందు వరకు ఉన్న పరిస్థితి, విమాన సర్వీసుల నిర్వహణ తీరును చూస్తే.. అసలు ఇలా

మిగతా 2వ పేజీలో...



భూకేటాయింపులో అందరికీ సమన్యాయం

కేకే కుమార్తె, కుమారుడికి తక్కువ ధరకు ఎలా ఇస్తారు: హైకోర్టు

తప్పక ఇవ్వాలనుకుంటే మార్కెట్ ధర ప్రకారం ఇవ్వాలని ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొందరికి మాత్రమే అనుకూలంగా వ్యవహరించకుండా, అందరిని సమదృష్టితో చూడాలని హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రస్తుత కాంగ్రెస్ నేత కె.కేశవరావు కుమారుడు కె.వెంకటేశ్వరరావుకు బంజారా హిల్స్ ఎన్‌బీటీ నగర్ (మురికివాడ)లోని సర్వే నెంబర్ 140లో రూ.2,500 చొప్పున కేటాయించిన 1,161 చదరపు గజాలు, కుమార్తె, జీహెచ్ఎంసీ మేయర్

మిగతా 12వ పేజీలో...



నోరు జాగ్రత్త!

కర్ణాటక శాసన సభలో ద్వేషపూరిత వ్యాఖ్యల వ్యతిరేక బిల్లు

కులం, ధార్మిక అంశాలపై ఇతరులకు బాధ కలిగించేలా మాట్లాడితే జైలే

సంజ్ఞలు, రాతలు కూడా ద్వేషపూరిత వ్యాఖ్యలుగా పరిగణన

2



పట్టు కాదు.. పాలిస్టర్

టీటీడీలో వెలుగుచూసిన మరో స్కామ్

శ్రీవారిని దర్శించే ప్రముఖులు, భక్తులకు కప్పే పట్టు వస్త్రాల కొనుగోళ్లలో కక్కుర్తి

2015-25 మధ్య 55 కోట్లకు సరఫరా

ఏసీబీ విచారణకు టీటీడీ లేఖ

13

పిల్లనిస్తామని ఇంటికి పిలిచి.. చంపేశారు



శ్రవణ్‌సాయి

యువతి ప్రేమికుడి పట్ల ఆమె తల్లిదండ్రుల ఘాతుకం

తలపై బ్యాట్‌తో కొట్టి హత్య

బీరంగూడలో ఘోరం

2

భర్తను హత్యచేసిన భార్య

2

ఫోన్ మాట్లాడొద్దంటే.. గొడ్డలితో కొట్టింది

ఫోన్ మాయలో పడి ఇంటిపనులు చేయట్లేదని భర్త తిట్టడంతోనే దాడి

ఏపీలోని అల్లూరి జిల్లా చింతపల్లిలో..



భారత్‌లో అమెజాన్ 3.15 లక్షల కోట్ల పెట్టుబడులు

2030 నాటికి ఇన్వెస్ట్ చేయనున్న సంస్థ

10 లక్షల ఉద్యోగాలకు చాన్స్

9

దీపావళికి యునెస్కో గుర్తింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 10: వయస్సుతో సంబంధం లేకుండా కోట్లాది మంది ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొనే పండుగ దీపావళి. యునెస్కో గుర్తింపుతో ఆ పండుగకు అంతర్జాతీయ ఖ్యాతి దక్కింది. ఢిల్లీ ఎర్రకోట వేదికగా యునెస్కో కీలక సమావేశం జరుగుతోంది. ఇన్‌టాంజబుల్ కల్చరల్ హెరిటేజ్ (ఐసీహెచ్)ని సంరక్షించడమే ధ్యేయంగా అంతర్ ప్రభుత్వ కమిటీ ఎప్పటికప్పుడు సమావేశమవుతూ ఉంటుంది. భారతదేశం తొలిసారిగా ఈ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చింది. ఈ నెల 8న ప్రారంభమై.. 13వ తేదీ వరకు జరిగే ఈ సమావేశాల్లో 80 దేశాల నుంచి వచ్చిన 67 ప్రతిపాదనలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. దీపావళికి యునెస్కో గుర్తింపు ఇస్తూ బుధవారం ప్రకటన వెలువడగానే ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు.

ఎఫ్-35 కావాలంటే ఎస్-400 వదులుకోండి

» టర్కీకి తేల్చి చెప్పిన అమెరికా

వాషింగ్టన్, డిసెంబరు 10: ఎఫ్-35 యుద్ధ విమానాలు కొనాలనుకుంటే రష్యాతో చేసుకున్న ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ కొనుగోలు ఒప్పందం రద్దు చేసుకోవాలని టర్కీకి అమెరికా తేల్చి చెప్పింది. దీనికి సంబంధించి అధ్యక్షుడు ట్రంప్‌తో టర్కీ అధ్యక్షుడు ఎర్దోగెన్ కొన్ని నెలలుగా చర్చలు జరుపుతున్నారని అమెరికా రాయబారి బరాక్ వెల్లడించారు. అమెరికా చట్టాల ప్రకారం టర్కీ తాము చెప్పినట్లు వింటేనే ఎఫ్-35 కొనుగోళ్లకు అనుమతిస్తామని ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. వాస్తవానికి అమెరికా నుంచి వంద ఎఫ్-35 యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలని టర్కీ యోచిస్తోంది.

భద్రత కల్పించండి.. 3 నెలల్లో ఎన్నికలు

» ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

కీవ్, వాషింగ్టన్, డిసెంబరు 10: యుద్ధాన్ని సాకుగా చూపి ఎన్నికలు నిర్వహించకుండా దాటవేస్తున్నారంటూ అమెరికా అధ్యక్షుడు తనపై చేసిన ఆరోపణలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. అమెరికా, యూరప్ దేశాలు తమకు తగిన భద్రతను కల్పిస్తే 2 నుంచి 3 నెలల్లోనే ఎన్నికలు నిర్వహిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలనేవి ఉక్రెయిన్ ప్రజల కోసం జరగాలి తప్ప ఇతర దేశాల కోసం కాదని తేల్చి చెప్పారు. అధికారాన్ని పట్టుకు వేలాడుతున్నారని తనపై వస్తోన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. 2019లో 73% ఓట్లతో జెలెన్‌స్కీ గెలుపొందాక 2022లో రష్యా ఉక్రెయిన్‌పై దాడికి దిగింది. గత ఏడాదే జెలెన్‌స్కీ పదవికి గడువు ముగిసింది. అయినా ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని ట్రంప్ తప్పుబట్టారు. అయితే తమ దేశ చట్టం ప్రకారం యుద్ధ సమయంలో ఎన్నికలు నిర్వహించరని జెలెన్‌స్కీ చెబుతున్నారు.

భారత్ నుంచి అత్యుత్తమ ట్రేడ్ ఆఫర్

» భారత్‌తో అమెరికా వాణిజ్య చర్చల ప్రతినిధి జేమీసన్ గ్రీర్

వాషింగ్టన్/జైపూర్, డిసెంబరు 10: స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత్‌తో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని అమెరికా చర్చల ప్రతినిధి జేమీసన్ గ్రీర్ తెలిపారు. మంగళవారం అమెరికా సెనేట్ కమిటీ ముందు హాజరై వాణిజ్య చర్చల పురోగతిని వివరించారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతిపై కొంత అభ్యంతరా లు ఉన్నా.. మొత్తంగా చర్చల్లో భారత్ సానుకూలంగా ఉందని చెప్పారు. కొన్ని పంటల దిగుమతి విషయంలో భారత్‌లో నిరసన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. అమెరికా ప్రతినిధి బృందం ప్రస్తుతం ఢిల్లీలోనే ఉందని, చర్చలు కొనసాగుతున్నాయని వివరించారు. అమెరికా ఉత్పత్తుల కోసం తన మార్కెట్‌ను తెరిచేందుకు భారత్ సిద్ధంగానే ఉందని చెప్పారు. అమెరికాతో వాణిజ్య చర్చల్లో మంచి పురోగతి ఉందని భారత వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా తెలిపారు. జైపూర్‌లో నిర్వహిస్తున్న రాజస్థానీ ప్రవాసీ దివస్‌లో బుధవారం ఆయన మాట్లాడారు.

సుంకాలపై సుప్రీం కోర్టు వ్యతిరేక తీర్పుతో దేశ భద్రతకే ముప్పు: ట్రంప్

వాషింగ్టన్, డిసెంబరు 10: అమెరికా ఇతర దేశాలపై సుంకాలు విధించడంపై ఆ దేశ సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతున్న వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. సుంకాలు విధించే అంశంలో అధ్యక్షుడి అధికారాలను పరిమితం చేసేలా సుప్రీం కోర్టు తీర్పునిస్తే అది దేశ భద్రతకే ముప్పు అని హెచ్చరించారు. అధ్యక్షుడు ట్రంప్ ఇష్టమొచ్చినట్టుగా విదేశాలపై సుంకాలు విధించడాన్ని సవాలు చేస్తూ పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఆ పిటిషన్లపై యూఎస్ సుప్రీం కోర్టులో నవంబరు 5 నుంచి విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో ట్రంప్ స్పందించారు.

భారత్‌లో సుఖోయ్-57 ఇంజన్ల తయారీ!

» సాంకేతికత బదిలీకి రష్యా గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ, డిసెంబరు 10: భారత్ సొంతంగా ఐదవ తరం యుద్ధ విమానాలు తయారు చేసుకునే దిశగా కీలక ముందడుగు పడింది. వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన అనంతరం.. సుఖోయ్-57ఈ జెట్ ఇంజన్ల సాంకేతికతను భారత్‌కు బదిలీ చేయడానికి రష్యా ఆమోదించినట్టు తెలిసింది. ఈ ఒప్పందంలో భాగంగా సుఖోయ్-57ఈ ఫైటర్ జెట్లలో ఉపయోగించే అత్యాధునిక ఇజ్డెలియే 177ఎస్ థ్రస్ట్-వెక్టరింగ్ టర్బో ఫ్యాన్ ఇంజన్లను ఒడిసాలోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) కోరాపుట్ డివిజన్‌లో తయారు చేస్తారని ఓ నివేదిక తెలిపింది. ఈ విషయం అధికారికంగా ధ్రువీకరించనప్పటికీ... ఈ ఒప్పందం కుదిరి భారత్‌లో సుఖోయ్-57ఈ ఇంజన్లు తయారు చేస్తే.. ఐదవ తరం ఫైటర్ ప్రొపల్షన్‌ను స్వదేశీయంగా అభివృద్ధి చేసే సామర్థ్యం కలిగిన నాలుగో దేశంగా భారత్.. రష్యా, అమెరికా, చైనా సరసన నిలవనుంది.

శశి థరూర్‌కు వీర్ సావర్కర్ అవార్డు

» స్వీకరించబోనని ప్రకటించిన కాంగ్రెస్ నేత

న్యూఢిల్లీ, డిసెంబరు 10: కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు 'వీర్ సావర్కర్' అవార్డును ఇవ్వనున్నట్లు హైరేంజ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్‌ఆర్‌డీఎస్) అనే సంస్థ ప్రకటించింది. వీర్ సావర్కర్ పేరిట ఏర్పాటుచేసిన ఈ అంతర్జాతీయ అవార్డుకు తొలిసారిగా శశిథరూర్‌తో పాటు మరి కొందరు ప్రముఖులను ఎంపిక చేసినట్లు తెలిపింది. అవార్డును ఇవ్వనున్నట్లు శశి థరూర్‌కు తెలియజేశామని సంస్థ కార్యదర్శి అజీ కృష్ణన్ ప్రకటించారు. అయితే ఆ అవార్డును తాను స్వీకరించబోనని శశిథరూర్ బుధవారం స్పష్టం చేశారు. అవార్డు స్వభావం, దానిని అందజేసే సంస్థ గురించి సరైన వివరాలు లేకపోవడమే అందుకు కారణమన్నారు.

ప్రాయోజిత సంక్షోభం?



(మొదటి పేజీ తరువాయి)

జరిగి ఉండాల్సిందే కాదని చెప్పారు. అవసరమైతే ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్‌ను తొలగించేందుకు, భారీగా జరిమానాలు విధించేందుకు కూడా సిద్ధమని తెలిపారు. ఇండిగోపై కఠిన చర్యలు చేపడతామని, భవిష్యత్తులో విమానయాన శాఖను ఎవరూ తేలికగా తీసుకోలేని స్థాయిలో ఈ చర్యలు ఉంటాయని చెప్పారు. బుధవారం టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రామ్మోహన్‌నాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇండిగో సంక్షోభం వెనుక ఏదో ఉద్దేశపూర్వక అంశం ఉన్నట్టు కనిపిస్తోంది. వారి నిర్వహణ తీరు, సర్వీసులపై వారికి ఉన్న పట్టును బట్టి చూస్తే.. ఈ సంక్షోభం ఏర్పడి ఉండకూడదు. అంతేకాదు ప్రత్యేకంగా ఆ సమయంలోనే సమస్య ఎందుకు మొదలైంది. అది ఎలా సంక్షోభానికి దారితీసిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి" అని కేంద్ర మంత్రి చెప్పారు. ఈ అంశాలన్నింటిపైనా లోతుగా విచారణ సాగుతోందని వెల్లడించారు. ఇక ఇండిగో సీఈవోను తొలగించవచ్చనే ప్రచారం జరుగుతున్న విషయాన్ని ప్రస్తావించగా.. "ఒకవేళ అవసరమైతే కచ్చితంగా తొలగిస్తాం. అంతేకాదు విధించేందుకు అవకాశమున్న అన్ని జరిమానాలు వేస్తాం. ఇండిగో సంక్షోభానికి సంబంధించి అన్ని కోణాలనూ పరిశీలిస్తున్నాను. గత ఏడు రోజులుగా నేను సరిగా నిద్ర కూడా పోలేదు. చాలా సేపు ఆఫీసులోనే ఉండి పరిస్థితులను సమీక్షిస్తూనే ఉన్నాను.." అని రామ్మోహన్ నాయుడు చెప్పారు. విమానయాన సంస్థలు, ఇతర భాగస్వామ్య పక్షాలతో విస్తృతంగా చర్చించిన తర్వాతే 'విమాన విధుల సమయ పరిమితి (ఎఫ్‌డీటీఎల్)' నిబంధనలను అమల్లోకి తెచ్చామని స్పష్టం చేశారు. విమానయాన శాఖ మంత్రిగా ఈ రంగాన్ని వేగంగా అభివృద్ధిలోకి తీసుకెళ్లడం తన బాధ్యత అని, ఈ క్రమంలో ఏర్పడే ఇండిగో సంక్షోభం వంటివి ఆ బాధ్యతను మరింత పెంచుతాయని చెప్పారు. సంక్షోభం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులకు క్షమాపణలు తెలిపారు.

సీఈవో, ఉన్నతాధికారులకు డీజీసీఏ పిలుపు

విమానయాన సంక్షోభం నేపథ్యంలో ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్, వివిధ విభాగాల ఉన్నతాధికారులను తమ ముందు హాజరుకావాల్సిందిగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశించింది. విమానాల రద్దు, సర్వీసుల పునరుద్ధరణ, పైలట్లు, ఇతర సిబ్బంది సంఖ్య, కొత్తగా నియామకాల కోసం చేస్తున్న ఏర్పాట్లు సహా అన్ని వివరాలతో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రావాలని స్పష్టం చేసింది. ఇక ఇండిగో సంస్థ రోజువారీ వ్యవహారాలను పరిశీలించడానికి డీజీసీఏ 8 మందితో పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేసింది. అందులో ఇద్దరు అధికారులు ఇండిగో కార్పొరేట్ కార్యాలయంలో రోజువారీ వ్యవహారాలను, విమాన సర్వీసుల నిర్వహణ, రద్దు, రీఫండ్లు, ఇతర అంశాలను పరిశీలిస్తారని తెలిపింది.

సంక్షోభ పరిష్కారం సరే.. ముందేం చేశారు?: హైకోర్టు

పెద్ద సంఖ్యలో ఇండిగో విమానాల రద్దు సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం మంచి చర్యలే చేపట్టిందని.. కానీ అసలు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది, అప్పటివరకు ప్రభుత్వం ఏం చేస్తోందని ఢిల్లీ హైకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. ఒకవైపు సంక్షోభం కొనసాగుతుంటే.. మరోవైపు ఇతర విమానయాన సంస్థలు భారీగా చార్జీలు పెంచేయడాన్ని ఎలా అనుమతించారని నిలదీసింది. ఇండిగో సంక్షోభం నేపథ్యంలో ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేలా, టికెట్ చార్జీలు పూర్తిగా రీఫండ్ చేయించేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై చీఫ్ జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్‌రావుల ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. అనూహ్యమైన పరిస్థితులతోపాటు మరికొన్ని అంశాలు విమానాల రద్దుకు కారణమయ్యాయని.. అయితే ప్రయాణికుల ఇబ్బందులను తొలగించడానికి పౌర విమానయాన శాఖ, డీజీసీఏ పకడ్బందీ చర్యలు చేపట్టాయని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. కానీ దీనిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. "సంక్షోభం నెలకొన్న సమయంలో ఇతర విమానయాన సంస్థలు భారీగా ధరలు పెంచుకునేందుకు ఎలా అనుమతించారు? సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని కేంద్రాన్ని ఆదేశించింది. విచారణను జనవరి 22వ తేదీకి వాయిదా వేసింది.

11 విమానాశ్రయాల్లో డీజీసీఏ తనిఖీలు

ఇండిగో సంక్షోభం 9వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా 11 ప్రధాన విమానాశ్రయాల్లో తనిఖీలు నిర్వహించాలని డీజీసీఏ నిర్ణయించింది. విమానాల రద్దు, ఆలస్యం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, ప్రయాణికుల రద్దీ, వారికి అవసరమైన సౌకర్యాలు, విమానయాన సంస్థలు, విమానాశ్రయ నిర్వహణ సంస్థల సిబ్బంది సరిపడా ఉన్నారా? అనేది పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ప్రయాణికులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకోవాలని సూచించింది. గురువారం సాయంత్రానికల్లా నివేదికలు ఇవ్వాలని పేర్కొంది. కాగా, బుధవారం దేశవ్యాప్తంగా 250కి పైగా ఇండిగో సర్వీసులు రద్దయ్యాయి. అందులో ఢిల్లీ, బెంగళూరుల నుంచే సగం సర్వీసులు ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

లోకం తీరు



నోరు జాగ్రత్త!

» కర్ణాటక శాసన సభలో ద్వేషపూరిత వ్యాఖ్యల వ్యతిరేక బిల్లు

» కులం, ధార్మిక అంశాలపై ఇతరులకు బాధ కలిగించేలా మాట్లాడితే జైలే

బెంగళూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఇకపై నలుగురిలో మాట్లాడేటప్పుడు నోరు అదుపులో ఉంచుకోవాల్సిందే. ద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తే జైలుకు వెళ్లాల్సి రావచ్చు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. శాసనసభ శీతాకాల సమావేశాల్లో ద్వేషపూరిత వ్యాఖ్యల వ్యతిరేక బిల్లును బుధవారం ప్రవేశపెట్టింది. కులం, సమాజం, లింగ, లైంగిక, జన్మస్థలం, ధార్మిక అంశాలను ప్రస్తావిస్తూ.. ఇతరులకు బాధ కలిగించేలా వ్యాఖ్యలు చేస్తే జరిమానా, జైలు శిక్ష విధించాలన్నది ఈ బిల్లు ఉద్దేశం. ఈ బిల్లును ఈ నెల 4న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన ఈ బిల్లును హోం శాఖ మంత్రి పరమేశ్వర సభలో ప్రవేశపెట్టారు. ఈ సమయంలో స్పీకర్ యూటీ ఖాదర్ మూజువాణి ఓటింగ్‌కు అనుమతించగా, ప్రతిపక్ష బీజేపీ సభ్యులు వ్యతిరేకిస్తూ డివిజన్‌కు పట్టుబట్టారు. అయితే స్పీకర్ బిల్లులను సభలో ప్రవేశపెట్టేందుకు అనుమతించారు. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే.. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి లేదా సమూహం లేదా మరణించిన వారిపై ఉద్దేశపూర్వక వ్యాఖ్యలు, సంజ్ఞలు, రాతలు, దృశ్య, ఎలక్ట్రానిక్ సమాచార వ్యవస్థల ద్వారా చేసే దుష్ప్రచారం చేసే ప్రతి చర్యను ద్వేషపూరిత వ్యాఖ్యలుగా పరిగణిస్తారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసినవారికి తొలిసారి ఏడాది నుంచి ఏడేళ్లపాటు జైలు శిక్షతో పాటు రూ.50 వేలు జరిమానా విధిస్తారు. పునరావృతమైతే రెండేళ్ల నుంచి పదేళ్ల వరకు జైలుశిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తారు. ఈ నేరాలను నాన్‌బెయిలబుల్ కేసులుగా పరిగణిస్తారు. ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులోనే శిక్షలు విధించేలా బిల్లును రూపొందించి, శాసనసభలో ప్రవేశపెట్టారు. పరిషత్ ముందుకు ఈ బిల్లు గురువారం వచ్చే అవకాశం ఉంది. కాగా.. బిల్లు సభలో ప్రవేశపెట్టడంపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అజెండాలో ద్వేషపూరిత వ్యాఖ్యల వ్యతిరేక బిల్లు భాగమని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విద్వేష పూరిత వ్యాఖ్యలను అంగీకరించబోమని స్పష్టంచేశారు.

షా ✗ రాహుల్

» ఎన్నికల సంస్కరణలపై పార్లమెంటులో వాడీ వేడి చర్చ



న్యూఢిల్లీ, డిసెంబరు 10: పార్లమెంటులో బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మధ్య మాటల తూటాలు పేలాయి. ఎన్నికల సంస్కరణలపై చర్చలో భాగంగా పరస్పర సవాళ్లు చోటుచేసుకున్నాయి. ఎన్నికల కమిషన్ సహకారంతో బీజేపీ ఓటు చోరీకి పాల్పడుతోందంటూ రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలపై అమిత్‌షా తీవ్రంగా స్పందించారు. ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షం అబద్ధాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా ఎవరుండాలన్నది చొరబాటుదారులు నిర్ణయిస్తే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుందా? అని ప్రశ్నించారు. గత చరిత్రను ప్రస్తావిస్తే ప్రతిపక్షానికి కోపం వస్తుందని, కానీ.. ఏ దేశమైనా, సమాజమైనా చరిత్రను విస్మరించి ముందుకు ఎలా సాగుతుందని అన్నారు. "నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో 1952, 1957, 1961లో ఎస్ఐఆర్ చేపట్టారు. ఆపై లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల హయాంలోనూ ఎస్ఐఆర్ చేపట్టారు. అనంతరం వాజపేయి, మన్మోహన్ సింగ్‌ల హయాంలోనూ జరిగింది. ఆయా సందర్భాల్లో ఏ రాజకీయ పార్టీ కూడా దీనిని వ్యతిరేకించలేదు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, ప్రజాస్వామ్యం ఆరోగ్యకరంగా ఉండాలని కోరుకోవడమే ఇందుకు కారణం" అని అమిత్ షా అన్నారు. గత నాలుగు నెలలుగా ప్రజలను ఎస్ఐఆర్‌పై తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆక్షేపించారు. దీనిపై రాహుల్ స్పందిస్తూ.. గత మూడు మీడియా సమావేశాల్లో తాను మాట్లాడిన అంశాలపై చర్చించేందుకు సిద్ధమా? అంటూ అమిత్‌షాకు సవాల్ విసిరారు. తాను ప్రస్తావించిన అంశంపై హోంమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే తాను ఏం మాట్లాడాలన్నది ప్రతిపక్ష నేత నిర్దేశించలేరంటూ అమిత్‌షా ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా ఎస్ఐఆర్ అనేది దొడ్డిదారిలో ఎన్ఆర్‌సీని అమలు చేయడమేనని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. మత ప్రాతిపదికన ఎంపిక చేసుకున్న ప్రజల ఓటుహక్కును తొలగించేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరితమైన ప్రక్రియ అని అన్నారు.

సీఐసీ నియామకాలపై రాహుల్ అసమ్మతి నోట్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఈ కమిటీ బుధవారం పార్లమెంటులోని ప్రధాని చాంబర్‌లో భేటీ అయ్యింది. దాదాపు గంటన్నర సాగిన వారి సమావేశం సమాచార కమిషనర్ల నియామకంపై ఎటూ తేల్చకుండానే ముగిసింది. ఇందులో పాల్గొన్న రాహుల్‌గాంధీ నియామకాలపై తన అసమ్మతి నోట్‌ని ఇచ్చినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. కాగా ప్రధాని నేతృత్వంలోని సమాచార కమిషనర్ల నియామక కమిటీ ఈ నెల 10వ తేదీన సమావేశమై నియామకాలపై నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర ప్రభుత్వం ఈ నెల 1వ తేదీనే సుప్రీంకోర్టుకు తెలియజేసింది. కాగా కాంగ్రెస్ గతంలోనూ(2020) సీఐసీ నియామక ప్రక్రియను తప్పుబట్టింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఈ ప్రక్రియ చేపడుతున్నారని ఆరోపించింది. కేంద్ర సమాచార కమిషన్ వద్ద ప్రస్తుతం 30,838 కేసులు పెండింగ్‌లో ఉండగా కేవలం ఇద్దరు కమిషనర్లు ఆనంది రామలింగం, వినోద్ కుమార్ తివారి మాత్రమే అందుబాటులో ఉన్నారు. సీఐసీగా ఉన్న హీరాలాల్ సమారియాకు 65 ఏళ్లు నిండడంతో సెప్టెంబరు 13వ తేదీన పదవీ విరమణ చేశారు. కాగా, సీఐసీ నియామకంపై ప్రధాని మోదీ, రాహుల్‌గాంధీ 88 నిమిషాలపాటు భేటీ కావడంపై పార్లమెంటు కారిడార్‌లలో ఎంపీల మధ్య పెద్ద ఎత్తున చర్చ సాగింది. రాహుల్‌గాంధీ బయటకు వచ్చాకగానీ.. వారికి ఈ సమావేశం కేవలం సీఐసీ నియామకంపైనే కాదని, మరో 8 మంది సమాచార కమిషనర్లతోపాటు ఒక విజిలెన్స్ కమిషనర్ నియామకంపై జరిగిందన్న విషయం తెలియలేదు. ఆ నియామకాలన్నిటిపై రాహుల్ తన అభ్యంతరాలను రాతపూర్వకంగా తెలియజేశారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

మత్తు అడ్డాలుగా విద్యాలయాలు

» పదకొండేళ్లకే పిల్లల్లో డ్రగ్స్ వినియోగం

» గోప్యంగా సర్వే జరిపిన మెడికల్ బృందాలు

» ప్రతి ఏడు స్కూళ్లలో ఒకచోట డ్రగ్స్ భూతం

న్యూఢిల్లీ, డిసెంబరు 10: జ్ఞాన వనాలుగా ఉండాల్సిన విద్యాలయాలు గంజాయి వనాలుగా మారుతున్నాయని ఓ అధ్యయనంలో తేలింది. స్కూలుకు వెళ్లే పిల్లలు 12.9 ఏళ్లకే మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, కొందరైతే పదకొండేళ్లు వచ్చేటప్పటికే మత్తుకు బానిసలు అవుతున్నారంటూ ఈ అధ్యయనం మన విద్యావ్యవస్థపై ప్రమాద ఘంటికలు మోగించింది. హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, ముంబై, లఖ్‌నవూ, చండీగఢ్, ఇంఫాల్, జమ్మూ, దిబ్రూగఢ్, రాంచీ నగరాల పరిధిలో సగటున 14.7 ఏళ్ల వయసు కలిగిన 5,920 మంది విద్యార్థులపై గోప్య పద్ధతిలో ఈ అధ్యయనం సాగింది. దానిని నివేదిక రూపంలో నేషనల్ మెడికల్ జర్నల్ ఆఫ్ ఇండియాలో ప్రచురించారు. 'మీరు డ్రగ్స్ తీసుకుంటారా' అని బహిరంగంగా మమ్మల్ని అడిగితే లేదనే మేం సమాధానం చెబుతాం' అని తాము కలిసిన విద్యార్థుల్లో ఎక్కువమంది తెలిపారని ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన ఢిల్లీ, ఎయిమ్స్‌లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ అధిపతి డాక్టర్ అంజూ ధావన్ తెలిపారు. చండీగఢ్, దిబ్రూగఢ్, లఖ్‌నవూ, బెంగళూరు, శ్రీనగర్, ఇంఫాల్, ముంబై, హైదరాబాద్, రాంచీలకు చెందిన వైద్య కళాశాలలకు చెందిన బృందాలు ఈ అధ్యయనంలో పాలుపంచుకున్నాయి. అధ్యయనం జరిపిన ప్రతి ఏడు స్కూళ్లలో కనీసం ఒకచోట విద్యార్థులు కనీసం ఒక్కసారైనా తాము డ్రగ్స్ తీసుకున్నట్టు తెలిపారు. మగపిల్లలు పొగాకు ఉత్పత్తులు, గంజాయి అధికంగా తీసుకుంటే, ఆడపిల్లలు నల్లమందు గోలీలు, ఇతర మాదక ద్రవ్యాలు ఎక్కువగా వాడుతున్నారు.

హెచ్1బీ వీసా ఇంటర్వ్యూలు రద్దు

వాషింగ్టన్, డిసెంబరు 10: హెచ్1బీ వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాల పరిశీలన తప్పనిసరి చేయడంతో పెద్ద సంఖ్యలో వీసా ఇంటర్వ్యూలు రద్దయ్యాయి. ఇది అనేకమంది ప్రయాణ ప్రణాళికలను దెబ్బకొట్టింది. ఈనెల 15 నుంచి ఈ కొత్త నిబంధన అమల్లోకి రానున్న నేపథ్యంలో హెచ్1బీ వర్కర్లు, వారి కుటుంబసభ్యుల్లో అనిశ్చితి నెలకొంది. ట్రంప్ సర్కారు తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధన వల్ల పెద్ద సంఖ్యలో వీసా ఇంటర్వ్యూలు రీషెడ్యూల్ అవుతున్నాయి. దీంతో అనేకమంది దరఖాస్తుదారుల ప్రయాణాలు హఠాత్తుగా రద్దవుతున్నాయి. ఈనెల మధ్య నుంచి నెలాఖరు వరకు నిర్వహించాల్సిన ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లను హైదరాబాద్, చెన్నై సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాన్సులేట్లు రద్దు చేశాయని ఇమ్మిగ్రేషన్ లాయర్లు తెలిపారు. వీటిలో అనేక స్లాట్లను వచ్చే ఏడాది మార్చికి వాయిదా వేయడంతో వారి ప్రయాణ ప్రణాళికలను మార్చుకోవాల్సి వస్తోంది. అయితే, తాజా నిబంధన నేపథ్యంలో రోజువారీ ఇంటర్వ్యూల సంఖ్యను కాన్సులేట్లు తగ్గిస్తున్నాయి. దీనివల్ల అనేకమంది ఇంటర్వ్యూలు రద్దవుతున్నాయి. వీసా రద్దయినవారిలో 8 వేలమందికిపైగా విద్యార్థులు ఉన్నారని అమెరికా విదేశాంగశాఖ సీనియర్ అధికారి తెలిపారు. రద్దైన వీసాల్లో దాదాపు సగం.. మద్యం మత్తులో వాహనం నడపడం, చోరీ, దాడి తదితర కారణాలతోనే రద్దయ్యాయన్నారు. ఉగ్రవాదాన్ని సమర్థించడం వంటి తీవ్రమైన కారణాలు, గడువు ముగియడం వంటి పరిపాలనాపరమైన కారణాల వల్ల కూడా వీసాలు రద్దు చేశామని అంతకుముందు మీడియాకు విదేశాంగశాఖ వెల్లడించింది.

వైద్య విద్య పీజీ ప్రవేశాలకు నోటిఫికేషన్

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియకు నోటిఫికేషన్ విడుదలైంది. 2025-26 విద్యాసంవత్సరానికి పీజీ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలతో పాటు నిమ్స్‌లో ఉన్న పీజీ డిగ్రీ, డిప్లొమో సీట్లను ఈ కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తారు. యూనివర్సిటీ విడుదల చేసిన తుది మెరిట్ జాబితాలో పేరున్న అభ్యర్థులంతా ఈ కౌన్సెలింగ్‌కు అర్హులని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా డిసెంబరు 10న సాయంత్రం ఐదున్నర గంటల నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రారంభంకాగా ఈ నెల 13వ తేదీ శనివారం ఉదయం ఆరు గంటల వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. టీఎస్‌పీజీఎంఈడీ.టీఎస్‌సీహెచ్‌ఈ. ఐఎన్ వెబ్‌సైట్‌లో విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని వర్సిటీ సూచించింది. వెబ్ ఆప్షన్ల నమోదులో ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే 93926 85856, 78421 36688, 90596 72216 నంబర్లలో వర్సిటీ అధికారులను సంప్రదించవచ్చు.


పిల్లనిస్తామని పిలిచి చంపేశారు

అమీన్‌పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరూ చాలా కాలంగా ప్రేమించుకుంటున్నారు.. విషయం పెద్దలకు తెలిసింది.. కులాలు వేరు కావడంతో అమ్మాయి తల్లిదండ్రులు వారి ప్రేమకు అడ్డు చెప్పారు. తమ కుమార్తెతో తిరగొద్దంటూ పలుమార్లు హెచ్చరించారు. అయినా, వారు పట్టించుకోలేదు. ఎలాగైనా వారిని విడదీయాలని భావించిన అమ్మాయి తల్లిదండ్రులు.. పెళ్లి చేస్తామంటూ వారిని నమ్మించారు. పథకం ప్రకారం అబ్బాయిని ఒంటరిగా ఇంటికి రమ్మని పిలిచారు. అది నిజమేనని నమ్మి వచ్చిన అతన్ని.. అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు కలిసి.. కొట్టి చంపేశారు! ఈ దారుణ ఘటన సంగారెడ్డి జిల్లా బీరంగూడలో చోటుచేసుకుంది.

ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన శ్రవణ్‌సాయి (19)కి తల్లిదండ్రులు లేరు. అమీన్‌పూర్‌లో ఉంటున్న పెదనాన్న కాకాని వెంకటేశ్వరరావు దగ్గర ఉంటున్నాడు. బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న శ్రవణ్.. ప్రస్తుతం కుత్బుల్లాపూర్‌లో గది అద్దెకు తీసుకుని ఉంటూ మైసమ్మగూడలోని కాలేజీకి వెళ్లి వస్తున్నాడు. బీరంగూడలోని సృజనలక్ష్మి కాలనీలో ఉండే శ్రీజ (19), శ్రవణ్‌సాయి పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఈ క్రమంలో వారి మధ్య ప్రేమ చిగురించింది. ప్రస్తుతం వేర్వేరు చోట్ల చదువుతున్నా వారి మధ్య ప్రేమ కొనసాగుతూనే ఉంది. ఓసీ వర్గానికి చెందిన శ్రవణ్ పేరిట సు మారు 20 ఎకరాల భూమి ఉంది. ఇతర సామాజిక వర్గానికి చెందిన శ్రీజ తల్లిదండ్రులకు వీరి ప్రేమ నచ్చలేదు. దీంతో పలుమార్లు శ్రవణ్‌ని హెచ్చరించారు. అయినా వారు వెనక్కి తగ్గలేదు. ఇలాగైతే వారిని విడదీయడం సాధ్యం కాదనుకున్న శ్రీజ తల్లిదండ్రులు పథకం ప్రకారం.. పెళ్లి చేస్తామంటూ వారిని కొంత కాలంగా నమ్మించడం ప్రారంభించారు. పెళ్లి విషయం మాట్లాడుకుందామని, ఒంటరిగా రావాలని శ్రవణ్‌ని పిలిచారు. మంగళవారం సాయంత్రం అతను బీరంగూడలోని శ్రీజ ఇంటికి వచ్చాడు. శ్రవణ్ లోపలికి రాగానే తలుపులు పెట్టి, అప్పటికే సిద్ధంగా ఉన్న తల్లిదండ్రులు, వారి బంధువులు మూకుమ్మడిగా దాడికి దిగారు. శ్రీజ తండ్రి ప్రసాద్, తల్లి సిరి క్రికెట్ బ్యాటుతో శ్రవణ్ తలపై మోదడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం తెల్లవారు జామున అతన్ని కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయాడని వైద్యులు తేల్చారు. పథకం ప్రకారమే శ్రవణ్‌ని హత్య చేశారని అతని పెదనాన్న కాకాని వెంకటేశ్వరరావు ఆరోపించారు. గతంలోనే శ్రవణ్‌ను హత్య చేస్తామని ప్రసాద్ బెదిరించాడన్నారు. 'ఆ అమ్మాయే తరచూ కాలేజీ వద్దకు వెళ్లి నన్ను పెళ్లి చేసుకో.. మా ఇంటికి వచ్చి మాట్లాడు' అని శ్రవణ్‌ను బతిమిలాడేదని వెంటేశ్వరరావు తెలిపారు. శ్రీజ కుటుంబసభ్యులు శ్రవణ్‌ను హతమార్చారంటూ అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రేమ వ్యవహారంలో తలెత్తిన వివాదంతోనే యువకుడి హత్య జరిగిందని పోలీసులు తెలిపారు. తల, పక్కటెముకలు, కాళ్లపై తీవ్రమైన గాయాలు కావడంతోనే శ్రవణ్ మృతి చెందినట్లు తెలుస్తోందన్నారు. ప్రసాద్ విజయవాడలో రైల్వే ఉద్యోగి అని, ఆయన సిరితో సహజీవనం చేస్తున్నారని పోలీసు వర్గాలు తెలిపాయి.

భర్తను హత్య చేసిన భార్య.. ఫోన్ మాట్లాడొద్దన్నందుకు గొడ్డలితో దాడి

చింతపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ అతిగా మాట్లాడుతూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నావంటూ మందలించిన భర్తపై భార్య గొడ్డలితో దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీ మేడూరు గ్రామంలో కిల్లో రాజారావు (46), దేవి దంపతులు నివాసముంటున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. దేవి రెండేళ్లుగా ఫోన్‌లో ఓ వ్యక్తితో మాట్లాడుతోంది. ఎవరితో మాట్లాడుతున్నావు?, ఫోన్‌లో ఎక్కువ సమయం వెచ్చిస్తూ ఇంటిపనులు చేయడం లేదని ప్రశ్నించినా ఆమె సమాధానం చెప్పేది కాదు. దీనిపై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం దేవి ఫోన్‌లో మాట్లాడుతుండడంతో రాజారావు ఆగ్రహానికి గురయ్యాడు. ఫోన్‌లో అదేపనిగా ఎందుకు మాట్లాడుతున్నావు?, ఆపేయమంటూ గద్దించాడు. ఆగ్రహానికి గురైన దేవి మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో నిద్రిస్తున్న భర్త తలపై గొడ్డలి వెనుక భాగంతో గట్టిగా కొట్టింది. దీంతో రాజారావు స్పృహ కోల్పోయాడు. అతని పక్కన నిద్రిస్తున్న కుమారుడు లేచి చూడగా తండ్రి చెవులు, నోరు, ముక్కు నుంచి రక్తస్రావం అవుతోంది. వెంటనే అక్కను నిద్రలేపి విషయం చెప్పాడు. ఆమె చుట్టుపక్కల వారికి చెప్పడంతో 108 వాహనంలో రాజారావును చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మంగళవారం ఉదయం కేజీహెచ్‌కు తరలించారు. రాజారావు చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. అన్నవరం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



Kia Seltos
Badass. Forever.

Bigger in stance, longer in profile, and stronger in presence, the all-new Seltos has arrived with a reinvigorated sense of authority. The new design strikes harder, the Trinity Panoramic Display amplifies the cabin, Ventilated Seats bring comfort, and ADAS Level 2 equips you with unmatched confidence. A complete transformation that carries forward the one thing that never changed: its unmistakable badass attitude. Experience the all-new Seltos today!

Commanding Presence Advanced, with attitude


Command-Centric Trinity Panoramic Display


Over-the-Air (OTA) Software Updates with Kia Remote Diagnostics*


Dual Pane Panoramic Sunroof


Iconic R18 - 46.20 cm (18") Sporty Crystal Cut Alloy Wheels with Neon Brake Calipers


ADAS Level 2 with 21 Autonomous Features*


Front, Rear and Side Parking Sensors

Robust 24 Hi-Safety Package
STANDARD ACROSS ALL VARIANTS

Front Dual Airbags | Front Seat Side Airbags | Side Curtain Airbags | Highline Tyre Pressure Monitor | ABS (Anti-lock Brake System) | BAS (Brake Assist System) | ESC (Electronic Stability Control) | VSM (Vehicle Stability Management) | HAC (Hill-start Assist Control) | ESS (Emergency Stop Signal) | Child Lock | All Wheel Disc Brakes | Rear Parking Sensors x4 | Speed Sensing Auto Door Locks | Impact Sensing Auto Door Unlock | Front & Rear All Seat 3-Point Seat Belts with Reminder | ISOFIX (Rear Anchors) | Front Passenger Airbag On/ Off Switch | Front Passenger Airbag On/ Off Indicator | Rear Occupant Alert | DBC (Downhill Brake Control) | Rollover Sensor | Auto Light Control & Headlamp Escort Function | Rear View Camera with Dynamic Guidelines

Kia Service
Connected · Adaptive · Responsive · Engage

3 Years Unlimited km Warranty | Extended Warranty* Up to 7 Years | My Convenience Plus* Best-in-class Cost of Ownership | Scratch Care Program* | IoT Based Smart Services* | 24x7 | 3 Years Nationwide RSA*

Bookings open | **Call** 1800 108 5000 | **Visit** www.kia.com | Kia Seltos | Look for "Kia India" @

*Terms & Conditions Apply. The product & feature images shown in this ad is for representation purpose only. Features and specifications as shown may not be part of standard fitment and may vary. The colors shown are subject to availability and may not be available across all variants and may differ slightly from those shown in this ad. The specifications and features may vary depending on models/ variants. As a standard feature in defined segment. Segment is defined as Mid SUV whose length lies between 4 220-4 460 mm and width between 1 760-1830 mm. ADAS features are for driver assistance only. Driver is responsible for safe and attentive driving. For details on functioning of ADAS, Safety, Kia Connect 2.0 features kindly refer to the owners manual. Kia India Pvt. Ltd. (Formerly known as Kia Motors India Private Limited) reserves the right to make any changes with respect to the trims, colors, specifications, Kia Connect 2.0 features and other details of any model as mentioned in this ad to discontinue any model without prior notice. For more details visit your local Kia dealership. Kia India Pvt. Ltd. urges you to follow traffic rules, these are meant to keep you safe on roads. We do not endorse vandalism or illegal activities related to road safety. Safety is a top priority, and we urge responsible behavior regarding traffic regulations and road safety.

FOR INFORMATION CONTACT: TELANGANA: WARANGAL: MALIK KIA, PH: 9703433333, HYDERABAD: PROSPERA KIA, MALAKPET, PH: 8047361444, SOMAJIGUDA, PH: 8047361555, CAR KIA, FINANCIAL DISTRICT, PH: 7330888041, JUBILEE HILLS, PH: 7997858880, GACHIBOWLI, PH: 7799906846, AUTOMOTIVE KIA, KONDAPUR, PH: 7995699908, NAGOLE, PH: 7995999404, RC PURAM, PH: 6309908117, AS RAO NAGAR, PH: 7670858585, LANDMARK KIA, MEDIPALLY, PH: 9281428303, MALIK KIA, KUKATPALLY, PH: 7399346666, HIMAYATNAGAR, PH: 7995999340, KARIMNAGAR: MALIK KIA, PH: 7730911111, KHAMMAM: AUTOMOTIVE KIA, PH: 6309908189, MAHBUBNAGAR: AUTOMOTIVE KIA, PH: 7075764442, NALGONDA: AUTOMOTIVE KIA, PH: 6309908183, NIZAMABAD: SUNRISE KIA, PH: 7995944482, SECUNDERABAD: LANDMARK KIA, BOWENPALLY, PH: 9281000983, AUTOMOTIVE KIA, PH: 7399417777, MANCHERIAL: SUNRISE KIA, PH: 7416662030, SHADNAGAR: AUTOMOTIVE KIA, PH: 9014152478, ANDHRA PRADESH: ANANTAPUR: MGB KIA, PH: 8333929195, BHIMAVARAM: SIMHA KIA, PH: 8688836542, CUDDAPPAHA: HOSHI KIA, PH: 8688829739, GUNTUR: SIMHA KIA, PH: 8688836566, KAKINADA: KANTIPUDI KIA, PH: 7314852686, KURNOOL: MGB KIA, PH: 8500963906, NELLORE: HOSHI KIA, PH: 8688829718, RAJAHMUNDRY: KANTIPUDI KIA, PH: 7799740208, TIRUPATI: HOSHI KIA, PH: 8688829739, CHITTOOR: HOSHI KIA, PH: 9281405123, VIJAYAWADA: CASA KIA, PH: 8345959595, SIMHA KIA, PH: 8688836501, VISAKHAPATNAM: CASA KIA, PH: 8565959595, LAKSHAMI KIA, PH: 7997878615, ONGOLE: SANKAR KIA, PH: 8886624966, KUNCHANAPALLI: SIMHA KIA: PH: 7799981582, NANDYAL: MGB KIA, PH: 8500963906

INNOCEAN-064/25

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

న్యాయం కోసం...

కేరళలో ఎనిమిదేళ్లక్రితం ఒక మలయాళ నటి కిడ్నాప్, లైంగిక దాడికి సంబంధించిన కేసు ఊహించని మలుపు తిరిగింది. నిందితుల్లో ఒకరైన నటుడు దిలీప్‌ను సోమవారం ఎర్నాకుళం కోర్టు నిర్దోషిగా ప్రకటించింది, మరో ముగ్గురికి ఉపశమనం కల్పించింది. మిగతా ఆరుగురికీ న్యాయస్థానం 12వ తేదీన శిక్షలు ఖరారుచేయబోతోంది. తమిళం, మలయాళం, తెలుగు, కన్నడ చిత్రాల్లో నటించిన ఆ నటిని 2017 ఫిబ్రవరి 17 రాత్రి కొందరు దుండగులు అపహరించి, కారులో రెండుగంటలపాటు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ దారుణ ఘటనలో పోలీసులు దిలీప్ సహా పదిమంది మీద కిడ్నాప్, గ్యాంగ్ రేప్ వంటి తీవ్ర అభియోగాలు నమోదుచేశారు. అదే ఏడాది జూలైలో అరెస్టయిన దిలీప్ నాలుగు నెలలు జైలులో ఉండి బెయిల్ మీద బయటకు వచ్చారు. నటిపై దాడిఘటనలో తన ప్రమేయం లేదని, పోలీసులే తనమీద కక్షకట్టారని ఆరోపించిన దిలీప్, ఒక దశలో ఈ కేసును సీబీఐ విచారించాలంటూ అభ్యర్థించాడు కూడా. దిలీప్‌ను దిగువ కోర్టు వదిలివేసినా, తాము వదిలేది లేదని, తీర్పును హైకోర్టులో సవాలు చేస్తామని పినరాయ్ విజయన్ ప్రభుత్వం ప్రకటించింది.

మలయాళ సినీరంగాన్ని తీవ్రంగా కుదిపేసి, నిలువునా చీల్చేసి, కేరళ సమాజాన్ని అతలాకుతలం చేసిన కేసు ఇది. దర్యాప్తు, విచారణ కొనసాగిన ఈ ఏడేళ్ల కాలంలో మీడియా తోచింది వార్చింది. దిలీప్ పక్షాన ఉన్నందుకు కొందరు, నటిని వెనకేసుకు వచ్చినందుకు మరికొందరు ప్రముఖులు తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అర్ధరాత్రి నీకేమి పని అంటూ నటిని తప్పుబట్టి, మెప్పుపొందినవారూ లేకపోలేదు. ఈ తీర్పు నేపథ్యంలో ఎవరీ హనీ వర్గీస్ అంటూ ఏడేళ్ళుగా ఈ కేసును పర్యవేక్షిస్తున్న న్యాయమూర్తి మీద మీడియా ప్రత్యేక కథనాలను అందిస్తోంది. తన కేసులో స్పెషల్ జడ్జి కోసం బాధితురాలు చేసిన విజ్ఞప్తి మేరకు వర్గీస్‌కు హైకోర్టు ఈ కేసు అప్పగించడం, ఆ తరువాత బాధితురాలు, రాష్ట్ర ప్రభుత్వం కూడా జడ్జిని మార్చవలసిందిగా హైకోర్టుకు పోవడం విచిత్రమైన పరిణామాలు. జడ్జినీ, ఆమె భర్తనూ ప్రభావితం చేసేందుకు దిలీప్ ప్రయత్నించినట్టుగా ఆయన ఫోన్‌లో ఒక ఆడియోక్లిప్ దొరకడం దీనికి కారణం. దిలీప్‌తో జడ్జి మెత్తగా వ్యవహరిస్తున్నారని, తనను మాత్రం కన్నీళ్ళుపెట్టిస్తున్నారని కూడా బాధితురాలు ఆరోపించారు. ఇలా కనీసం మూడుసార్లు బాధితురాలు హైకోర్టును ఆశ్రయించినా జడ్జిని మార్చలేదు. కేసు విచారణ త్వరితగతిన పూర్తి చేయాలన్న సుప్రీంకోర్టు కూడా విధిలేక గడువు ఎనిమిదిసార్లు పొడిగించాల్సి వచ్చింది. ఫోన్‌లో సమాచారాన్ని చెరిపివేసినందుకు ప్రయత్నించి దిలీప్ లాయర్లు కూడా అరెస్టయ్యారు. పలుమార్లు ప్రభుత్వ న్యాయవాదులు, దర్యాప్తు అధికారులు మారిపోయారు.

నలభైమంది సాక్షులు ఎదురు తిరిగి కేసు బలహీనపడింది. నటితో పాటు దిలీప్ సెలబ్రిటీ స్టేటస్ వల్ల సమాజం, మీడియా ఈ కేసు మీద ఎక్కువ దృష్టిపెట్టడం, ముందస్తు తీర్పులు ఇచ్చేయడం సహజం. ఆ ఒత్తిడికి అతీతంగా నిలవడం కోర్టులకు పెద్దపరీక్ష. దాడికి గురైన నటి ఐదేళ్ల తరువాత మౌనం వీడి, ఆ ఘోరం గురించీ, తాను అనుభవించిన మానసిక క్షోభ, లైంగికదాడి ప్రభావం నుంచి బయట పడటానికి చేసిన ప్రయత్నాల గురించీ మాట్లాడారు. సమాజంలోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ దూషణలు, వ్యక్తిత్వహననాలు ఎదుర్కొన్నారామె. ఈ దాడి ఘటన అనంతరం ఏర్పాటైన హేమా కమిటీ మలయాళ పరిశ్రమలో మహిళలు వేతనాల నుంచి వేధింపుల వరకూ ఎంతటి వివక్షాపూరిత, దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారో బయటపెట్టింది. ఈ రిపోర్టు మొత్తంగా భారతీయ సినీపరిశ్రమను సైతం ప్రభావితం చేసి, సినీరంగంలో మహిళల పక్షాన సమూలమార్పులకు దోహదం చేస్తుందన్న ఆశ ఆశించిన స్థాయిలో నెరవేరలేదు.

నటిని అపహరించి, లైంగికదాడిచేసి, ఆ నేరాన్ని చిత్రీకరించడానికి దిలీప్ ఈ గూండాలను కొన్నాడన్న పోలీసుల మాట కోర్టు నమ్మకుండా, ప్రధాననేరగాడు పల్సర్ సునీల్‌కూ దిలీప్‌కూ పరిచయమే లేదన్న వాదనను విశ్వసించినందున ఈ చోటా నేరగాళ్ళకే రేపటి రోజున కఠిన శిక్షలు పడవచ్చు. ప్రభుత్వమూ, ప్రధానంగా బాధితురాలు అత్యున్నత న్యాయస్థానంవరకూ పోయి పోరాడాలని సంకల్పించినందున ఈ వ్యథ కథ ఇంకా ముగియనట్టే. ఎప్పుడో బయటకు వచ్చేసిన దిలీప్ ఇప్పటికే పాతహోదాలు, గౌరవాలు తిరిగి సంపాదించుకున్నాడు, ఇప్పుడు ఏకంగా ఘనస్వాగతాలు, జేజేలూ అందుకుంటున్నాడు. ఇప్పటికే తన జీవితాన్ని, కెరీర్‌ను కోల్పోయిన ఆమె మాత్రం న్యాయంకోసం ఇంకా పోరాడుతూనే ఉండాలి.

తిరోగమిస్తున్న భారత ప్రజాస్వామ్యం!

నీవు 'దేశ్, కాల్, పత్ర' గురించి మాట్లాడుతున్నావు కదూ అని నా మిత్రుడు, భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ విజయ్ మహాజన్ వ్యాఖ్యానించారు. అవును, దేశ్ (నియోజకవర్గ సరిహద్దులు), కాల్ (ఎన్నికల సమయం), పత్ర (ఓటర్ల జాబితా) మార్చడం గురించి నేను మథన పడుతున్నాను. మన ఎన్నికల వ్యవస్థలో సంభవించనున్న మూడు పెనుమార్పులను సూచిస్తున్న విషయాలవి. మహాజన్‌తో జరిగిన మాటామంతీతో డీ–లిమిటేషన్ (2026 జనాభా గణన ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన), వన్ నేషన్, వన్ టైమ్ (ఒక దేశం, ఒక ఎన్నిక (పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలకు ఒకేసారి ఎన్నికల నిర్వహణ), ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్– సర్) మధ్య పరస్పర సంబంధమూ, అది జాతీయ అధికార పక్షానికి సమకూర్చే శాశ్వత నిర్మాణాత్మక ప్రయోజనం గురించి నాకు మరింత మెరుగైన అవగాహన ఏర్పడ్డది.



■ యోగేంద్ర యాదవ్

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే మంగళవారం లోక్‌సభలో, బుధవారం రాజ్యసభలో 'ఎన్నికల సంస్కరణల'పై చర్చ జరిగింది. ఎన్నికల సంస్కరణ అనేది అందమైన భావన. అది గతించిన ఒక అమాయక కాలాన్ని గుర్తుచేస్తుంది. తమను అత్యున్నత చట్టసభకు తీసుకువచ్చి, తద్వారా అధికారాన్ని అప్పగించిన నియమ నిబంధనలను మార్చాల్సిన ఆవశ్యకత విషయమై పార్లమెంటేరియన్లకు నచ్చజెప్పి, వారిని ఒప్పించడం సాధ్యమయ్యే నిష్కపటత్వం ఉన్న రోజులవి. అయితే యమునా నదిలో నాటికీ నేటికీ చాలా మురికినీరు ప్రవహించింది సుమా!

> **నియోజకవర్గాల పునర్విభజన, ఒకే దేశం–ఒకే ఎన్నిక, ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కలసికట్టుగా భారతదేశ ప్రజాస్వామ్య రేటింగ్‌ను మరింతగా దిగజార్చే అవకాశం ఉన్నది. ఇప్పటికే ఇండియాను 'ప్రజాస్వామిక తిరోగమనం'కు ఒక నిదర్శనాధ్యయనంగా 'ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్' పేర్కొంది. గత ఐదు సంవత్సరాలుగా 'విశ్వసనీయ ఎన్నికలు' సహా వివిధ సూచికలపై భారత్ గణనీయమైన గణాంక తగ్గుదలను నమోదు చేసిందని ఆ సంస్థ నివేదిక వెల్లడించింది.**

ఎన్నికల వ్యవస్థలో ఆవశ్యక మార్పుల విషయమై ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్' పద్ధతి (ఓటర్లు ఒకే అభ్యర్థికి ఓటు వేసే బహుళ ఓటింగ్ వ్యవస్థ. అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి విజేత అవుతాడు) నుంచి దామాషా ప్రాతినిధ్యానికి మారే విషయమై చర్చించాం. అలాగే ఎన్నికలలో ధనబలం, కండబలం ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకురావాల్సిన చట్టాల గురించీ తర్జన భర్జనలు పడ్డాం. చివరకు ఇప్పుడు ఎన్నికల సమగ్రత, నిష్పాక్షికత కనీసంగానైనా ఉండేలా తీసుకోవల్సిన జాగ్రత్తలు మొదలైన అంశాల గురించి తర్కిస్తున్నాం. నిజానికి ఎన్నికల 'సంస్కరణల' గురించి కాకుండా ప్రస్తుత పాలకుల విధానాల వల్ల ఎన్నికల వ్యవస్థలో సంభవిస్తోన్న వికృతాలను నిరోధించే విషయమై పార్లమెంటు చర్చించడం యుక్తంగా ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను.

ఎన్నికలలో అక్రమాలు సంభవించడమనేది భారత్‌కే పరిమితమైన పరిణామం కాదు. ఎన్నికల నిర్వహణా నియమాలను నిరంకుశ పాలకులు తమకు అనుకూలంగా మార్చుకోవడమనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్నది. ఇరవయో శతాబ్ది నియంతలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అయితే 21వ శతాబ్ది నిరంకుశ పాలకుల పరిస్థితి వేరు. తమకు ప్రజల మద్దతు పూర్తిగా ఉన్నదని చూపాల్సిన అవసరం వీరికి ఉన్నది. కనుకనే ఎన్నికలను పూర్తిగా రద్దు చేయలేకపోతున్నారు. అలా అని ఎన్నికలు నిర్వహించి తమ అధికారానికి ప్రమాదాన్ని కొనితెచ్చుకోలేరు. అందుకే రెండు కుయుక్తులకు పాల్పడుతున్నారు. ఒకటి– ఎన్నికలు నిర్వహించే రాజ్యాంగ సంస్థను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు; రెండోది రాజకీయ పోటీని యథాతథంగా ఉంచుతూ ఎన్నికల నియమాలు పూర్తిగా పాలకులకే అన్ని విధాలా అనుకూలంగా ఉండేలా చేస్తున్నారు. సమకాలీన ప్రపంచంలో హంగేరీ, తుర్కియే, వెనిజువెలా, ఈక్వెడార్, బొలీవియా, కెన్యా, థాయిలాండ్, మయన్మార్ మొదలైన దేశాల తులనాత్మక రాజకీయాల పరిశోధకులు నిగ్గుదేల్చిన 'దుర్వినియోగ రాజ్యాంగవాదం' (అబ్యూసివ్ కాన్‌స్టిట్యూషనలిజమ్ – ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు, నిరంకుశ పాలనను నెలకొల్పేందుకు రాజ్యాంగ విధానాలను అనుసరించడం), 'నిరంకుశ చట్టబద్ధత' (ఆటోక్రాటిక్ లీగలిజం– అధికారాన్ని ఏకీకృతం చేసేందుకు, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు స్వస్తిచెప్పేందుకు చట్టపరమైన పద్ధతులను ఉపయోగించడం), 'ఎలెక్టోరల్ టిల్టింగ్' (ఓటింగ్ చట్టాలను మార్చడం, మీడియా కథనాలను నియంత్రించడం తదితర చర్యల ద్వారా వ్యవస్థలను నిజమైన ప్రజాస్వామ్యం కంటే పోటీ నిరంకుశత్వం వైపు కదిలించడం) మొదలైన అప్రజాస్వామిక పాలనా రీతులకు ఉదాహరణలుగా ఉన్నాయి. గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్న పాలకులు, అసమ పోటీ అవకాశాలను కల్పించేందుకు చట్టబద్ధమైన, పాలనా యంత్రాంగాలను ఉపయోగించుకుంటున్నారు. చట్టాలలోను, పాలనా సంస్థలలోను క్రమంగా తీసుకొచ్చిన మార్పులు భారత్‌లో పార్టీ– రాజ్య వ్యవస్థ ఏకీభవనం (పార్టీ– స్టేట్ ఫ్యూజన్)ను ఎలా సృష్టించాయో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ న్యాయశాస్త్ర ఆచార్యుడు తరునాభ్ ఖైతాన్ తన పరిశోధనా పత్రం 'కిల్లింగ్ ఎ కాన్‌స్టిట్యూషన్ విత్ ఎ థౌజండ్ కట్స్'లో చూపారు.

ఈ విశ్లేషణను దేశ్, కాల్, పత్రకు పొడిగిద్దాం. బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఉన్నత బాధ్యతల్లో



ఉన్న పెద్ద మనిషి ఒకరు 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రత్యక్ష ప్రసారాలను వీక్షిస్తూ సహజంగానే కలవరపడి ఉంటారు. తమ పార్టీ బలహీనతలు మూడింటిని ఆయన గుర్తించి ఉంటారు. దేశ్– తూర్పు తీరస్థ రాష్ట్రాలలో బీజేపీని వ్యతిరేకించిన ప్రాంతాలు ఉన్నాయి; కాల్– ఎన్నికల సమయాలు ఏటా బీజేపీ ఆధిపత్యానికి పరీక్ష పెడుతున్నాయి; పత్ర– సమాజంలో దిగువ స్థాయిలో ఉన్న కొన్ని వర్గాలు బీజేపీకి ఓటు వేసినప్పుడు కూడా ఆ పార్టీని విశ్వసించడం లేదు. ఈ బలహీనతలను అధిగమించేందుకు ఆయనకు ఒక ఆలోచన వచ్చి ఉంటుంది. అది– నియోజకవర్గాల పునర్విభజన, ఒక దేశం–ఒక ఎన్నిక, ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణల కలయిక.

నియోజకవర్గాల పునర్విభజన (డీ–లిమిటేషన్) బీజేపీకి రెండు ప్రయోజనాలను సమకూరుస్తుంది. 2026 జనాభా లెక్కల ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో బీజేపీ ఓట్లు, సీట్ల పరంగా బలహీనంగా ఉన్న నియోజకవర్గాల సంఖ్యను తగ్గిస్తుంది. తద్వారా, ఆ పార్టీ తలపెట్టే రాజ్యాంగ సవరణలకు ప్రతికూలతనూ తగ్గిస్తుంది. బీజేపీ సాపేక్షంగా బలహీనంగా ఉన్న రాష్ట్రాలు (కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బెంగాల్, పంజాబ్) సీట్లను కోల్పోతాయి. ఎక్కువ నియోజకవర్గాలు ఉండే రాష్ట్రాలు (ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్) బీజేపీకి కంచుకోటలు అవుతాయి. ఇదంతా రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా జరుగుతుంది. నియోజకవర్గాల పునర్విభజనను ఇప్పటికే అస్సాం, జమ్మూ–కశ్మీర్‌లలో ప్రయోగాత్మకంగా అమలుపరిచారు. దేశవ్యాప్తంగా దానిని అమలుపరిచినప్పుడు కనీసం డజన్‌కు పైగా సీట్లు బీజేపీ వైపు మొగ్గుతాయి.

ఒక దేశం, ఒక ఎన్నిక అనేది బీజేపీకి రెండు ప్రయోజనాలను సమకూరుస్తుంది. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల అధికారంలో ఉన్న పార్టీకి పరిస్థితులు అనుకూలమవుతాయి. అసెంబ్లీ ఎన్నికలలో కూడా బాగా లబ్ధి పొందే అవకాశాలు ఉంటాయి.

బీజేపీకి అనుకూలంగా లేని వ్యక్తులకు, సామాజిక సమూహాలకు ఓటింగ్ హక్కులు నిరాకరిస్తున్న 'సర్' ఈ కథకు తగిన ముక్తాయింపు. బిహార్ దృష్టాంతాన్ని ('సర్'కు ముందున్న ఓటర్ జాబితాల నుంచి నికరంగా 44 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు) బట్టి దేశవ్యాప్త 'సర్' ఓటర్ జాబితాల నుంచి ఐదు కోట్లకు పైగా ఓటర్ల పేర్లను తొలగించే అవకాశమున్నదని పలువురు అంచనా వేస్తున్నారు. ప్రపంచ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది అతిపెద్ద ఓటు హక్కు తొలగింపు కార్యక్రమమనడంలో సందేహం లేదు. ఇలా ఓటు హక్కు నిరాకరణకు గురైనవారిలో అత్యధికులు పేదలు, మైనారిటీలు, వలస కార్మికులు అనేది గమనార్హం. ఓటర్‌గా నమోదు చేసుకునే బాధ్యతా భారాన్ని పూర్తిగా ఓటర్లపై మోపడం కూడా ఆ తొలగింపులకు ఒక ప్రధాన కారణమని చెప్పితీరాలి. ఇలా తొలగింపునకు గురైన వారిలో బీజేపీ మద్దతుదారులు చాలా తక్కువ మంది కనుక 'సర్' ప్రక్రియతో బీజేపీకి ఇంచుమించు ఎటువంటి నష్టం ఉండదు. తన సంస్థాగత బలిమి, స్థానిక అధికారుల మద్దతుతోను తన విధేయ ఓటర్లను ఓటుహక్కు తొలగింపు ప్రక్రియ నుంచి బీజేపీ కాపాడుకోగలుగుతుంది. ఈ విషయంలో దేశ పాలకపక్షం తన ప్రత్యర్థి రాజకీయ పక్షాల కంటే చాలా చాలా మెరుగ్గా ఉన్నది. 'సర్'ను రూపొందించిన తీరు. దాన్ని అమలుపరుస్తున్న వైనాన్ని గమనిస్తే అత్యధిక ముస్లింల ఓటుహక్కు తొలగింపే ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ లక్ష్యమని అర్థమవుతుంది.

నియోజకవర్గాల పునర్విభజన, ఒకే దేశం–ఒకే ఎన్నిక, ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కలసికట్టుగా భారతదేశ ప్రజాస్వామ్య రేటింగ్‌ను మరింతగా దిగజార్చే అవకాశం ఎంతైనా ఉన్నది. అంతర్జాతీయ అంతర్– ప్రభుత్వ సంస్థ అయిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్ (అంతర్జాతీయ IDEA) ఇప్పటికే ఇండియాను 'ప్రజాస్వామిక తిరోగమనం'కు ఒక నిదర్శనాధ్యయనం (కేస్ స్టడీ)గా పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థను క్రమంగా నిరంకుశత్వం వైపు మళ్లించడమే ప్రజాస్వామ్య తిరోగతి. ఇది చట్టబద్ధమైన మార్గాల ద్వారా, తరచుగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకుల నిర్వాకాల వల్లే ఈ తిరోగతి సంభవిస్తోంది. గత ఐదు సంవత్సరాలుగా 'విశ్వసనీయ ఎన్నికలు' సహా వివిధ సూచికలపై భారత్ గణనీయమైన గణాంక తగ్గుదలను నమోదు చేసిందని ఆ సంస్థ 'గ్లోబల్ స్టేట్ ఆఫ్ డెమోక్రసీ' నివేదిక పేర్కొంది. 2026 సంవత్సరంలో ఇంటర్నేషనల్ IDEA సంస్థ అధ్యక్ష పదవిని భారత్ చేపట్టనున్నది భారత ప్రజాస్వామ్య ప్రస్థానం, ఎన్నికల పద్ధతులు, సమ్మిళిత పాలనకు నిబద్ధత మొదలైన నిర్దిష్ట అంశాలను అంతర్జాతీయ సమాజం రాబోయే సంవత్సరంలో నిశితంగా పరిశీలించనున్నది. ఈ బృహత్తర బాధ్యతను ఆ అంతర్జాతీయ సంస్థ ఎవరి ఆధ్వర్యంలో నిర్వహించనున్నదో తెలుసా? ఇంకెవరు? మన భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలోనే!

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ఉజ్వల తెలంగాణ దిశగా ఈ పరుగు!

రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అపారమైన విశ్వాసం కనిపిస్తుంటే ప్రతిపక్షాలకు, వాటిని మోస్తున్న కొన్ని మీడియా సంస్థలకు ఎక్కడలేని కంటగింపుగా మారింది. వారి అడ్డగోలు విమర్శలే ఇందుకు నిదర్శనం. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పుడు వందల కోట్లు ఖర్చు చేసి ఈ సదస్సులు ఎందుకని ఒకరు, వచ్చిన పెట్టుబడులన్నీ గోబెల్స్ అని మరొకరు, ఇంకో అడుగు ముందుకేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదంతా చేస్తున్నది తన రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసమే అని ఇంకొకరు... ఇలా దిగజారి విమర్శలు చేస్తున్నారు.

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలన్నీ ప్రపంచం నుంచి పెట్టుబడులను ఆకర్షించి, పరిశ్రమలను, మౌలిక వసతులను, సరికొత్త టెక్నాలజీలను, నూతన వ్యాపార పోకడలను అలవర్చుకోవడం ద్వారానే అభివృద్ధి చెందాయి. 1971లో యూరోపియన్ మేనేజ్‌మెంట్ ఫోరం దావోస్‌లో నిర్వహించిన ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను ప్రపంచంలో తొలి పెట్టుబడిదారుల సదస్సుగా పరిగణిస్తున్నారు. ఆ తర్వాత 1987లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు, 2008లో యునైటెడ్ నేషనల్ వరల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరం సదస్సు వంటివి ప్రపంచ ప్రగతికి కీలక చోదకశక్తులుగా నిలిచాయి.

మన దేశంలో ఇప్పటికే అనేక రాష్ట్రాలు ప్రపంచ పెట్టుబడి సదస్సులను నిర్వహించాయి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం దావోస్ లాంటి సదస్సుల్లో పాల్గొనేందుకు చూపించిన చొరవ, అటువంటి సదస్సులను హైదరాబాద్‌లో నిర్వహించడంలో ఏ మాత్రం చూపలేదు. 2003లో ప్రస్తుత ప్రధాని, ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ఏర్పాటు చేసిన 'వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'ను ప్రచార పర్వంగా కాకుండా ప్రజలకు పెట్టుబడులు వచ్చే గమ్యంగా మార్చాలని అక్కడి ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ సూచించిందే తప్పా నోటికి వచ్చిన విమర్శలు చేయలేదు. ఈ ఒక్క సదస్సులోనే గుజరాత్ ప్రభుత్వం రూ.87,000 కోట్ల విలువైన ఎంఓయూలు కుదుర్చుకున్నది. అప్పటిదాక ఓ మోస్తరు రాష్ట్రంగా ఉన్నదల్లా ఒక్కసారిగా ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎదిగింది. ఆ తర్వాత 2007లో మధ్యప్రదేశ్; 2010లో కర్ణాటక; 2015, 2019 సంవత్సరాల్లో రెండుసార్లు తమిళనాడు; 2018లో మహారాష్ట్ర ఇలాంటి గ్లోబల్ సమ్మిట్‌లను నిర్వహించి కోట్ల పెట్టుబడులు రాబట్టాయి. ఇదే వరుసలో రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్‌లు కూడా పెట్టుబడుల సదస్సులను నిర్వహించాయి. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఈ ఒక్క ఏడాదే విజయవాడలో 'ఇన్వెస్టోపియా గ్లోబల్ ఆంధ్రప్రదేశ్–2025'ను నిర్వహించింది, ఆ తర్వాత నవంబర్ నెలలో సీఐఐతో కలిసి నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో ఏకంగా గూగుల్ డేటా సెంటర్‌తో కలిపి దాదాపు రూ.13.25 లక్షల కోట్ల ఒప్పందాలను చేసుకుంది.



గరళం లాంటి ఆర్థికలోటును కంఠంలో దాచుకొని ఈ రాష్ట్రాన్ని గట్టెక్కించాలని భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు రేవంత్‌రెడ్డి. అందుకే 42 దేశాల నుంచి 1686 మంది ప్రతినిధులు, 225 మంది విదేశీ అతిథులతో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి రూ.5.75లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలతో ప్రపంచానికి తెలంగాణ పరిపాలన సత్తాను చాటాడు.

ఈ పెట్టుబడుల పోటీలో తెలంగాణ వెనకబడిపోకుండా మేటిగా నిలవాలనే తలంపుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాయు వేగంతో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025కు అంకురార్పణ చేశారు. యువ ముఖ్యమంత్రిగా ప్రతీ అవకాశాన్నీ అందుకుని రాష్ట్ర ప్రగతిపథాన్ని పరుగులు పెట్టించాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. గతంలో పాలించిన ముఖ్యమంత్రుల వలె రేవంత్‌కు ఈగో లేదు. నా రాష్ట్రం బాగుపడాలన్న ఉద్దేశం తప్ప, ప్రజల మనిషిని అని అనిపించుకోవాలన్న తపన తప్ప, ఆయనకు మరే యావా లేదు. మాటలతో కోటలు కట్టలేడేమో కానీ, చేతలతో తెలంగాణ బిడ్డలకు బంగారు భవిష్యత్తును మాత్రం నిర్మించగలడు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి కూడా ఆహా ఓహో అంటూ అబద్ధాలతో ఊదరగొట్టడం పెద్ద సమస్య కాదు. కానీ ఆర్థిక సమస్యలు అబద్ధాలతో నిండినప్పుడు ఎలాంటి నష్టాలు సంభవిస్తాయో సత్యం కంప్యూటర్స్ లాంటి ఒక సంస్థలో జరిగినప్పుడే ప్రజలు గమనించారు. ఇక అలాంటి విపత్తులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ స్థాయిలో జరిగితే ఎన్ని జీవితాలు ప్రభావితం అవుతాయో అన్నది ఊహకు అందని విషయం.

గరళం లాంటి ఆర్థికలోటును కంఠంలో దాచుకొని ఈ రాష్ట్రాన్ని గట్టెక్కించాలని భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు రేవంత్‌రెడ్డి. అందుకే 42 దేశాల నుంచి 1686 మంది ప్రతినిధులు, 225 మంది విదేశీ అతిథులతో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి రూ.5.75లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలతో ప్రపంచానికి తెలంగాణ పరిపాలన సత్తాను చాటాడు. ఇది కేవలం తెలంగాణ చరిత్రలోనే కాదు, యావత్ భారతదేశ సమ్మిట్ల చరిత్రలో ఒక రికార్డు!

2047 సంవత్సరానికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడం అంటే ప్రతీ సంవత్సరం అద్భుతమైన 8–9శాతం వృద్ధిరేటు సాధించాలి. ఈ లక్ష్యంతో, ప్రజల జీవితాలు ముడిపడ్డాయన్న భయాన్ని అధికారుల్లో నింపడం కోసమే ముఖ్యమంత్రి ఇంత శ్రమిస్తున్నారని చెప్పక తప్పదు. ఐటీలో అద్భుతాలు చేశామని ప్రగల్భాలు పలికే గత పాలకులు, వారి పదేళ్ళ పాలనలో హైదరాబాద్ ఎందుకు బెంగళూరును దాటలేకపోయిందన్న ప్రశ్నకు మాత్రం జవాబు చెప్పరు. ఇప్పుడు ఆ ఘనతను హైదరాబాద్ సాధించబోతున్నది. CURE, PURE, RARE వంటి ప్రణాళికలు రేవంత్‌రెడ్డిలోని దార్శనికతకు నిలువుటద్దంగా కనిపిస్తున్నాయి. కొందరు ప్రతిపక్ష నాయకులు గోబెల్స్ అని విమర్శించవచ్చు, కానీ ఇది గోబెల్స్ కాదు గోల్డెన్ గ్లోబల్ అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మీడియా కంపెనీ ఒప్పందాలు చెప్పకనే చెప్పాయి. ఇదే కాదు ఇతర కంపెనీలతో అవగాహనలు కూడా వడివడిగా జరిగాయి. అనేక కంపెనీలు డాటా సెంటర్ల ఏర్పాటుకు, ఫ్యూచర్ టెక్నాలజీస్ (AI, ML, Robotics) కంపెనీల స్థాపనకు, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ల ఏర్పాటుకు, రిన్యూవబుల్ ఎనర్జీ స్థాపనకు, హెల్త్ కేర్ & బయోటెక్ వంటి రంగాల్లో విస్తృతంగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారు. అందుకే రెండు రోజుల్లోనే రూ.5.75లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

"Stable Governance + Progressive Policies + Skilled Workforce = Telangana Advantage" అన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నినాదం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ప్రతీ బిడ్డకు ఉజ్వల భవిష్యత్తును సమకూర్చుతుందని, తెలంగాణలో ప్రతీ పౌరునికి బతుకుపై భరోసాని నింపుతుందని అనడంలో ఎటువంటి సంశయం లేదు. ఇది ఖచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వ ప్రతిభకు తార్కాణం, రేపటి ఉజ్వల తెలంగాణకు సోపానం.

• బత్తిని శ్రీనివాస్‌రావు
పీసీసీ సభ్యులు

విత్తన చట్టానికి ఈ సవరణలు చేయాలి


అరవై సంవత్సరాల తర్వాత కేంద్ర ప్రభుత్వం 'విత్తన చట్టం–2025' ముసాయిదాను రూపొందించి, ప్రజాభిప్రాయం కోసం ఇటీవల వ్యవసాయ మంత్రిత్వశాఖ వెబ్‌సైట్ (www.agriwelfare.gov.in/en/whatsnew/75)లో ఉంచింది. ఈ చట్టం ద్వారా విత్తనాలు, నర్సరీ మొక్కల నాణ్యతను నియంత్రించడం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. ఈ ముసాయిదా బిల్లును చూసిన రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు, మేధావులు, రైతు ప్రయోజనాల కోసం పనిచేస్తున్నవారందరూ నిరాశకు గురయ్యారు. మొత్తం 48 సెక్షన్లు, 10 అధ్యాయాలతో రూపొందించిన ఈ ముసాయిదాను పరిశీలిస్తే, ఇది "విత్తన చట్టమా, లేక కంపెనీలకు అనుకూలమైన చుట్టమా?" అనే సందేహం కలుగుతుంది.

కేంద్ర ప్రభుత్వం దీనిని ఒక మోడల్ చట్టంగా రూపొందించి అన్ని రాష్ట్రాలకు పంపాలి. తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయా రాష్ట్రాలు మార్పులు చేసుకుని, చట్టాలు రూపొందించుకోవడానికి అవకాశం కల్పించాలి. ఈ ముసాయిదా బిల్లుపై రాష్ట్ర రైతాంగం వారి అభిప్రాయాలను డిసెంబరు 11లోపు ఇ–మెయిల్ (jsseeds–agri@gov.in.) ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపాలి. ఈ బిల్లులో రైతుల ప్రయోజనాలను కాపాడేలా, విత్తన నాణ్యతను బలపరిచేలా, అన్ని వర్గాల ఉత్పత్తిదారులు–వ్యాపారులకు సమాన అవకాశాలు కల్పించేలా సవరణలు, అదనపు ప్రతిపాదనలు చేర్చాల్సిన అవసరం ఉంది.

ఈ ముసాయిదా చట్టం సెక్షన్–13 ప్రకారం ఏ పంట విత్తన రకమైనా రైతులకు అందించే ముందు తప్పనిసరిగా కేంద్ర విత్తన కమిటీ ద్వారా రిజిస్ట్రేషన్ పొందాల్సి ఉంటుంది. దీనిపై పూర్తి అధికారం కేంద్రానికి మాత్రమే ఉండటం వల్ల, రాష్ట్రాల భౌగోళిక–పర్యావరణ పరిస్థితులు, స్థానిక సాగు వ్యవస్థలు, రైతుల అవసరాలు రిజిస్ట్రేషన్ సమయంలో సక్రమంగా ప్రతిబింబించవు. కాబట్టి, ఈ సెక్షన్‌లో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా నిర్ణయాధికారాన్ని కల్పించేలా నిబంధనలను సవరించాలి.

సెక్షన్–16(1) ప్రకారం, కొత్త విత్తన రకం రిజిస్ట్రేషన్ పొందాలంటే ఆ రకం దిగుబడి, ఇతర అంశాలపై కేంద్ర విత్తన కమిటీ నియమించిన భారత వ్యవసాయ పరిశోధనా మండలి, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఇతర సంస్థలు నిర్వహించిన పరిశీలన నివేదికలు ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ఇలా ఇతర సంస్థలు సమర్పించే పరిశీలనలపై ఎక్కువగా ఆధారపడటం వల్ల చాలా అంశాలు పూర్తిగా నిర్ధారణ కావు. అందువల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత, శాస్త్రీయతను పెంచడానికి ప్రతిపాదించిన ప్రతి కొత్త రకాన్ని తప్పనిసరిగా భారత వ్యవసాయ పరిశోధనా మండలి లేదా సంబంధిత రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో కనీసం ఒక పంటకాలం ప్రత్యక్ష క్షేత్ర పరీక్షలు చేయాలని నిబంధనగా చేర్చాలి.

కేంద్ర ప్రభుత్వం 'విత్తన చట్టం–2025' ముసాయిదా రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు, మేధావులు, రైతు ప్రయోజనాల కోసం పనిచేస్తున్న వారిని నిరాశకు గురిచేసింది. ఈ బిల్లులో రైతుల ప్రయోజనాలు కాపాడేలా, విత్తన నాణ్యతను బలపరిచేలా, అన్ని వర్గాల ఉత్పత్తిదారులు–వ్యాపారులకు సమాన అవకాశాలు కల్పించేలా సవరణలు, అదనపు ప్రతిపాదనలు చేర్చాలి.



సెక్షన్–17(3), సెక్షన్–18(1) ప్రకారం విత్తన ఉత్పత్తిదారులు, శుద్ధి కేంద్రాలు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను పాటించినప్పుడే రిజిస్ట్రేషన్ పొందగలరు. దీనిని సవరించాలి. విత్తనోత్పత్తిదారులు, శుద్ధి కేంద్రాలు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఎవరైనా రిజిస్ట్రేషన్ పొందాలంటే బీఎస్సీ (వ్యవసాయం), వ్యవసాయ డిప్లొమా లేదా ప్రభుత్వరంగ సంస్థలు అందించే విత్తనోత్పత్తి–విత్తన సాంకేతికతకు సంబంధించిన సర్టిఫికెట్ కోర్సు తప్పనిసరి అర్హతగా చేర్చాలి.

సెక్షన్–21(1డి) ప్రకారం ఏ విత్తన విక్రయ సంస్థకు స్వీయ ధ్రువీకరణకు అనుమతి ఇవ్వడం వల్ల గతంలో నకిలీ, నాసిరకం విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చాయి. అందువల్ల రైతులను రక్షించాలంటే, స్వీయ ధ్రువీకరణ విధానాన్ని తొలగించి, ఏ విత్తనమైనా విక్రయానికి ముందు తప్పనిసరిగా ప్రభుత్వరంగ విత్తన ధ్రువీకరణ సంస్థలు, భారత వ్యవసాయ పరిశోధనా మండలి లేదా రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల ద్వారా అధికారిక ధ్రువీకరణ పొందాలన్న నిబంధన చేర్చాలి.

సెక్షన్–22 ప్రకారం, విత్తనాల ధరలు అసాధారణంగా పెరిగినప్పుడు లేదా కృత్రిమ కొరత ఏర్పడ్డప్పుడు మాత్రమే కేంద్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితుల్లో జోక్యం చేసుకోవచ్చు. అయితే, ధరల మార్పులు, సరఫరా లోపాలు ప్రతీ ఏడాది రైతులను ప్రభావితం చేస్తున్నందున, అత్యవసర పరిస్థితుల్లో కేంద్రం పర్యవేక్షణ సరిపోదు. స్థానిక పరిస్థితులు, డిమాండ్–సరఫరాపై రాష్ట్రాలకు ఎక్కువ అవగాహన ఉండటంతో, విత్తన సరఫరా, ధరల నియంత్రణ, మార్కెట్ పర్యవేక్షణ వంటి అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలకే కల్పించేలా చట్టాన్ని సవరించాలి.


సెక్షన్ 33(సి) ప్రకారం, ఇతర దేశాల్లో ధ్రువీకరించిన క్షేత్ర పరీక్షల ఆధారంగా విత్తనాలు దిగుమతి చేయవచ్చు. అయితే ఆ విత్తనాలు ఆ దేశ వాతావరణం, మట్టి, చీడ–పీడలు వంటి అంశాలకు అనుగుణంగా ఉండటం వల్ల, భారత్‌లో కూడా అలాగే పనిచేస్తాయని హామీ ఇవ్వడం సాధ్యం కాదు. కాబట్టి, విదేశీ విత్తనాలను రాష్ట్రంలో విక్రయించే ముందు కనీసం రెండు పంట సీజన్ల పాటు భారత వ్యవసాయ పరిశోధనా మండలి లేదా సంబంధిత రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల ద్వారా తప్పనిసరిగా క్షేత్ర పరీక్షలు నిర్వహించాలన్న నిబంధన ఉండాలి.

సెక్షన్ 34 ప్రకారం– రిజిస్టర్ చేయని, నాసిరకం లేదా నాణ్యత తక్కువ విత్తనాలను విక్రయించిన వ్యక్తులకు రూ.50 వేల నుంచి రూ.30 లక్షల వరకు జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష విధించవచ్చు. కానీ దీని సవరణలో.. లైసెన్స్ రద్దు చేసి, సంబంధిత ఉత్పత్తిదారులు, విక్రేతలు కనీసం ఐదేళ్ల పాటు విత్తన ఉత్పత్తి, విక్రయం చేయరాదన్న నిబంధన చేర్చాలి.

విత్తన చట్టం–2025లో ప్రధానంగా రెండు లోపాలు ఉన్నాయి. నకిలీ లేదా నాసిరకం విత్తనాల వల్ల రైతులకు పరిహారం కల్పించే సెక్షన్ లేకపోవడం; విత్తన ఉత్పత్తి రైతుల రక్షణకు ప్రత్యేక నిబంధనలు లేకపోవడం. కాబట్టి విత్తన ఉత్పత్తి అత్యంత నైపుణ్యం, అధిక సాగు ఖర్చు, కఠినమైన నాణ్యత–నియంత్రణలను అవసరం చేసే క్రమంలో రైతులకు చట్టపరమైన రక్షణ కల్పించడానికి ప్రత్యేక నిబంధనలు ఉండాలి. వీటిలో త్రిముఖ ఒప్పందాలు (రైతులు, విత్తన కంపెనీలు, వ్యవసాయశాఖ), విత్తన పంటకు బీమా, విత్తన రైతులకు జీవిత బీమా, విత్తనోత్పత్తిలో మధ్యవర్తుల వ్యవస్థపై పూర్తి నిషేధం, రైతుల దిగుబడిని కంపెనీలు అంగీకరించి నిర్ణీత ధరలో కొనుగోలు చేయడం వంటి ప్రమాణాలు ఉండాలి.

అంతేకాకుండా విత్తన కంపెనీలకు లైసెన్స్ జారీ చేసే విధానంపై కొన్ని ప్రత్యేక సూచనలు ఉన్నాయి. లైసెన్స్ ఇచ్చే కమిటీలో తప్పనిసరిగా ఐసీఏఆర్ లేదా సంబంధిత రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఉండాలి. విత్తన కంపెనీ ఏర్పాటుకు ఒక పరిశోధన విభాగం, 5–10 ఎకరాల స్థలం ఉండాలి. విత్తన రకం రిజిస్ట్రేషన్ కోసం కంపెనీ స్థాపించిన తర్వాత కనీసం 8–10 సంవత్సరాల కాల పరిశీలన, హైబ్రిడ్ అయితే కనీసం మూడేళ్ల కాల పరిశీలన ఉండేలా నిబంధన విధించాలి. ఈ సవరణలతో విత్తన చట్టం–2025 రైతుల ప్రయోజనాలను రక్షిస్తూ, నకిలీ విత్తనాల వ్యాప్తిని తగ్గించి, విత్తన ఉత్పత్తిలో నైపుణ్యం, నాణ్యత ప్రమాణాలు అమల్లో ఉండేలా తయారవుతుంది.

■ అల్దాస్ జానయ్య
ఉపకులపతి, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం



నేను ఓటరును..
ప్రలోభాలకు గురికాను!



'హలో.. నేను ఓటరును.. మా గ్రామంలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరుగుతున్నాయి. తెలిసిన బంధువులు ఒక వైపు, అత్యంత స్నేహితులు మరొక వైపు బరిలో ఉన్నారు. గెలిపించాలని అభ్యర్థిస్తున్న వారంతా నా వాళ్లే. ఎవరినీ కాదనలేను. కానీ ఇక్కడ ఎంతో విజ్ఞతగా ఆలోచిస్తున్నాను. గ్రామ పరిపాలనలకు మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు భారత రాజ్యాంగం నాకు ఓటు హక్కు అనే వజ్రాయుధాన్నిచ్చింది. కాబట్టి దుర్వినియోగం చేసుకోవద్దని భావిస్తున్నాను. ఓటరుగా నేను తప్పు చేస్తే ఐదేళ్ల పాటు మా గ్రామాభివృద్ధి వెనుకబడిపోతుంది. నిజాయితీ, నిబద్ధతతో పని చేసే వారు, గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేవారు, వివాదరహితులను మాత్రమే ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నాను. నిజాయితీగా, భయం లేకుండా, కుల, మత, వర్గ, ధన, పదవి భేదాలు లేకుండా నిష్పక్షపాతంగా ఓటు వేస్తాను. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఓటేస్తానని మనసా, వాచా, కర్మణ మీ ముందు ప్రతిజ్ఞ చేస్తున్నాను..'

- ఆంధ్రజ్యోతి, నయీంనగర్

అంతా అటెన్షన్

'తొలి విడత' తీర్పు నేడే..



పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం



హనుమకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ పడుతున్న అభ్యర్థుల భవిష్యత్తు తేలనున్నది. ఓట్లు వేయడానికి గ్రామీణ ఓటర్లు సిద్ధమయ్యారు. ఉద్యోగం, చదువు, ఉపాధి రీత్యా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేందుకు బుధవారం రాత్రే తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. అభ్యర్థులు కూడా రానుపోను చార్జీలు చెల్లించి వారిని రప్పించుకున్నారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. గంట విరామం తర్వాత మధ్యాహ్నం 2గంటలకు ఓట్ల లెక్కింపు చేపడతారు. ఆ వెంటనే సర్పంచ్, వార్డుసభ్యుల స్థానాల ఫలితాలను ప్రకటిస్తారు. ఆ తర్వాత ఎన్నికైన వార్డు సభ్యులతో ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. సభ్యులు చేతులెత్తడం ద్వారా ఉపసర్పంచ్‌లను ఎన్నుకుంటారు.

మూడు మండలాల్లో..

జిల్లాలో మొదటి విడత పోలింగ్ భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో జరుగుతుంది. ఈ మూడు మండలాల పరిధిలోని 69 సర్పంచ్, 658 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా వీటిలో నాలుగు గ్రామ పంచాయతీలు- భీమదేవరపల్లి మండలంలోని వీర్లగడ్డతండా, ఎల్కతుర్తి మండలంలోని గుంటూరుపల్లి, శాంతినగర్, కమలాపూర్ మండలంలోని కొత్తపల్లిలో సర్పంచ్, వార్డు సభ్యులతో సహా మొత్తంగా ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, భీమదేవరపల్లి మండలంలోని గాంధీనగర్

(మిగతా 8లో..)

మండలం	జీపీలు	ఏకగ్రీవం	అభ్యర్థులు	వార్డులు	ఏకగ్రీవం	అభ్యర్థులు	ఓటర్లు
భీమదేవరపల్లి	25	2	89	232	56	502	41,898
ఎల్కతుర్తి	20	2	69	180	42	361	32,491
కమలాపూర్	24	1	146	246	45	599	56,345



భీమదేవరపల్లిలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది

- ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్ మండలాల్లో పూర్తయిన ఏర్పాట్లు
- 64 పంచాయతీల్లో సర్పంచ్ బరిలో 264 మంది, వార్డులకు 1,339 మంది
- ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పోలింగ్
- మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది
- స్వయంగా పర్యవేక్షించిన కలెక్టర్ స్నేహ శబరీష్
- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



కమలాపూర్ మండలం గూడూరులో పోలింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



భీమదేవరపల్లిలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద ఎంపీడీవో వీరేశంనకు సూచనలు చేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

పోలింగ్‌ను పకడ్బందీగా చేపట్టాలి..

కలెక్టర్ స్నేహ శబరీష్ ● పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల పరిశీలన

భీమదేవరపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, గ్రామపంచాయతీల వారీగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది కేటాయింపు, పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీల వారీగా రూట్స్ అలాట్ చేసి జోనల్ రూట్ ఆఫీసర్లు సమన్వయంతో ఎన్నికల సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేర్చాలని అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం 7 గంటలకు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల

(మిగతా 8లో..)



ఎన్నికలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే ఏ స్థాయి వ్యక్తినైనా ఉపేక్షించేది లేదని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. గురువారం మొదటివిడత పోలింగ్‌కు సుమారు 2000 మంది పోలీసులను వినియోగించబోతున్నట్లు వెల్లడించారు. ఎన్నికలు జరిగే ప్రతీ మండలానికి ఏసీపీ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటారని, పోలింగ్ సమయంలో కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తుతో పాటు నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమలు నాటి నుంచి కమిషనరేట్‌లో ఇప్పటివరకు రూ.6 లక్షల 40 వేలు, 120 కేసుల్లో రూ.10 లక్షల 69 విలువ గల మద్యం సీసాలు, 46 కేసుల్లో రూ. లక్ష 19 వేల విలువ గల 322 లీటర్ల గుడుంబాతో పాటు రూ.లక్ష విలువ గల గంజాయిని వివిధ ప్రాంతాల్లో పోలీసులు పట్టుకున్నామన్నారు. 156 లైసెన్స్‌డ్ తుపాకులను స్వాధీనం చేసుకోవడంతో పాటు 2205 మందిని బైండోవర్ చేశామని సీపీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు.





నువ్వా..? నేనా..?

పలు పంచాయతీల్లో హోరాహోరీ పోరు

- మంత్రి పొన్నం, ఎంపీ ఈటల, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రతిష్ఠకు పరీక్ష
- నేటి ఓటరు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

6



అంతా ఒకే రోజు...

పోలింగ్: ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ ఉంటుంది. సర్పంచ్ బ్యాలెట్ గులాబీ రంగులో, వార్డు సభ్యుడి బ్యాలెట్ తెలుపు రంగులో ఉంటుంది.

కౌంటింగ్ : మధ్యాహ్నం 2 గంటల నుంచి పూర్తయ్యే వరకు..

ఉప సర్పంచ్: వార్డు సభ్యులుగా ఎన్నికైన వారు తమలో ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకుంటారు.



ఎల్కతుర్తి కార్మెల్ కాన్వెంట్ పాఠశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

భద్రకాళి బండ్ పనులను పూర్తి చేయండి

● మేయర్ గుండు సుధారాణి



భద్రకాళి బండ్‌పై పనులను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భద్రకాళి బండ్‌పై కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. భద్రకాళి బండ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. చాలా కాలంగా జరుగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆమె కోరారు. బండ్‌పై జరుగుతున్న పనులు చివరి దశకు వచ్చాయని, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, ఈఈలు రవికుమార్, మాధవీలత, ఏఈ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ఊరిస్తున్న మరో రైల్వే ప్రాజెక్టు

- రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకు స్థలాన్వేషణ
- రూ.908 కోట్లతో 300 ఎకరాల్లో ఏర్పాటుకు సిద్ధం
- దక్షిణ మధ్య రైల్వేలోనే అతిపెద్ద ప్రాజెక్ట్
- డీపీఆర్ సిద్ధం చేస్తున్న రైల్వే అధికారులు
- ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేయాలంటున్న కార్మిక సంఘాలు



కాజీపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో అతిపెద్ద రైల్వే ప్రాజెక్ట్ మెగా రైల్వే వ్యాగన్ మెయింటనెన్స్ డిపో తెలంగాణాలో నిర్మించడానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.908కోట్లు నిధులు, 300ఎకరాల్లో నిర్మించే రైల్వే మెగా వ్యాగన్ మెయింటనెన్స్ డిపో నిర్మించడానికి రైల్వే ఉన్నతాధికారులు సుమారు రెండు నెలలుగా అనువైన స్థలం కోసం సర్వే చేస్తున్నారు. దాదాపు ఈ ప్రాజెక్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైల్వే ట్రాక్ కనెక్టివిటీ ఉన్న రైల్వే స్టేషన్‌ల సమీపంలోనే నిర్మించేందుకు రైల్వే ఉన్నతాధికారులు సూచన ప్రాయంగా అంగీకరించారు. ఇందుకుగాను కాజీపేట - మహబూబాబాద్, కాజీపేట - స్టేషన్ ఘన్‌పూర్, కాజీపేట - హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌లలో మొత్తంగా

(మిగతా 6లో..)

మెగా డిపో అంటే?


దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని తెలుగు రాష్ట్రాల్లో సరుకు రవాణా రైళ్ల నిర్వహణ సదుపాయాల విస్తరణకోసం ఈ మెగా వ్యాగన్ మెయింటనెన్స్ డిపో ఎంతో ఉపయోగం. ఈ డిపో అందుబాటులోకివస్తే సరుకు రవాణా రైళ్లకు, గూడ్స్ వ్యాగన్‌లకు సంబంధించి అన్ని రకాల కీలక నిర్వహణ పనులు ఇక్కడే జరుగుతాయి. ఇందులో పీరియాడికల్ ఓవర్ హాలింగ్, రెగ్యులర్ ఓవర్ హాలింగ్ వంటి ప్రధాన నిర్వహణ కార్యకలాపాలు నిర్వహిస్తారు. ఇవే కాకుండా సిక్‌లైన్, ట్రైన్ ఎగ్జామినేషన్ వంటి అత్యాధునిక సదుపాయాలుకూడా ఉంటాయి. దీని ద్వారా సరుకు రవాణా రైళ్ల మరమ్మతులు తనిఖీలు మరింత వేగంగా సమర్థవంతగా పూర్తవుతాయి. ఈ డిపోలో వందల సంఖ్యలో గూడ్స్ రైళ్ల నిర్వహణ జరుగుతుంది. ఈ డిపో నిర్మాణంతో వేలాదిమంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలుస్తోంది.


నదులను అనుసంధానం చేయాలి

7

అఖిల భారత రైతు సమాఖ్య, జమ్మూరి కిసాన్ సభ డిమాండ్

TRINITY
College of Education
PEDDAPALLI
for M.Ed
MANAGEMENT SEATS
Call: 9963242525,9849599275





'గ్రేటర్'కు కొత్త రూపు

- జీడబ్ల్యూఎంసీ పరిధిలో పెరగనున్న మరో 22 డివిజన్‌లు
- 66 నుంచి 88 వరకు చేరనున్న మొత్తం సంఖ్య
- హైదరాబాద్ తరహాలో పెంచేందుకు కసరత్తు
- ఎమ్మెల్యేలు చొరవ చూపితే ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

6

వారానికి ఆరు రోజులు వందేభారత్



గిర్మాజీపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య వందేభారత్ రైళ్లు (20707/20708) సోమవారం మినహా మిగిలిన ఆరు రోజులు రెగ్యులర్‌గా నడవనున్నాయి. ఈ విషయాన్ని దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌరసంబంధాల అధికారి ఎ.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని, రాకపోకల వేళలు గతంలో వలెనే ఉంటాయని పేర్కొన్నారు.

ఎఫ్ఏసీ డీఈవో నియామకంలో గందరగోళం

● గిరిరాజ్‌గౌడ్‌ను నియమించిన డీఎస్ఈ

● వైవీ గణేశ్‌ను నియమించిన కలెక్టర్

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఇన్‌చార్జి డీఈవోగా అడిషనల్ కలెక్టర్ వైవి గణేష్‌ను నియమిస్తూ కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే సమయంలో విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ హనుమకొండకు ఎఫ్ఏసీ డీఈవోగా సూర్యాపేట డీఈవో ఆఫీస్‌లో ఎఫ్ఏవోగా పనిచేస్తున్న ఎల్వీ గిరిరాజ్‌గౌడ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లా విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గాలు అయోమయంలో పడ్డాయి. అయితే విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకే ఎఫ్ఏసీ డీఈవో నియామం ఉంటుందని కొందరు చెబుతుండగా, కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఇంచార్జి డీఈవోగా వైవీ గణేష్ కొనసాగుతారనే మరికొందరు అంటున్నారు. కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులే అమలయ్యేలా విద్యాశాఖ డైరెక్టర్ మరో ఉత్తర్వు జారీ చేసే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ సమాచారం.

టీపీయూఎస్ జిల్లా నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శుల ఎన్నిక


సతీష్


శేఖర్


వీరస్వామి


శ్రీనివాస్

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) వరంగల్, హనుమకొండ జిల్లాలకు నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులను ఎన్నుకున్నారు. బుధవారం హనుమకొండ సామాజగన్మోహన్ స్మారక భవనంలో ఏర్పాటు చేసిన రెండు జిల్లాల సర్వసభ్య సమావేశంలో నూతనంగా జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులను ఎన్నుకున్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఉప్పుల సతీష్, ప్రధాన కార్యదర్శిగా అకుల శేఖర్‌ను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. అలాగే హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బత్తిని వీరస్వామి, ప్రధానకార్యదర్శిగా ప్రతాపగిరి శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి నవాత్ సురేష్, నాయకులు చిదురాల సుధాకర్, పిన్నింటి బాలాజీరావు, దాస్యం రామానుజస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ ఇంద్రజాల ప్రదర్శనలు

ప్రముఖ మెజీషియన్ సికందర్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జాదుగర్ సికందర్, శ్రీనివాస్‌రెడ్డి

వడ్డెపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో అంతర్జాతీయ స్థాయి ఇంద్రజాల ప్రదర్శనలను ఏర్పాటు చేసినట్లు కాన్పూర్‌కు చెందిన ప్రముఖ మెజీషియన్ జాదుగర్ సికందర్ తెలిపారు. ఈ ప్రదర్శనలు గురువారం నుంచి ఈ నెల 28 వరకు ప్రతీ రోజు రెండు షోలు మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 6 గంటలకు జరుగుతాయని పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇంద్రజాల ప్రదర్శనలకు సంబంధించిన బ్రోచర్లను స్థానిక మెజీషియన్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెజీషియన్ సికందర్ మాట్లాడుతూ.. ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ వంటి ప్రముఖ నగరాలలోని వేదికలపై 10 వేలకుపైగా ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. హనుమకొండలో తన మ్యాజిక్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయడానికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో కొత్తదనం, వైవిధ్యం రెండు ఉంటాయని చెప్పారు.

తన బృందం డైనోసార్ భ్రమ, బెర్ముడా ట్రాయాంగిల్ ప్రభావంతో ఉత్కంఠ భరితమైన ఇంద్రజాల విన్యాసాలను ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ ప్రదర్శనలను గురువారం సాయంత్రం 6 గంటలకు వరంగల్ ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారని జాదూగర్ సికందర్ పేర్కొన్నారు. సమావేశంలో హనుమకొండకు చెందిన మెజీషియన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నువ్వా.. నేనా..?

● పలు పంచాయతీల్లో హోరాహోరీ పోరు

● మంత్రి పొన్నం, ఎంపీ ఈటల, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రతిష్టకు పరీక్ష

● నేటి ఓటరు తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

హనుమకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తొలి విడత పంచాయతీ ఎన్నికలు భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల పరిధిలో గురువారం జరగనున్నాయి. ఈ పంచాయతీల్లో కొన్ని చోట్ల పోటీ హోరాహోరీగా సాగుతోంది. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రాతినిధం వహిస్తున్న నియోజకవర్గాల పరిధిలో ఈ మండలాలు ఉండడంతో అందరి దృష్టి వీటిపైనే ఉంది. ఎంపీ ఈటెల రాజేందర్ స్వస్థలం కమలాపూర్ మండల కేంద్రం కావడం కూడా ఇక్కడ పోటీ ఆసక్తి రేపుతోంది.

ముఖ్యంగా మేజర్ గ్రామ పంచాయతీల్లో అభ్యర్థులు నువ్వానేనా అన్న చందంగా పోటీ పడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మద్దతుతో పోటీ చేస్తున్న వీరు గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం నెరుపుతున్న నియోజకవర్గం పరిధిలోని భీమదేవరపల్లి మండలంలోని భీమదేవరపల్లి గ్రామ పంచాయతీలో కాంగ్రెస్, బీజేపీ మద్దతిస్తున్న అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. ఇక్కడ బీఆర్ఎస్ మద్దతు అభ్యర్థి బరిలో లేడు. పాల ఉత్పత్తి కేంద్రం అయిన ముల్కనూరు గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ బీఆర్ఎస్ మద్దతుతో అభ్యర్థులు తీవ్రంగా పోటీ పడుతున్నారు. కొత్తకొండ గ్రామ పంచాయతీలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ మద్దతు అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ కొనసాగుతోంది. గట్ల నర్సింగాపూర్ పంచాయతీలోనూ స్వతంత్ర, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ నెలకొన్నది. కొత్తపెల్లి పంచాయతీలో కాంగ్రెస్ బీఆర్ఎస్, మల్లారం గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ బీఆర్ఎస్ మధ్య టగ్ ఆఫ్‌వార్ నడుస్తోంది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగ్రామమైన వంగరలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ నడుస్తోంది.

ఎల్కతుర్తి మండలంలో ఎల్కతుర్తి గ్రామ పంచాయతీలో అలాగే కేశవపూర్, వీరనారాయణపూర్ పంచాయతీల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. దండెపెల్లి పంచాయతీలో కాంగ్రెస్‌కు, కాంగ్రెస్ రెబల్‌కు, బీఆర్ఎస్‌కు మధ్య పోటీ ఉంది. గోపాల్‌పూర్ పంచాయతీలో సీపీఐ బీఆర్ఎస్ మధ్య పోరు కొనసాగుతోంది. ఇక్కడ సీపీఐ పక్షాన ఆ పార్టీ జిల్లా నేత సతీమణి బరిలో ఉండడం ఇందుకు కారణం.

కమలాపూర్ మండలంలో బీజేపీ గట్టి పోటీ ఇస్తోంది. ఎంపీ ఈటెల రాజేందర్ స్వగ్రామం కావడం ఇందుకు కారణం. కమలాపూర్, ఉప్పల్, అంబాల గ్రామ పంచాయతీల్లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ ఉంది. శనిగరం, మాదన్నపేట జీపీల్లో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోటీ ఉంది. అంబాలలో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీగా పోరు సాగుతోంది.

చెత్త తరలింపులో జాప్యం లేకుండా చూడండి

● మేయర్ గుండు సుధారాణి

● సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెత్త తరలింపులో జాప్యం లేకుండా చూడాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం వరంగల్ పోతననగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆటోలు రిపేరు చేయడానికి చాలా సమయం పడుతుందని ఫిర్యాదులు అందాయని, మరమ్మతులలో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఇంకా ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో స్వచ్ఛ ఆటోల డ్రైవర్లు సమయపాలన పాటించాలన్నారు. తడి పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ గొల్కోండ శ్రీనివాస్‌తో పాటు జవాన్లు పాల్గొన్నారు.


పోతననగర్ సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న మేయర్

గడువులోగా పనులు పూర్తి చేయండి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

పలు చోట్ల కల్వర్టు పనుల పరిశీలన


దేశాయిపేటలో కల్వర్టు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత గడువులోగా స్మార్ట్‌సిటీకి సంబంధించిన పనులు పూర్తిచేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. బుధవారం పద్మాక్షిరోడ్డు, దేశాయిపేటరోడ్డులోని స్మార్ట్‌సిటీ నిధులతో చేపడుతున్న కల్వర్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్మార్ట్‌సిటీ నిధులతో చేపట్టిన కల్వర్టు పనులు డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవికుమార్, డీఈలు రాజ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తడి పొడి చెత్తను వేరుగా అందించాలి

ప్రజలు స్వచ్ఛ ఆటోలకు తడి పొడి చెత్తను వేరు వేరుగా అందించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ప్రజలకు సూచించారు. బుధవారం వరంగల్ నగరంలోని 39, 40 డివిజన్‌లలో క్షేత్రస్థాయిలో శానిటేషన్ పనులను పరిశీలించారు. డివిజన్‌లలోని పలు కాలనీలను సందర్శించి అక్కడి ప్రజలతో కమిషనర్ మాట్లాడారు. జవాన్లు, మహిళా సంఘాల సభ్యులు తడి పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ రమేష్‌తో పాటు స్థానిక జవాన్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాండమైజేషన్ ద్వారా పరిశీలిస్తున్న బాల మాయాదేవి, సత్యశారద

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రెండో, మూడో విడతల్లో జరిగే ఎన్నికల కోసం పోలింగ్ సిబ్బందిని కేటాయించేందుకు బుధవారం ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం పోలింగ్ అధికారులు (పీవో), ఓపీవో, మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల పరిశీలకులు బాల మాయాదేవి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యశారద క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానికేతరులకే విధులు కేటాయించేలా చర్యలు తీసుకున్నట్లు వారు స్పష్టం చేశారు.

పోలింగ్ సిబ్బంది కేటాయింపు

రెండో విడత పోలింగ్ దుగ్గొండి, గీసుకొండ, నల్లబెల్లి, సంగెం మండలాల్లో కాగా, మూడో విడత ఖానాపూర్, చెన్నారావుపేట, నర్సంపేట, నెక్కొండ మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లను కేటాయించారు. రెండో విడతకు పోలింగ్ సిబ్బంది 2,658, మైక్రో అబ్జర్వర్లు 42 మంది కాగా, మూడో విడత పోలింగ్ సిబ్బంది 2,377. మైక్రో అబ్జర్వర్లు 28 మందిని కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా డీసీవో నీరజ, డీపీవో కల్పన, లీఫ్ బ్యాంకు మేనేజర్ రాజు, డీఈవో రంగయ్య నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నిర్మల, డీపీఆర్వో అయూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

జీడబ్ల్యూఎంసీలో పెరగనున్న డివిజన్లు

66 నుంచి 88 డివిజన్‌లకు పెరిగే అవకాశం

పెరిగిన జనాభా అవసరాలపై సర్కారు కసరత్తు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న 66 డివిజన్‌ల సంఖ్య పెరుగనుందా? అంటే ఔననే చెప్పాలి. రెండు రోజుల కిందట రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలో 150 ఉన్న డివిజన్‌లను 300కు పెంచుతూ రాష్ట్రప్రభుత్వం మంగళవారం మునిసిపల్ చట్టం 1955 ప్రకారం జీవో -2ను విడుదల చేసింది. అదే జీవో ప్రకారం రాష్ట్రంలో అభివృద్ధిపథంలో రెండో స్థానంలో ఉన్న వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి విస్తీర్ణాన్ని బట్టి డివిజన్‌ల సంఖ్య పెంచుతున్నట్లు బల్దియా అధికారులు వెల్లడించారు.

ప్రస్తుతం వరంగల్, హనుమకొండ, కాజీపేటతోపాటు విలీన గ్రామాలను కలుపుకుని 66 డివిజన్‌లు ఉన్నాయి. అయితే చాలా డివిజన్‌లు భారీగా విస్తరించి ఉండడంవల్ల అక్కడి ప్రజలకు పరిపాలనా సౌలభ్యం అసౌకర్యంగా మారింది. దీంతో వరంగల్ నగరం 88 డివిజన్‌లకు విస్తరించనుంది. అంతే కాకుండా కొన్ని డివిజన్‌లలో పరిమితికి మించి జనాభా కలిగి ఉండడం, అప్పటి ప్రజాప్రతినిధులు ఇష్టారీతిన ఆయా ప్రాంతాలను కలుపుకుని డివిజన్‌గా చేసుకున్నట్లు బాహటంగానే అప్పట్లో విమర్శలు వచ్చాయి.

2021లో జరిగిన డివిజన్‌ల పునర్విభజన సమస్య అస్తవ్యస్తంగా ఉండడంతో కొన్ని కాలనీలకు శాపంగా మారిందని ప్రజలు చెప్పుకొంటున్నారు. ప్రస్తుతం వరంగల్ నగర జనాభా 14 లక్షలకు మించింది. కొన్ని డివిజన్‌లలో జనాభా ఎక్కువగా ఉండడం, మరి కొన్ని డివిజన్‌లలో జనాభా వృద్ధి రేటు గణనీయంగా తగ్గి ఉండడం కనిపిస్తోంది. దీంతో ప్రభుత్వం కూడా వరంగల్ నగరాన్ని 88 డివిజన్‌లుగా చేసేందుకు ప్రతిపాదనలు చేయాలని ఆర్నెల్ల కిందట మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడి అధికారులు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసి పంపించినట్లు తెలిపారు.

పెరగనున్న సర్కిల్ కార్యాలయాలు

ప్రస్తుతం 66 డివిజన్‌ల నుంచి 88 డివిజన్‌లుగా కార్పొరేషన్ విస్తరిస్తే సర్కిల్ కార్యాలయాలు పెరగాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం నగర జనాభా 14 లక్షలకు పైగా పెరిగింది. ఇతర రాష్ట్రాలతో పాటు జిల్లాలు, అవిభక్త వరంగల్ జిల్లా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు నగరంలో అన్ని సౌకర్యాలు కలి ఉండడంతో ఇక్కడే స్థిరపడుతున్న వారి సంఖ్య రెండింతలు పెరిగిపోయింది. దీంతో నగర పాలక సంస్థ అందించే మౌలిక సదుపాయాలతో పాటు ఇంటి అనుమతులు, ఇంటి నెంబర్లు, డెత్, బర్త్ సర్టిఫికెట్లు పొందడం కష్టంగా మారింది.

ప్రస్తుతం జీడబ్ల్యూ ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు ప్రతీ చిన్న పనికి కాజీపేట, కాశి బుగ్గ సర్కిల్ కార్యాలయాలకు ప్రజలు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. ఒక్కో డివిజన్‌కు 5 నుంచి 6 వేల మంది ప్రజలు మాత్రమే నివ సించి ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 10 నుంచి 15 వేలకుపైగా ఉన్నట్లు మున్సిపల్ రికార్డులు చెబుతున్నాయి. దీంతో 2నుంచి మరో 6 సర్కిల్ కా ర్యాలయాలు ఏర్పాటు చేసే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలిసింది.

నిట్‌లో జెన్ జెడ్ పోస్టాఫీసు

● తెలంగాణలో మొదటిసారి ఏర్పాటు

● ప్రారంభించిన డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి

హనుమకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో జెన్ జెడ్ పోస్టాఫీసును డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి బుధవారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన మొదటి పోస్టాఫీసు ఇదే. హైదరాబాద్ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ సుమితా అయోధ్య, నిట్ రిజిస్ట్రార్ సునిల్ కుమార్ మెహత, హనుమకొండ డివిజన్ ఎస్పీ నరేంద్ర బాబు, నిట్ అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వినూత్న పోస్టాఫీసు సేవలను అధ్యాపకులు, విద్యార్థులు వినియోగించుకునేందుకు వీలుగా క్యాంపస్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిట్, ఐఐటీ వంటి అత్యున్నత విద్యాసంస్థలోని విద్యార్థులు, ముఖ్యంగా యువతను ఆకట్టుకోవడానికి ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోస్టాఫీజులే ఈ జెన్ జెడ్ థీమ్ పోస్టాఫీజులు. పోస్టల్ విభాగం కేవలం లేఖలను పంపించడానికే కాకుండా నేటి డిజిటల్‌యుగానికి అనుగుణంగా వివిధ సేవ లు అందించే కేంద్రాలుగా మార్పు చెందింది.

వీటిని డిజిటల్ ఇండియా స్ఫూర్తితో భారతీయ తపాలా శాఖ ప్రారంభించింది. జెన్ జెడ్ పోస్టాఫీసు కేవలం పార్సిల్స్, లేఖలు పంపించడంతో పాటు సోషల్ లర్నింగ్ స్పేస్‌గా రూపొందించారు. విద్యార్థులు ఇక్కడ ఉచితంగా వైఫైను వినియోగించుకోవచ్చు. అలాగే పుస్తకాలు చదవుకునే ఓ లైబ్రరీగా ఉంటుంది. అంతేకాకుండా సౌకర్యవంతంగా కూర్చొని ఆర్ట్ ప్రదర్శనలను వీక్షించవచ్చు. క్యాంపస్‌లో విద్యార్థులు, పరిశోధకులు, స్థానికులు స్వేచ్ఛగా సమయం గడపడానికి సౌక ర్యంగా ఉంటుంది. అలాగే ఇంటరాక్షన్ జోన్‌గా పని చేస్తుంది. ఈ పోస్టాఫీసుల్లో క్యూఆర్ ఆధారిత పార్సిల్ బుకింగ్, విద్యార్థులకు అనుకూలంగా స్పీడ్ పోస్ట్ డిస్కౌంట్‌లతో సహా స్మార్ట్ సర్వీసులు అందుబాటులో ఉంటాయి.


నిట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన జెన్‌జెడ్ పోస్టాఫీసు కార్యాలయం

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శిగా రాగుల రమేష్



హనుమకొండ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా హనుమకొండకు చెందిన రాగుల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్న రాగుల రమేష్.. మూడోసారి రాష్ట్ర సీఐటీయూ కార్యదర్శిగా, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, బొట్ల చక్రపాణి, కౌన్సిల్ సభ్యురాలిగా నిడిగొండ రజితలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ నెల 7 నుంచి మెదక్ పట్టణంలో నిర్వహించిన మహాసభలలో జిల్లా నుంచి వీరిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న అసంఘటిత కార్మికుల సమస్యలపై పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం వరంగల్ టు హైదరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం, స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. కాజీపేటలోని కోచ్ ఫ్యాక్టరీ త్వరగా పూర్తి చేసి స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తీసు కొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని రమేష్ డిమాండ్ చేశారు.

ఊరిస్తున్న మరో రైల్వే ప్రాజెక్టు

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్థల పరిశీలన చేస్తున్నారు. ఈ రైల్వే ప్రాజెక్ట్ కోసం రైల్వే ఉన్నతాధికారులు డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేస్తున్నారు.

ఈ మెగా డిపో కాజీపేట జంక్షన్ సమీపంలో స్థల విషయమై వరంగల్ ఎంపీ కడియం కావ్యను రైల్వే ఉన్నతాధికారుల బృందం కలిశారు. ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించారు. 300 ఎకరాల స్థలం అనుకూలంగా లభ్యమైతే సాధ్యమైనంత త్వరలో ఈ మెగా డిపో నిర్మిస్తామని ఆమెకు వివరించారు. కాజీపేట జంక్షన్ పరిధిలోని రైల్వే కనెక్టివిటీ ఉన్న స్థలం అనుకూలంగా ఉంటే తమకు పూర్తివివరాలు ఇవ్వాలని అమెను కోరారు. ఇప్పటికే కాజీపేటలో నిర్మిస్తున్న అతిపెద్ద ప్రాజెక్ట్ అయిన రైల్వే కోచ్‌ఫ్యాక్టరీకి అనుసంధానంగా మెగా రైల్వే వ్యాగన్ మెయింటనెన్స్ డిపో కాజీపేటలో నిర్మించాలని రైల్వే కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

డీపీఆర్ సిద్ధమవుతోంది..

ఎ. శ్రీధర్, సీపీఆర్వో, దక్షిణ మధ్య రైల్వే

మెగా రైల్వే వ్యాగన్ మెయింటనెన్స్ డిపో మంజూరైన విషయం సరైందే. ఎక్కడ నిర్మించాలని విషయమై ఇంకా పూర్తి నిర్ణయం తీసుకోలేదు. డిపో నిర్మించే స్థలం కోసం సర్వే చేస్తున్నారు. దీనికి సంబంధించి డీపీఆర్ సిద్ధమవుతోంది. డిపో నిర్మించే స్థలం నిర్ధారణ అయ్యాక ఎన్ని వ్యాగన్‌లతో ముందుగా మెగా డిపోను నిర్మాంచాలి, ఏ స్థాయిలో నిర్మించాలనేది ఒక అవగాహన వస్తుంది. కొందరు స్థలం నిర్ణయం అయిపోయిందని ప్రచారం చేస్తున్నారు. డిపో నిర్మించేది మాత్రం వాస్తవం. స్థలం నిర్ధారించాక అన్ని విషయాలు వెల్లడిస్తాం.

మానవ అభివృద్ధికి నూతన ఆవిష్కరణలు తోడ్పడాలి

రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం


ముగిసిన నోబెల్ డే సంబరాలు

కేయూ క్యాంపస్ డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ అభివృద్ధికి నూతన శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలు తోడ్పడాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. రెండు రోజులుగా కేయూలో నిర్వహించిన నోబెల్ ప్రైజ్‌డే సెలబ్రేషన్స్ బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా కేయూ సెనెట్‌హాల్‌లో కేయూ స్టూడెంట్స్ ఆఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో రిజిస్ట్రార్ రామచంద్రం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శాస్త్రవేత్తలే సమాజ మార్గదర్శకులని చెప్పారు. కేయూ విద్యార్థుల అకడమిక్ స్పిరిట్ గొప్పదన్నారు. స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి మాట్లాడుతూ.. వర్సిటీలో 11 విభాగాల నుంచి 300 మంది విద్యార్థులు నోబెల్ ప్రైజ్ సెలబ్రేషన్స్ పోటీల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, కేయూ పార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదెనమ్మయ్య, కరీంనగర్ శాతవాహన వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ మహ్మద్ ఇక్బాల్ అలీ, వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ రాజ విశ్వనాథం వివిధ విభాగాల అధిపతులు, కేయూ యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ నిరంజన్, డాక్టర్ టి.రాధికతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలు వీరే..

విద్యార్థులకు వక్తృత్వం, పోస్టర్ ప్రజంటేషన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందచేశారు. వక్తృత్వం, పోస్టర్ ప్రజెంటేషన్‌లో మొదటి బహుమతులు పొందిన వారిలో విశైలజ, సుల్తానా (బాటనీవిభాగం,) జి.కావ్యశ్రీ, భార్గవి (బయో కెమిస్ట్రీ,) ఎం,అర్చన, బి.శాంతిప్రియ, ఈ జ్యోత్స్న (మైక్రోబయోలజీ విభాగం), బి.అనుప్రియ, శ్రీయ, (బయోటెక్నాలజీ విభాగం), నవ్య అంజలి (ఇంటిగ్రేటేడ్ కెమిస్ట్రీ), దిలీప్‌కుమార్, శివతేజ, (కెమిస్ట్రీ), దీపిక, హర్షిణి, (ఎకానమిక్స్ విభాగం), పి.హరీశ్, బి.ఓం ప్రకాశ్, (ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ), సంతు కర్రీ, లక్ష్మీ ప్రకాశ్ (ఫార్మసీ), వై.సిందూ, ఎస్.రమ్య (ఫిజిక్స్ విభాగం), స్టీఫెన్ సిద్ధంకి, బి.ఉమేశ్ (ఇంగ్లీష్ విభాగం), అక్షిత, (మహిళ ఇంజరింగ్ కాలేజీ), అనూషరెడ్డి (కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల)లున్నారని డీన్ ప్రొఫెసర్ ఇస్తారి ప్రకటించారు. కాగా, నోబల్ ప్రైజ్ సంబరాలను పురస్కరించుకుని సెనెట్ హాల్‌లో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో హోరెత్తించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం



WANTED

★ హన్మకొండలో, వరంగల్ లోకల్‌లో పని చేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం : 8,000 నుండి 13,000/-.సంప్రదించండి 9666336162

AJW-257230

WANTED

★ హన్మకొండలోని ప్రముఖ కోఆపరేటివ్ బ్యాంకుల్లో పనిచేయుటకు బ్యాంకింగ్ రంగంలో అనుభవం గల అకౌంటెంట్స్ గోల్డ్‌లోన్ స్టాఫ్ మరియు మార్కెటింగ్ ఏజెంట్స్ (M/F) కావలెను. Age:25-35 సంప్రదించండి 9602121397, 9441863251

AJW-257178

WANTED

★ Hema Motors Needs 1). Insurance Executive. Only Female Candidate are Required 1 Yrs Exp and 2) Drivers, Min Edu Quali : Inter, LMV Driving Licence with Badge Required Min 3-5 yrs of Exp, Walk in Interview with Resume on 11th & 12th Dec 2025. between 11 am to 6pm Cont : Hema Motors Pvt Ltd, Opp: Govt ITI, Mulugu Road, Warangal. Cell: 91549 21941

AJW-449

LEASE/RENT

★ WGL, JPN Road, Beside Satya Hospital Ground-728 Sft, 1st, 2nd, 3rd Floors Each 948 Sft. Total 3572 Sft Total Building for Rent /Lease. Lift & Cellar Available Suiatable for Hospitals / Clinics / ShowRooms /Offieces Etc. Cont: 8977700780

AJW-4190

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

3+2 స్కీం కలదు

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ
9985400013
8978510273
9985411677

వరంగల్
9949638376
9985408173

జనగామ
9866431354

మహబూబాబాద్
9985418040

తొర్రూర్
9985418040

నర్సంపేట
9949638376

భూపాలపల్లి
9985401232

పరకాల
9985401232

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

సోషల్ మీడియాలో ప్రచార జోరు

» అభ్యర్థులకు నూతన అస్త్రంగా మారిన సాంకేతికత
» ఓటరుకు నేరుగా హామీలు

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కొత్త శకం మొదలైంది. గతంలో గడప గడపకూ కరపత్రాలు, మైకుల మోతతో జరిగే ఎన్నికల ప్రచారం ప్రస్తుతం డిజిటల్ రూపు సంతరించుకుంది. ముఖ్యంగా సామాన్యులు ఎక్కువగా ఉపయోగించే వాట్సాప్ గ్రూపులు అభ్యర్థులకు వరంగా మారాయి. కీలకమైన ప్రచార సాధనాలుగా పనిచేస్తున్నాయి. సర్పంచ్‌గా, వార్డు సభ్యులుగా పోటీ పడుతున్న అభ్యర్థులు తమ సందేశాలను, హామీలను వాట్సాప్ ద్వారా ఓటర్లకు నేరుగా ఖర్చు లేకుండా చేరవేస్తున్నారు. పోలింగ్ ముగిసే క్షణం వరకు కూడా సోషల్ మీడియాలో ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకున్నారు.



అభ్యర్థుల ఆయుధం..

వాట్సాప్ గ్రూపులు ఇప్పుడు అభ్యర్థులకు పదునైన అస్త్రాలుగా మారాయి. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, ప్రతి గ్రామంలోనూ పదుల సంఖ్యలో వర్చువల్ ప్రచార వేదికలు రన్ చేస్తున్నారు. అభ్యర్థులు తమ మద్దతుదారులు, గ్రామస్థులతో కలిసి గ్రూపులు ఏర్పాటు చేసుకొని సంప్రదాయ మీడియా కంటే వేగంగా ప్రజల మధ్యకు వెళ్తున్నారు. కొందరు ఆశావహులు ప్రత్యేకంగా మీడియా ఇన్‌చార్జులను నియమించి ఓటర్ల ఫోన్ నెంబర్లను సేకరించి గ్రూపుల్లో చేరుస్తున్నారు. అభ్యర్థులు తమ సొంత పాటలు, పేరడీలు, ఆడియో సంభాషణలు, చిన్న వీడియో డాక్యుమెంటరీలను తయారు చేసి పంపిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఈ ట్రెండ్ ఎంతగా పెరిగిందంటే కొందరు అభ్యర్థులు తమ ప్రచారాన్ని నిర్వహించడానికి కంటెంట్ సృష్టించడానికి ప్రొఫెషనల్ (పీఆర్వో) స్థాయి ఉద్యోగులను సైతం నియమించుకుంటున్నారు.

70 శాతం మందికి చేరువయ్యేలా..

అంచనాల ప్రకారం దాదాపు 70 శాతం మంది ఓటర్లను చేరుకోవడానికి వాట్సాప్ గ్రూపులు ప్రధాన మార్గంగా ఉపయోగపడుతున్నాయి. అభ్యర్థులు తమ వ్యక్తిగత గుణగణాలు, చేయబోయే అభివృద్ధి పనులు, హామీలను వివరిస్తూ వాయిస్ సందేశాలు, ఆకర్షణీయమైన వీడియోలు, గ్రాఫిక్ చిత్రాలు నిరంతరం పోస్ట్ చేస్తున్నారు. రోజువారీ రోడ్డుషోలు, సభల వివరాలు కూడా క్షణాల్లో చేరవేస్తున్నారు. ప్రచారం ఇప్పుడు కేవలం మాటలు, కాగితాలకు పరిమితం కాలేదు. ఇది విజువల్ విప్లవంగా మారింది. ప్రజలు లేవనెత్తే సమస్యలు, ప్రశ్నలు, అభ్యంతరాలకు అభ్యర్థులు అప్పటికప్పుడు వీడియో రికార్డు చేసి వాట్సాప్ ద్వారా సమాధానాలిస్తున్నారు. ఇది ఓటర్లకు కూడా ఆయుధంగా పనిచేస్తుంది. భవిష్యత్‌లో హామీలపై నిలదేసేందుకు సాక్ష్యంగా పనిచేస్తుంది.

ఖర్చులేని ప్రచారం

వాస్తవానికి ఎన్నికల ప్రచారం భారీ వ్యయంతో కూడుకున్నది. కానీ వాట్సాప్ ప్రచారం ద్వారా అభ్యర్థులు ఖర్చు లేకుండానే కేవలం మొబైల్ ఫోన్ ద్వారా తమ సందేశాన్ని లక్షలాది మంది ఓటర్లకు చేరవేయగలుగుతున్నారు. దీని ద్వారా ప్రచార వ్యయం తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతోంది. ప్రజలు కూడా తమ ఇంటి వద్ద నుంచే అభ్యర్థుల గుణగణాలను, ప్రచార కార్యక్రమాలను తెలుసుకుంటున్నారు.

డైలాగ్ వార్

హనుమకొండ టౌన్ : గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ గ్రామాల్లో రాజకీయ వేడి పెరుగుతుంటే, సోషల్ మీడియా వేదికలో మరో సంగ్రామం జరుగుతోంది. ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపులు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్‌ల వరకు డైలాగ్ వార్ హోరాహోరీగా సాగుతోంది. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల అనుచరులు తమ అభ్యర్థి అభివృద్ధి పనులు, వ్యక్తిత్వం, గ్రామానికిచ్చే హామీలు ప్రచారం చేస్తుంటే ప్రత్యర్థి వర్గం అదే పోస్టులను కౌంటర్ చేస్తున్న విధానం ఆసక్తికరంగా మారుతోంది. నిమిషానికో పోస్టు, గంటకో వీడియోలతో రాజకీయ జోష్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. అభివృద్ధి మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తామంటూ ఒక వర్గం, ప్రజల తీర్పే మా బలం.. అంటూ మరో వర్గం కౌంటర్ ఇస్తోంది. రీల్స్‌లో వినిపిస్తున్న పాటలకంటే డైలాగ్‌లే ఎక్కువ హుషారును లేపుతున్నాయి. ఈ డైలాగ్ వార్‌లో యువత ముందంజలో ఉంటున్నారు. పెద్దల రాజకీయానికి యువత సోషల్ మీడియా శక్తి చేర్చడంతో ప్రచారం కొత్త రూపు సంతరించుకుంటోంది.

కొసాఖరుకు | స్వగతం

నన్నేం జేత్తరో..!?



ఇయ్యాటికి పదకొండు దినాల నుంచి కాలికి బట్టకట్టకుండా ఎగిలి వారంగ లేచి ఇల్లిల్లూ తిరిగి వంద మందితో పచారం జేత్తున్న సర్పంచ్ అభ్యర్థి శివయ్యకు పానం అలిసినట్టయింది.. ఎక్కడెక్కడి నుంచో పైసలు గుంజుకొత్తుండు.. ఎంట తిరుగుతున్నోల్లందరికి తినిపిచ్చి.. తాగిపిచ్చి.. ఏదడిగితే గది ఇస్తూ పోతుంటే ఇప్పటికే పది లచ్చలకు దగ్గరొచ్చింది. బుధవారం రాత్రి ఇంత బువ్వ తిని మంచం మీద ఒరిగిన శివయ్యకు కన్ను అంటుకుంది.

ఇంతల శివయ్య ప్యానల్ మీద నిలబడ్డ వార్డుమెంబర్ రాజేస్ ఇంట్లకొచ్చిండు.. అన్నా.. ఓ శివన్న... ఏందె గింత నిమ్మలంగ పన్నవ్.. లే.. అగో గా ఎల్లబోయిన సోములు.. ఆళ్ల వాడకట్టు గుంపు ఒచ్చింద్రు సూడు.. మనూరు నుంచి పట్నం బతుక పోయింద్రు సూడు సోములు సుట్టపోల్లు.. గల్లంతా మనకే ఓటు ఎత్తరట.. మరి ఆళ్లకు ఇంత మర్యాద జేసి పైసలిత్తే మనకు ఫలితం దక్కుటట్టుంది.. అన్నడు వార్డుమెంబర్ రాజేస్..

కండ్లు నలుసుకుంట మంచంలకెల్లి లేశొచ్చిన శివయ్య టీవీల 'అమ్మాయిగారు'.. సీరియల్ సూత్తున్న తన భార్య రాజమణితోని గా పరుపు కింద ఐదు వందల రూపాల నోట్లున్నాయ్ తీసుకరా.. అని చెప్పంగనే రాజమణి ముఖం ఇరుసుకుంటునే 40 వేలు లెక్కబెట్టి భర్త శివయ్య చేతిలబెట్టింది. ఇగ శివయ్య గా పైసలు చేతపట్టుకొని ఇగో సోములు నీకు ఎంతో నమ్మకంతోని ఇత్తున్న.. గా పట్నంల ఉన్న గుంపును తాగిపిచ్చి.. తినిపిచ్చి.. పొద్దుగాల్నె ఓట్లు వేసే బడికాడికి తీసుకొచ్చే బాధ్యత నీదే. ఒచ్చినోళ్లందరి ఓట్లన్ని నాకే ఏసేటట్లు నువ్వే జూసుకోవాలి.. గట్లనే నువ్వు గెల్చినంక మనమంతా కుంకుమ గుప్పుకొవాలే కాదె.. గదానికి గుడా పైసలియ్.. అనగానే.. శివయ్య ఇంకింత ఉబ్బి... ఇంకొక 10 వేల రూపాలు చేతిలపెట్టిండు.

ఇగ గాల్లను సాగనంపి శివయ్య మళ్ల మంచం మీద ఒరిగి కూర్పు తీత్తుంటే.. ట్రింగ్.. ట్రింగ్.. అనుకుంట పోనొచ్చింది.. అన్నా.. గీ గల్లీల గా కుల సంఘపోల్లు కూసుండ్రు.. నీతోని మాట్లాడతరట రా.. అని మల్లేస్ ఫోన్ జెయ్యంగనే.. కండువా భుజానికి ఏసుకొని చెప్పులు తొడుక్కొని మసీదు కాడి గల్లీకి కాలినడకన పోతున్న శివయ్యకు అవుతలి పార్టీ నుంచి నిలబడ్డ లక్ష్మారెడ్డి ఇంటికాడ అర గంట కింద 40 వేల రూపాలు తీసుకపోయిన ఎల్లబోయిన సోములు.. ఆళ్ల గుంపు అక్కడగుపడ్డరు.

గది జూసిన శివయ్య పాణం దస్సుమంది.. అరె గిదేందిరో.. ఇప్పుడే అడిగినన్ని రూపాలు చేతిల బెడితిని.. పానమసోంటోడు ఇంకెవలు లేరనే.. మళ్లొచ్చి లక్ష్మారెడ్డి ఇంటికాడ మీటింగ్ పెట్టింద్రు.. ఈళ్ల సంగతేంటో సమజ్ కావడం లేదు.. అనుకుంటూ సంఘపోల్ల దగ్గరికి పోయి ఆళ్ల గుంపుకు 50 వేలు ఇచ్చి ఇంటికి వచ్చిండు.

అప్పటికే నడిజాము రాత్రి దాటింది.. మంచంల పంటె శివయ్యకు నిద్ర కూడా పడత లేదు.. ఒక్కటే గుండె దడ..గుండె మీద చేయ్యేసుకొని కండ్ల సూపు సీలింగ్ ఫ్యాన్ మీద పెట్టి శివయ్య ఒకటే ఆలోచన శేత్తుండు..

'దీన్ తల్లి ఎవనికి పైసలు ఇచ్చినా తీసుకుంటుండ్రు.. అనుమానం రాకుండా మల్ల పైనుంచి పమానాలు.. ఇమానాలు జేత్తుండ్రు.. ఇంతకు ఓటెవలకు ఎత్తరో.. ఏం కథో? కొసాఖరుకు నన్నేం జేత్తరో అర్థమైత లేదు. పది రోజులకే 20 లచ్చల ఖర్చొచ్చింది.. ఇంక ఎంత తక్కువైన తెల్లవారుజామునే ఓటుకు వెయ్యి రూపాయలిచ్చిన ఇంకొక 30 లచ్చలకు తగ్గదు.. మొత్తం 50 లచ్చలు అంటే అరకోటి దాటె తట్టున్నయ్.. గివన్నీ పైసలు పంచినంక నన్ను గీళ్లు ఓట్లేసి గెలిపియ్యకపోతే నా గతి ఏమైతది? తలుచుకుంటే తల దిరుగతంది. గెలిత్తేనేమో ఊళ్లెనే సర్పంచ్‌గా ఉంటూ పెట్టిన ఖర్చుకు నాలుగింతలు గుంజుత. లేకపోతే తలచుకుంటేనే గుండె గుబుల్లు మంటుంది. ఇగ నా బతుకంతా గా ఓటర్ల చేతిల ఉంది..'

అని అనుకుంట అవుతలికి పోదామని వెళ్లేసరికి తెల్లగా తెల్లారింది.. అడోళ్లంతా వాకిళ్లు ఊడుస్తుండ్రు..పార్టీ కండువా మెడలో వేసుకొని శివయ్య ఓట్లు వేసే బడికి కాడికి పోయి ఓటర్లకు ఎంతో కొంత ఇచ్చేందుకు పయనమయిండు.

మరి గెలుత్తడో.. ఓడుతడో శివయ్యకే అంతుబడత లేదు. ఇది ఒక్క శివయ్య బాధ కాదు.. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులందరి మనసులో ఉన్న బాధ.

- ఆంధ్రజ్యోతి, రఘునాథపల్లి

పోలింగ్ ఏజంట్లే కీలకం

ఊరు-పోరు VOORU - PORU

• గ్రామ ఓటర్లనే నియమించుకోవాలి • దొంగ ఓట్లను గుర్తించేది వారే..



వర్ధన్నపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల రోజు పోలింగ్ ఏజంటే కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డుకు పోటీ చేస్తున్న ప్రతీ వ్యక్తి, ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ఏజంట్‌ను నియమించుకోవాలి. దొంగ ఓటర్లను గుర్తించేది వారు కావడంతో సర్పంచ్‌గా పోటీ చేసే ప్రతి అభ్యర్థి, వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి కీలకమైన వ్యక్తిని ఏజంట్‌గా నియమించుకుంటేనే వారి గెలుపు సాధ్యమవుతుంది. సర్పంచ్ పదవికి పోటీ చేసే వ్యక్తులు ఏ వార్డు నుంచైనా వార్డు మెంబర్ పోటీ చేస్తున్నారో అదే వార్డుకు సంబంధించిన ఓటరును పోలింగ్ ఏజంట్‌గా నియమించుకోవాలనే నిబంధన ఉంది. ఏదైనా కారణాల వల్ల ఇతరులను నియమించుకోవాల్సి వస్తే ముందే ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రాతపూర్వకంగా తెలిజేయాలి. దానిని పరిశీలించి అనుమతి ఇస్తే తప్ప ఇతరులను నియమించేందుకు వీలులేదు.

కౌంటింగ్ ఏజెంట్ల నియామకం

ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో మొదట వార్డుల వారీగా కౌంటింగ్ ఏజెంట్లను తీసుకొని కౌంటింగ్ నిర్వహిస్తారు. కౌంటింగ్ ఏజెంట్‌గా వచ్చే వారు ప్రభుత్వ ఉద్యోగి, పలు రాజకీయ పదవులు చేసినా వారు అనర్హులు. వీరిని తప్ప ఎవరినైనా ఏజెంట్లుగా నియమించుకోవచ్చు.

ఓటర్లను గుర్తించేది ఏజంట్లే..



ప్రతీ వార్డులో ఆ వార్డుకు సంబంధించిన ఓటరు వచ్చినపుడు ఎన్నికల సిబ్బంది ముందుగా క్రమ సంఖ్యతో పాటు అతని పేరు తెలియ జేస్తారు. ఏజెంట్లు అంగీకరించినప్పుడే ఓటరుకు వేలుపై ఇంక్ పెట్టి బ్యాలెట్ పేపర్ అందజేస్తారు. ఓటరు బ్యాలెట్ పేపర్ అందిన తర్వాత ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేసినా ఎన్నికల అధికారి దానిని పరిగణలోకి తీసుకోరు. ఎవరైనా ఏజెంట్ అభ్యంతరం వ్యక్తం చేస్తే ప్రిసీడింగ్ అధికారి సమక్షంలో నిగ్గుతెల్చిన తర్వాతే ఆ ఓటరుకు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

ఏజంట్ల వివరాలు రిటర్నింగ్ అధికారికి పంపాలి

సర్పంచ్ అభ్యర్థి, వార్డు సభ్యుడిగా పోటీ చేసే వ్యక్తి స్క్రూటీని పూర్తి కాగానే ఏజంట్‌గా నియమించుకునే వ్యక్తి అంగీకార పత్రాన్ని రాత పూర్వకంగా డూప్లికేట్ కాపీతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపించాలి. పరిశీలన అనంతరం రిటర్నింగ్ అధికారి నియామక పత్రంపై ఆమోదం తెలుపుతూ సంతకం చేసి ఒక కాపీని ఏజంట్‌కు అందజేస్తారు.

టెండర్, చాలెంజ్ ఓటు చాలా పవర్

● తేడా వస్తే రీపోలింగ్, నాన్ బెయిలబుల్ వారెంటు

కేసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో టెండరు, చాలెంజ్ ఓటు అంశాలు చాలా పవర్‌ఫుల్ నిబంధనలతో రూపొందించారు. ఒక ఓటరు తన ఓటు వేసేందుకు వెళ్తే అప్పటికే తనఓటు మరొకరు వేస్తే టెండరు ఓటువేసే అవకాశాన్ని ఓటరుకు ఎన్నికల సంఘం కల్పిస్తుంది. టెండరు ఓటును ప్రత్యేక కవరులో సీలు చేస్తారు. ఈ ఓటును సాధారణ ఓట్లతో లెక్కించరు. ఎన్నికల తర్వాత విచారణ అనంతరం అధికారుల అనుమతితో లెక్కలోకి తీసుకుంటారు. అయితే పోలైన ఓట్లలో 0.1శాతం కంటే ఎక్కువగా అంటే వెయ్యి ఓట్లలో కనీసం ఒక్క టెండరు ఓటు వచ్చినా ఆ బూత్‌లో ఎన్నికలు నిలిపివేసి ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తారు. ఎన్నికల సంఘం ఆ బూత్ వరకు రీపోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. ఓటరును 16 రకాల గుర్తింపుకార్డులు, ఏజెంట్ల క్షుణ్ణంగా పరిశీలనతో ఓటు వేయించే ఏర్పాట్లు ఉన్నందున టెండరు ఓటుకు సాధారణంగా అవకాశం రాదు.

చాలెంజ్ నిరూపణ అయితే జైలుకే..

ఎన్నికల్లో ఒక ఓటరు అర్హతను చాలెంజ్ చేసి నిరూపిస్తే సదరు ఓటరు నాన్‌బేయిలబుల్ వారెంటుతో జైలుకు తరలించే కఠిన నిబంధనలు ఉన్నాయి. ఓటరు వయస్సు లేదా ఇతర అర్హతల్లో ఏజెంట్ ఎవరైనా అభ్యంతరం పెడితే ఓటరుకు చాలెంజ్ ఓటుకు వేసే అవకాశం ఇస్తారు. అయితే ఈ విషయంలో సదరు ఏజెంట్‌కు పోలింగ్ బూత్ ప్రిసైడింగ్ అధికారికి చాలెంజ్ ఏర్పడుతుంది. దీన్ని ఏజెంటు రూ.2లు డిపాజిట్ చెల్లించి చాలెంజ్ చేస్తాడు.

ఈ చాలెంజ్‌ను ఏజెంటు ఆధారాలతో నిరూపిస్తే సదరు ఓటరును ప్రిసైడింగ్ అధికారి వెంటనే అరెస్టు చేయించే అవకాశం ఉంది. ఒకవేళ చాలెంజ్‌ను నిరూపించలేకపోతే సదరు ఓటరు చాలెంజ్ ఓటును సాధారణ ఓటరు మాదిరిగానే వేస్తాడు. చాలెంజ్ చేసిన ఏజెంటు డిపాజిట్‌ను తిరిగి ఇవ్వరు. ఈ రెండు రకాల ఓట్లకు నిబంధనలు కఠినంగా ఉన్నందున సాధారణంగా వీటిని వాడేది చాలా అరుదుగా వస్తుంది.

మూడో విడతలో తీవ్ర పోటీ

» సర్పంచ్ స్థానాలకు 393, వార్డ్ మెంబర్లకు 1,673 మంది
» ఏడుగురు సర్పంచ్‌లు ఏకగ్రీవం

వరంగల్‌సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడో విడతలో ఖానాపురం, చెన్నారావుపేట, నర్సంపేట, నెక్కొండ మండలాలలో మొత్తం 109 గ్రామ పంచాయతీలు 2754 వార్డులకు ఈనెల 17న ఎన్నికలు జరుగనున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 393 మంది సర్పంచ్ అభ్యర్థులుగా, 1673మంది వార్డ్‌మెంబర్స్‌గా బరిలో నిలిచారు.

నెక్కొండ మండలంలో ఐదుగురు సర్పంచ్‌లు ఏకగ్రీవమయ్యారు. అదేవిధంగా చెన్నారావుపేట మండలం అమృతండా, ఖానాపురం మండలం డబీర్‌పేట సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇక నర్సంపేట మండలంలో ఆరు వార్డ్‌మెంబర్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.

ఖానాపూర్ మండలంలో 21 గ్రామాలు, 184 వార్డులుండగా... 61 మంది సర్పంచ్, 382మంది వార్డ్‌మెంబర్స్ బరిలో నిలిచారు. డబీర్‌పేట సర్పంచ్‌గా దనుసరి సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నర్సంపేట మండలంలో 19 గ్రామాలు, 164 వార్డులుండగా... నామినేషన్ల ఉపసంహరన అనంతరం 145మంది సర్పంచ్ అభ్యర్థులు, 487మంది వార్డ్‌మెంబర్స్ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఆరు వార్డ్‌మెంబర్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. నెక్కొండ మండలంలో 39 గ్రామాలు, 340 వార్డులుండగా.. 96మంది సర్పంచ్ అభ్యర్థులు, 258 మంది వార్డ్‌మెంబర్లు బరిలో ఉన్నారు. ఐదు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. చిన్నకోల్పోల్ సర్పంచ్‌గా బానోతు అనిత(కాంగ్రెస్), దేవునితండా బానోతు వాగ్య నాయక్ (కాంగ్రెస్), వెంకట్‌తండా దరావత్ మాలు (కాంగ్రెస్), నక్కలగుట్ట తండా బానోతు రవి(కాంగ్రెస్), టేకులకుంట తండా సర్పంచ్‌గా మాలోతు విజయ(ఇండిపెండెంట్) ఎన్నికయ్యారు. చెన్నారావుపేట మండలంలో 30 గ్రామాలు, 258 వార్డులుండగా... 91 మంది సర్పంచ్, 546మంది వార్డ్‌మెంబర్స్‌స్థానాల కోసం బరిలో నిలిచారు. అమృతండా సర్పంచ్‌గా బోడ వారాసింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రచార పర్వంలోకి అభ్యర్థులు

ఎన్నికల నామినేషన్లు, ఉపసంహరణల తంతు పూర్తి కావడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కుల,మహిళా సంఘాలను, గ్రామ పెద్దలను, రాజకీయ నాయకులను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.



హనుమకొండ జిల్లా కమలాపురం మండల కేంద్రంలో ఎన్నికల సామగ్రిని సరి చూసుకుంటున్న సిబ్బంది



వరంగల్ జిల్లా పర్వతగిరిలో ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న అధికారులు

తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికలు నేడు (గురువారం) జరగనున్నాయి. ఇందుకోసం ఆయా జిల్లాల అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. హనుమకొండలో మూడు, వరంగల్‌లో మూడు, జనగామలో ఐదు, మహబూబాబాద్‌లో ఐదు, భూపాలపల్లిలో నాలుగు, ములుగులో మూడు మండలాల్లో తొలి విడత ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల సిబ్బంది బుధవారం నాడే పోలింగ్ కేంద్రాలు చేరుకున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహబూబాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సామగ్రిని సరి చూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది





ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఎన్నికల సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది



జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో పోలింగ్ సామగ్రిని సర్దుకుంటున్న సిబ్బంది



భూపాలపల్లి జిల్లా గణపురంలో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

నదులను అనుసంధానం చేయాలి

» ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించాలి
» అఖిల భారత రైతు సమాఖ్య, జమ్మూరి కిసాన్ సభ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సత్నాం సింగ్

గిర్మాజిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలోని 400 నదులను అనుసంధానం చేయడంతో పాటుగా ఒకరికి 7 ఎకరాల వ్యవసాయ భూమి, 10 ఎకరాల ఇతర భూమి ఉండేలా ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించాలని అఖిల భారత రైతు సమాఖ్య, జమ్మూరి కిసాన్ సభ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వరంగల్‌లోని ఒక హోటల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన అఖిల భారత రైతు సమాఖ్య, జమ్మూరి కిసాన్ సభ సమావేశాలు బుధవారం ముగిశాయి. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో రైతు సంఘాల నాయకులు డాక్టర్ సత్నాం సింగ్ అజ్నాలా (జమ్మూరి కిసాన్ సభ), అనుభవ్ దాసు శాస్త్రి (అఖిల భారత రైతు సమాఖ్య) మాట్లాడారు. పాలకుల కార్పొరేట్ విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని, దీనిపై పోరాడేందుకు బలమైన రైతు ఉద్యమాన్ని నిర్మించేందుకు 2026 మే 12,13, 14 తేదీల్లో వరంగల్‌లో అఖిల భారత కిసాన్ కోఆర్డినేషన్ కమిటీ జాతీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశంలోని 400 నదులను అనుసంధానం చేస్తే వ్యవసాయానికి నీటి సమస్య రాదన్నారు. 60 సంవత్సరాలు నిండిన రైతులకు నెలకు రూ. 10 వేలు పెన్షన్ చెల్లించాలని, ఇటీవల తీసుకువచ్చిన విద్యుత్తు, విత్తన బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలు, 4 నూతన లేబర్ కోడ్‌లను విరమించుకోవాలని కోరారు. ఆదివాసీ ప్రాంతాల్లో సహజ వనరుల దోపిడీని ఆరికట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు వల్లేపు ఉపేందర్‌రెడ్డి, హంసారెడ్డి, బాబు రావు, శివయ్య, నాగభూషణం, అజాత్ సింగ్, రమేష్ ఠాకూర్, కులదీప్ సింగ్, భూప్ నారాయణ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

గిర్మాజిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన వేర్వేరు రైలు ప్రమాదాల్లో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందారు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రయాణికుడు కాజీపేటలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగి తిరిగి అదే రైలు ఎక్కబోతుండగా పట్టుతప్పడంతో రైలు కిందపడి మృతిచెందాడు. అతడి వద్ద మంగళవారం ఖమ్మం నుంచి వరంగల్‌కు వచ్చిన రైలు టికెట్ మినహా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచి హెడ్‌కానిస్టేబుల్ ఎస్.రవీందర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. రైల్వే టికెట్ ఆధారంగా తను ఖమ్మం వాసిగా అనుమానిస్తున్నారు. ఇతర వివరాలకు జీఆర్‌పీ 9849749220/8712658627 నంబర్లలో సంప్రదించాలని జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ కోరారు.

అలాగే వరంగల్ రైల్వేగేటు సమీపంలోని సంతోషిమాతా దేవాలయం సమీపంలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి (53) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. మృతుడు ఐదున్నర అడుగుల ఎత్తు కలిగి మల్టీ కలర్ లుంగీ, గ్రీన్ అండ్ బ్లూ గీతల ఫుల్ షర్టు ధరించి ఉన్నాడని, ఎలాంటి ఆధారాలు లభించలేదని వివరించారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామని, వివరాలకు హెడ్‌కానిస్టేబుల్ ఎస్.రవీందర్ రెడ్డిని పైన తెలిపిన నంబర్లలో సంప్రదించాలని సీఐ కోరారు.

ఇక బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో వరంగల్ రైల్వేగేటు సమీపంలోని మేఘన బార్ సమీపంలోని చిన్న బ్రిడ్జి వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (35) మృతిచెందాడు. మృతుడి తల గుర్తుపట్టలేని విధంగా ఉందని, మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచి హెడ్‌కానిస్టేబుల్ జి.సుదర్శన్ కేసు దర్యాప్తు చేస్తున్నారని సీఐ సురేందర్ తెలిపారు. వివరాలకు 9701747014/8712658585 నంబర్లలో సంప్రదించాలని సీఐ సూచించారు.



వరంగల్‌లో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి



సంతోషిమాత గుడి సమీపంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రభుత్వ సైనిక్ స్కూల్ ప్రారంభం ఎప్పుడో ?

బాలసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ప్రాంత విద్యార్థుల కోసం 2014లో హనుమకొండ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం సైనిక్ స్కూల్ మంజూరు చేసిందని అప్పటి నుంచి పాఠశాల ఎప్పుడు ప్రారంభమవుతుందా..? అని ఎదురు చూస్తున్న జిల్లా వాసులకు నిరాశే మిగిలిందని హనుమకొండ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, ఓరుగల్లు కన్జూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షుడు కె.దామోదర్ ఒక సంయుక్త ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య పరిపాలనా పరమైన అవగాహన ఒప్పందం జరిగిందని తెలిపారు. 2003లో ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి వద్ద 50 ఎకరాల స్థలం సర్వే నిర్వహించి కేటాయించారని వివరించారు. కానీ ఇప్పటి వరకు సైనిక పాఠశాల ప్రారంభానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత విద్యార్థులకు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, సైనిక అధికారులుగా అవకాశాలు కలిగేలా చూడాలని ఎమ్మెల్యేలకు, మంత్రులకు, ప్రజా ప్రతినిధులకు వారు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించండి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మడిపల్లి, జయగిరి, అనంతసాగర్, సీతంపేట, నాగారం, సీతానాగారం గ్రామాలలో రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి పనులతో ఆయా గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను వివరించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఆయా గ్రా మాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు డప్పుచప్పుళ్ళతో ఊరిలోకి ఆహ్వానించారు.

సమాచారం లేకుండా ట్రాఫిక్ డైవర్షన్

పాఠశాల, ఆఫీస్‌లకు వెళ్లే సమయంలో రోడ్డుపై చెట్లు నరికివేత

ఇబ్బందులు పడిన విద్యార్థులు, వాహనదారులు



రోడ్డుకు అడ్డంగా పెట్టిన పోలీస్ వాహనం

వరంగల్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా బాలసముద్రం రోడ్డులో బుధవారం ఉదయం ట్రాఫిక్ డైవర్షన్ పెట్టడంతో పాఠశాల విద్యార్థులు, ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లే సమయంలో బాలసముద్రంలోని రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న చెట్లను డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో కట్ చేశారు. ఈ క్రమంలో వాహనాలను మళ్లించారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో ఈ దారి గుండా వచ్చే పాఠశాల వాహనాలు, ఇతర వాహదారులు ఇబ్బందులకు గురయ్యారు. అధికారుల తీరుపై మండిపడ్డారు.

'తడి, పొడి చెత్తపై అవగాహన అవసరం'

వడ్డెపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని జీడబ్ల్యూఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషా నాయక్ అన్నారు. హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్ కాలనీలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, సీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు బుధవారం తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాషా నాయక్ మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను హానికరమైన చెత్తను వేరు చేసి మునిసిపల్ స్వచ్ఛ ఆటో కార్మికుడికి ఇవ్వాలని అన్నారు. బాషా నాయక్‌ను కాలనీ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ జవాన్లు సునిత, నరేష్‌తో పాటు వలంటరీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

'ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి'

సుబేదారి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు ప్రతీ ఒక్కరు వ్యాయామం అలవాటు చేసుకోవాలని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి అన్నారు. కనకదుర్గ కాలనీ పార్కులో వాకర్స్ సభ్యుడు టివి.శేషగిరి 81వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ రఘుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు చిదురాల మధుకర్‌రెడ్డి, సాంబశివరావు, రామనాథం, డాక్టర్ రాధాకృష్ణ, లక్ష్మారెడ్డి, రామ్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, నారాయణరెడ్డి, హనుమంతరావు, నాగభూషణం, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వివిధ కాలనీల వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ

మడికొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మడికొండలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి మహా పడిపూజను అయ్యప్ప మాలధారులు వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. 18 మెట్లతో కూడిన అయ్యప్పస్వామి చిత్రపటంతో పాటు విఘ్నేశ్వరుడు, లక్ష్మీదేవి చిత్రపటాలను అందంగా అలంకరించారు. పూజారి గురుస్వామి శ్రీకాంత్ మంత్రోశ్చరణలతో అయ్యప్ప స్వామిని కీర్తిస్తూ ఆట పాటలతో భక్తి శ్రద్ధలతో కొలిచారు. అయ్యప్ప స్వామి శరణుఘోషతో మడికొండ మార్మోగింది. అనంతరం మాలధారులకు అల్పాహారాన్ని అందజేశారు. పూజలో శ్రీకాంత్‌స్వామి, క్రాంతి స్వామి, శ్రీహర్ష, రాజేష్, కృష్ణమూర్తి స్వామి తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న మాలధారులు

న్యాయవాదులు.. హక్కులను కాపాడే సైనికులు

హనుమకొండ జిల్లా జడ్జి పట్టాభి రామారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి పట్టాభి రామారావు

వరంగల్ లీగల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు సామాన్య ప్రజల మానవ హక్కులు కాపాడే సైనికులని హనుమకొండ జిల్లా జడ్జి డాక్టర్ కె.పట్టాభిరామారావు అన్నారు. బుధవారం ప్రపంచ మానవ హక్కులదినం సందర్భంగా హనుమకొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని ప్రధానాంశాలను మన రాజ్యాంగంలో పొందుపర్చాలని ఆయన గుర్తుచేశారు. మానవ హక్కులను కాపాడడం కోసం అందరు పోరాడాలని ముఖ్యంగా న్యాయవాదులు పోరాడే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొత్త రవి, బార్ ప్రతినిధులు అంబేద్కర్, వెంకటేష్, నాగేందర్, ఆశీర్వాదం, సునిల్, స్వాతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగా అడ్వకేట్లుగా నమోదు చేసుకున్న సభ్యులకు బార్ అసోసియేషన్ శాశ్వత సభ్యత్వ గుర్తింపు కార్డులను జిల్లా జడ్జి చేతుల మీదుగా అందజేశారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

అదనపు జిల్లా జడ్జి అపర్ణాదేవి

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల రోజును పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ హ్యూమన్ రైట్స్ అడ్వకేసీ అడ్వయిజరీ సంస్థ సంయుక్తంగా బుధవారం న్యాయ సేవా సదన్ భవనంలో కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో అందరికి మానవ హక్కులపై అవగాహన ఉండాలని ఆమె సూచించారు. మతం, కులం, వర్ణం, లింగం, ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా ప్రతీ మనిషి పుట్టుకతోనే జీవించే హక్కు, విద్యా హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ, సమానత్వం వస్తాయని న్యాయమూర్తి అన్నారు. న్యాయవ్యవస్థలో పనిచేసే న్యాయమూర్తులు, న్యాయవాదులు ప్రతీ ఒక్కరు మానవ హక్కుల కోసం పనిచేయాలని ఆమె అన్నారు.



సేవాసదన్‌లో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి అపర్ణాదేవి

వరంగల్ జిల్లా 3వ అదనపు జిల్లా జడ్జి క్షమాదేశ్‌పాండే మాట్లాడుతూ.. మహిళలపై, బాలలపై దళితుల వెనుకబడిన వర్గాలపై జరుగుతున్న వివక్షను ప్రశ్నించడం అందరి బాధ్యత అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయమూర్తులు, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు భైరపాక జయాకర్, హ్యూమన్ రైట్స్ అడ్వయిజర్ సత్య, అనిల్, తదితర జూనియర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు ప్రతీ వారం సమీక్షించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ. అప్పయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ఎ.అప్పయ్య

వరంగల్ మెడికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు ప్రతీవారం తమ పరిధిలో అన్ని ఆరోగ్య కార్యక్రమాలు సమీక్ష చేయాలని హనుమకొండ డీఎంహెచ్‌వో ఎ.అప్పయ్య అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని వడ్డెపల్లి, శాయంపేట, పెద్దమ్మగడ్డ, లష్కర్‌సింగారం, బోడగుట్ట, హసన్‌పర్తి పీహెచ్‌సీలలో సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రోగ్రాం అధికారులతో తన చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. టీబీ ముక్త్ భారత్ అభియాన్, మాతా శిశు సంక్షేమం, ఎన్‌సీడీ, ఇమ్యునైజేషన్ కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలన్నారు. సాధించిన ప్రగతిపై ఏఎన్ఎంల వారిగా తెలుసుకున్నారు. టీబీ స్క్రీనింగ్ శాతంలో మెరుగుదల ఉందని, దీనిని ఇలాగే కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రుబినా తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది లక్ష్యాలు పూర్తి చేయాలి

హసన్‌పర్తి : ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వైద్య సిబ్బంది పూర్తి చేయాలని, ప్రతీ వారం ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి గడువులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో అప్పయ్య ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలో వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు, వైద్య సిబ్బందితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు కార్యక్రమాల లక్ష్యాలు సాధించని వారికి వారం గడువు ఇచ్చామన్నారు. సమీక్షలో అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రదీప్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు ప్రభుదాస్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, వైద్యాధికారులు రాంభార్గవ్, కృతికారెడ్డి, క్రాంతి, సురేష్, మానస, మల్లేష్, భరత్, విజయ, సాయిశ్రీ, ప్రహసిత్, సూపర్ వైజర్లు లచ్చులు, రుతమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ జనార్ద న్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌ను పకడ్బందీగా చేపట్టాలి

(5వ పేజీ తరువాయి)

వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఎన్నికల కౌంటింగ్ మధ్యాహ్నం 2 గంటలకు మొదలవుతుందన్నారు. ఓటర్లు తమ ఓటును ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వచ్ఛందంగా స్వయంగా వేస్తామని ముందుకు వస్తున్నారన్నారని, ఇది మంచి పరిణామమన్నారు. జిల్లాలో మొదటి విడత మూడు మండలాలైన భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో 69 గ్రామపంచాయతీల గాను 5 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయని, 64 గ్రామపంచాయతీలకు, 658 వార్డులకు గాను 155 వార్డులు ఏకగ్రీవం కాగా 503 వార్డులకు గురువారం పోలింగ్ జరగనుందన్నారు. 64 గ్రామపంచాయతీల్లో 14 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రవి, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేష్, ప్రత్యేకాధికారులు అనసూయ, జోనల్ రూట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

బాలసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని దళిత క్రైస్తవ ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్ల కుమార్ డిమాండ్ చేశారు. హనుమకొండ హరిత హోటల్‌లో మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఐక్య రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1950లో వచ్చిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌ను సవరణ చేయాలని దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని అన్నారు. దేశంలో అన్ని కులాల సముదాయాన్ని భారత రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలుగా విభజించి రాజ్యాంగం అమలులోకి వచ్చిందన్నారు. దేశంలో ప్రజలు ఏమతమైనా స్వీకరించవచ్చని రాజ్యాంగంలో పేర్కొన్నారని అన్నారు. ఓసీ, బీసీ, ఎస్టీ కులాల ప్రజలు క్రైస్తవ మందిరాలకు వెళ్తే వారికులం మారదని, దళితులు వెళ్తేనే కులం మారుతుందా? అని ప్రశ్నించారు. రాజ్యాంగం అములులోకి వచ్చిన నాటి నుంచి దళిత, క్రైస్తవులకు ఎస్సీ హోదాను, రిజర్వేషన్లను, ఉద్యోగాలను కల్పించడం లేదని ఆయన మండిపడ్డారు.

ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. దళిత క్రైస్తవుల హక్కుల గురించి ఎంపీ కడియం కావ్య ఎందుకు మాట్లాడడం లేదని విమర్శించారు. దళిత, క్రైస్తవుల హక్కులు కోల్పోవడం రాజ్యాంగ విరుద్ధమని ఏఐవైసీ జాతీయ అధ్యక్షుడు వలీ ఉల్లాఖాద్రి అన్నారు. అంటరానితనం వల్లనే హిందువులు వివిధ మతాల్లోకి మారుతున్నారని బరిగెల శివ అన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో ఇంకా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌సింగ్, దళిత బహుజన ఫ్రంట్ వైస్ ప్రెసిడెంట్ చుంచు రాజేందర్,సామాజిక ఉద్యమకారులు కేడల ప్రసాద్, గడ్డం సుధాకర్, సీఐటీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్ పాల్గొన్నారు.

భూన్యాయ శిబిరం

బాలసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమకొండలోని లీఫ్స్ కార్యాలయంలో భూన్యాయ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రైతులకు వారు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి న్యాయవాదులు న్యాయ సలహాలు అందించారు. భూమి ఉండి పాస్‌పుస్తకాలు లేనివారు, ఉన్న భూమికంటే రికార్డుల్లో తక్కువ నమోదైన వారు పట్టా భూమి నిషేధిత జాబితాలో చేరిన వారు, భూమి రికార్డుల్లో తప్పు నమోదైన వారు తమ సమస్యలను వివరించారు. భూమి సునీల్, తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, న్యాయవాదులు జీవన్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, ప్రవీణ్, రవి సలహాలు అందించారు.

16 నుంచి ధనుర్మాస వ్రతాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపేంద్రశర్మ తదితరులు

హనుమకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. బుధవారం హంటర్‌రోడ్‌లోని నందిహిల్స్‌లో కొలువై ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవ పోస్టర్‌ను ఆలయ అర్చకుడు ఎం. రంగనాథాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, సురేశ్ కుమార్, లక్ష్మారెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు తిరుప్పావై సేవా కాలం జరుగుతుందని, సాయంత్రం 6.30 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం జరుగుతుందన్నారు. ధనుర్మాస వ్రతం 16వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్నందున పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉత్సవాలను ప్రారంభించుకొని గోదాదేవి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

'మనిషి జీవనానికి హక్కులు మూలాధారం'

సుబేదారి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులు మని షి జీవించడానికి అవసరమైన మూలాధారాలు అని కేయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజుగౌడ్ అన్నారు. బుధవారం సుబేదారిలోని లా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుదర్శన్ అధ్యక్షతన జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా 'మానవ హక్కులు- జీవించడానికి అవసరాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా చిర్ర రాజుగౌడ్ హాజరై మాట్లాడారు. ఆహారం, నీరు, నివాసం ఎంత అవసరమో మానవ హక్కులు కూడా అంతే అవసరమన్నారు. మానవ హక్కులు లేకపోతే మన జీవితం గౌరవం లేని జీవనంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు పుల్లూరు సుధాకర్, టి.విజయ్ చందర్, విశ్రాంత ఆచార్యులు సుధాకర్, మానవ హక్కుల ఫోరం తెలంగాణ కో ఆర్డినేటర్ ధర్మారపు రాజగోవింద్, కేయూ లా డీన్ శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ చల్ల శ్రీనివాస్, డాక్టర్ ప్రభాకర్, విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు అడ్వకేట్స్ తదితరులు పాల్గొన్నారు.

జాతర అభివృద్ధి పనులు ప్రారంభం

మడికొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట మండలం కొత్తపల్లి హవేలి శివారులోని అమ్మవారిపేట సమ్మక్క- సారలమ్మ జాతరలో అభివృద్ధి పనులకు జీడబ్ల్యూఎంసీ 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనిత రంజిత్‌రావు బుధవారం క్లీన్ అండ్ గ్రీన్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. తొలుత సమ్మక్క- సారలమ్మ గద్దెలకు జాతర చైర్మన్ కోడూరు భిక్షపతితో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతర అభివృద్ధికి నిధులు కేటాయించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మవారిపేట సమ్మక్క- సారలమ్మ జాతర ఆర్గనైజర్ దాసి రాందేవ్, కోశాధికారి భైరి నాగరాజు, కో కోశాధికారి భైరి హరినాథ్, ప్రచార కార్యదర్శి ఆవునూరి రామ్మూర్తి ప్రజాప్రతి, బాయికాడి కుమా ర్‌స్వామి, ఆవునూరి నాగరాజు, పూజారి భైరి శ్యాంసుందర్, ఆవునూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి రిటైర్డ్ ఎంప్లాయీస్ ఆర్థిక సాయం

కాజీపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాజీపేట దర్గాలో ప్రగతి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, దీన బంధు సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వికలాంగులకు, వృద్ధులకు ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు మోడెం సమ్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీఎస్ మూర్తి సహకారంతో పూల్లూరి నర్సయ్య చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి పుల్ల శ్రీనివాస్ హాజరై 55 మందికి రూ.5500 అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కె. రాందాస్, కోశాధికారి దాగిళ్ల భాస్కర్, ఉపాధ్యక్షులు రాజన్ బాబు, గట్టయ్యతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

'తొలి విడత' తీర్పు నేడే..

(5వ పేజీ తరువాయి)

గ్రామపంచాయతీలో కేవలం సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. ఈ మూడు మండలాల్లో మొత్తం 153 వార్డులు ఏకగ్రీవం అయినవి పోగా 64 పంచాయతీలకు 505 వార్డులకు గురువారం పోలింగ్ జరగనున్నది. సర్పంచ్ స్థానాలకు 264 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 1,339 మంది పోటీ పడుతున్నారు.

హోరాహోరీ ప్రచారం

గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం సాగించారు. నామినేషన్లు వేసిన రోజునుంచే ప్రచారం మొదలు పెట్టారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలను చేశారు. అన్ని అస్త్రశస్త్రాలను ప్రయోగించారు. హామీలను గుమ్మరించారు. తాయిలాలను పంపిణీ చేశారు. మద్యం ఏరులై పారింది. ప్రచారం ముగిసిన వెంటనే అభ్యర్థులు మూటలకు పని చెప్పారు. గురువారం రాత్రంతా ఓటర్లను ఆకట్టుకునే బిజీలోనే అభ్యర్థులు నిద్రలేని రాత్రిని గడిపారు. ఎన్నికలు పార్టీ గుర్తులు లేకుండా జరిగినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మద్దతుతోనే బరిలో నిలిచారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ పార్టీ మద్దతు ఇస్తున్న అభ్యర్థులను గెలిపించుకునేందుకు తమ వంతుగా బాగానే చెమటోడ్చారు. మంత్రుల పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెలేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, పాడి కౌశిక్‌రెడ్డితో పాటు ఇతర పార్టీ ముఖ్యులు తమ వంతు ప్రచారం సాగించారు. వీరి ప్రచారం ప్రభావం ఏ మేరకు ఫలించిందో గురువారం నాడు తేలుతుంది.

మహిళా ఓటర్లే ఎక్కువ

తొలి విడతగా మూడు మండలాల పరిధిలోని మొత్తం 1,30,734 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించబోతున్నారు. వీరిలో పురుషులు 63,681 మందికాగా, స్త్రీలు 67,052 మంది. ఇతరులు ఒకరు. భీమదేవరపల్లి మండలంలో మొత్తం 41,898 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 20,444 మంది, స్త్రీలు 21,454, ఎల్కతుర్తి మండలంలో మొత్తం 32,491 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 15,840, స్త్రీలు 16,650, ఇతరులు ఒకరు, కమలాపూర్ మండలంలో మొత్తం 56,345 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 27,397, స్త్రీలు 28,948 మంది ఉన్నారు.. పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నందు వల్ల వారి తీర్పే కీలకం కానున్నది.

పోలింగ్ మెటీరియల్ పంపిణీ

మూడు మండల కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి బుధవారం పోలింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కమలాపూర్ మండల కేంద్రంలో మోడల్ స్కూల్, ఎల్కతుర్తి మండలం కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీల వారీగా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయింపు, పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను కలెక్టర్ స్నేహ శబరీష్ స్వయంగా పరిశీలించారు మెటీరియల్‌తో పోలింగ్ కేంద్రాలకు సిబ్బందికి వాహనాలను ఏర్పాటు చేశారు. బుదవారం రాత్రికే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది.. అక్కడ బస చేసి ఉదయం పోలింగ్ విధుల్లో పాల్గొంటారు. గ్రామాల్లో 90 శాతం ఓటర్లకు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశారు. ఇతర ప్రాంతాలకు వలస పోవడం, లేదా చనిపోవడంవల్ల మిగతా 10 శాతం మందికి స్లిప్పులను అందజేయలేకపోయారు. 69 గ్రామ పంచాయతీల్లో 14 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పోలింగ్ సజావుగా జరిగేందుకు వీలుగా మైక్రో అబ్జర్వను నియమించారు. సీసీ కెమెరాలను అమర్చారు. భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భారీ బందోబస్తు

పంచాయతీ మొదటి విడత ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద నలుగురు, అంతకన్నా ఎక్కువమంది పోలీసులను నియమించారు. సమస్యాత్మక గ్రామాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు. బందోబస్తు కోసం మూడు మండలాల్లో 800 మందికిపైగా పోలీసులను నియమించారు. డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజల్ విభాగానికి చెందిన సిబ్బంది వీరిలో ఉన్నారు. అదనపు డీసీపీ స్థాయి పర్యవేక్షణలో స్పెషల్ స్ట్రయికింగ్ ఫోర్సును నియమించారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఒక ఎస్‌ఐ, లేదా ఏఎస్‌ఐతో పాటు హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, హోంగార్డు విధుల్లో ఉంటారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : హన్మకొండ
Hanamkonda ACO - 9985410935,
Hasanparthy SR - 8519926489,
Hanamkonda - 9704361601
Parkal SR- 7396327489,
Kazipet SR - 8247285199, ACM - 9985411664



భారత కుర్రాళ్లకు కాంస్యం

- అర్జెంటీనాపై విజయం
- జూనియర్ హాకీ విజేత జర్మనీ

చెన్నై: సొంతగడ్డపై జరిగిన జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో ఫైనల్ చేరడంలో విఫలమైన భారత యువ జట్టు కాంస్య పతకంతో సరిపెట్టుకుంది. బుధవారం జరిగిన మూడో స్థానం పోరులో భారత్ 4-2తో అర్జెంటీనాను చిత్తుచేసి కంచు మోత మోగించింది. అంకిత్ పాల్ (49వ నిమిషంలో), మన్మీత్ సింగ్ (52వ), శారదానంద తివారి (57వ), అన్మోల్ ఎక్కా (58వ) తలో గోల్ సాధించారు. అర్జెంటీనా తరఫున రోడ్రిగెజ్ (3వ), ఫెర్నాండెజ్ (44వ) చెరో గోల్ కొట్టారు. కాగా.. 2016లో ఈ టోర్నీ విజేతగా నిలిచిన యువ భారత్.. గత రెండు సార్లు పోడియం ఫినిష్ కూడా చేయలేకపోయింది. ఇక జర్మనీ జట్టు ప్రపంచ విజేతగా నిలిచింది. ఫైనల్లో జర్మనీ పెనాల్టీ షూటౌట్‌లో 3-2తో స్పెయిన్‌ను ఓడించి 8వసారి ట్రోఫీ గెల్చుకుంది.

వెస్టిండీస్ 205 ఆలౌట్

- కివీస్‌తో రెండో టెస్టు
- గాయంతో కుప్పకూలిన టిక్నర్


టిక్నర్ (4/32)

వెల్లింగ్టన్: ఆతిథ్య న్యూజిలాండ్ పేసర్లు బెయిర్ టిక్నర్ (4/32), మైకేల్ రే (3/65) విజృంభించడంతో బుధవారం మొదలైన రెండో టెస్టులో వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 75 ఓవర్లలో 205 పరుగులకే కుప్పకూలింది. షాయ్ హోప్ (48), క్యాంప్‌బెల్ (44), బ్రాండన్ కింగ్ (33) రాణించారు. అనంతరం కివీస్.. తొలి రోజు ఆట ముగిసేసరికి 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 24 పరుగులు చేసింది.

అయ్యో..టిక్నర్



పునరాగమనంలో తన తొలి టెస్టులో అద్భుత గణాంకాలతో ఆకట్టుకున్న పేసర్ టిక్నర్‌కు ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఫీల్డింగ్ చేస్తుండగా బంతి తగిలి తీవ్రగాయంతో టిక్నర్ మైదానాన్ని వీడడం కివీస్ శిబిరంలో ఆందోళన రేకెత్తించింది. విండీస్ ఇన్నింగ్స్ 66వ ఓవర్లో మైకేల్ రే బౌలింగ్‌లో బ్యాటర్ టెవిన్ ఇమ్లాచ్ ఫైన్ లెగ్ దిశగా బంతిని గాల్లోకి లేపాడు. ఫీల్డర్ టిక్నర్ బంతిని ఆపే క్రమంలో పల్టీ కొట్టాడు. ఈ క్రమంలో తన ఎడమ భుజంపై మొత్తం భారం పడడంతో టిక్నర్ నొప్పితో విలవిల్లాడుతూ మైదానంలోనే కుప్పకూలాడు. దీంతో ఫిజియో వచ్చి టిక్నర్‌ను మైదానం బయటకు తీసుకురాగా, అటునుంచి అటే అతడిని ఆసుపత్రికి తరలించారు. టిక్నర్ ఎడమ భుజం పూర్తిగా విరిగిందని చెబుతున్నారు.

కష్టాల మీద కష్టాలు...: 2023 మార్చి తర్వాత ఇప్పుడే మళ్లీ టెస్టు ఆడుతున్న 32 ఏళ్ల టిక్నర్‌కు కెరీర్‌లో ఒకదాని వెంట ఒకటి కష్టాలు వచ్చి పడుతూనే ఉన్నాయి. 2023లో తన తొలి టెస్టు ఆడేకంటే ముందు టిక్నర్ తండ్రి ఇల్లు తుఫాన్‌లో కొట్టుకుపోయింది. 2024లో కౌంటీల్లో డెర్బీషైర్ జట్టుకు ఆడుతున్నప్పుడు గర్భవతిగా ఉన్న టిక్నర్ భార్యకు క్యాన్సర్ నిర్ధారణ అయింది. ఇప్పుడేమో ఇలా తీవ్రమైన గాయంతో అతను కొన్నాళ్లపాటు క్రికెట్ ఆడలేని పరిస్థితి ఏర్పడింది. ఇలా.. టిక్నర్ కెరీర్‌లో అన్నీ విషాదఘట్టాలే.

జోష్‌లో భారత్

రెండో టీ20 నేడు

హార్దిక్ ఫామ్‌తో హుషారు ● ఒత్తిడిలో గిల్ ● సమంపై సఫారీల గురి


రాత్రి 7గం. నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

ముల్లన్‌పూర్ (న్యూ చండీగఢ్): టీ20 సిరీస్‌ను అదిరే విజయంతో ఆరంభించిన భారత్.. అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం దక్షిణాఫ్రికాతో జరిగే రెండో టీ20లోనూ గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. కటక్‌లో జరిగిన మొదటి మ్యాచ్‌లో టీమిండియా అదరగొట్టినా.. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వైఫల్యం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గాయంతో వన్డే సిరీస్‌కు దూరమైన అతడు తగిన విశ్రాంతి తర్వాత బరిలోకి దిగినా.. స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. ముఖ్యంగా అభిషేక్ శర్మకు అతడు ఏమాత్రం సరితూగడం లేదు. గిల్ రాకతో సంజూ శాంసన్‌కు తుది జట్టులో చోటు కష్టమవుతుండడం కూడా అతడిపై ఒత్తిడికి కారణమవుతోంది. తొలి మ్యాచ్‌లో విఫలమైన జితేష్ శర్మకు బదులుగా సంజూ శాంసన్‌ను తీసుకోవాలని సోషల్‌మీడియాలో చర్చ మొదలైంది. కీపర్ బెర్త్ కోసం వీరిద్దరి మధ్య తీవ్రమైన పోటీ ఏర్పడింది. ఇక, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌పై కూడా ఆందోళన నెలకొంది. పొట్టి వరల్డ్‌కప్ నేపథ్యంలో సూర్య తన మునుపటి విధ్వంసకర బ్యాటింగ్ కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. అయితే, గాయం నుంచి కోలుకొన్న హార్దిక్ పాండ్యా ఆడిన తొలి మ్యాచ్‌లోనే అజేయ అర్ధ శతకంతో అదరగొట్టాడు. అతడి నుంచి జట్టు ఇదే తరహా ఇన్నింగ్స్‌ను జట్టు ఆశిస్తోంది. అయితే, బ్యాటింగ్ డెప్త్ కావాలనుకొంటే అర్ష్‌దీప్ స్థానంలో హర్షిత్ రాణాను తీసుకొనే చాన్సులున్నాయి. ఒకవేళ పిచ్ పొడిగా ఉంటే మాత్రం జట్టులో ఎటువంటి మార్పులూ ఉండే అవకాశం లేదు. మరోవైపు దక్షిణాఫ్రికా బలంగా పుంజుకోవాలనుకొంటోంది. బ్రెవిస్ మినహా మిగతా బ్యాటర్లు విఫలం కావడం జట్టును కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో బలమైన బ్యాటింగ్ లైనప్ కోసం సిపామ్లా స్థానంలో ఆల్‌రౌండర్ కోర్బిన్ బాష్‌కు చాన్స్ దక్కొచ్చు.

ఈ మ్యాచ్ సందర్భంగా పంజాబ్ క్రికెటర్లు యువరాజ్ సింగ్, హర్మన్‌ప్రీత్ కౌర్ పేరిట ఏర్పాటు చేసిన స్టాండ్‌ల ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది.


ట్రిస్టన్ స్టబ్స్

జట్లు (అంచనా)

భారత్: అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్ వర్మ, జితేష్ శర్మ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్/రాణా, వరుణ్ చక్రవర్తి, బుమ్రా.

దక్షిణాఫ్రికా: డికాక్, మార్‌క్రమ్ (కెప్టెన్), ట్రిస్టన్ స్టబ్స్, బ్రెవిస్, డేవిడ్ మిల్లర్, డోనోవాన్ ఫెరీరా, యాన్సెన్, సిపామ్లా/బాష్, కేశవ్, ఎన్‌గిడి, నోకియా.

పిచ్/వాతావరణం

ఈ స్టేడియంలో ఇదే తొలి పురుషుల అంతర్జాతీయ టీ20 మ్యాచ్. గత సెప్టెంబరులో రెండు మహిళల వన్డేలు జరిగాయి. పేసర్లకు పిచ్ నుంచి సహకారం అందే చాన్సులున్నాయి. ఐపీఎల్ మ్యాచ్‌ల్లో వికెట్ బ్యాటింగ్‌కు అంతగా అనుకూలంగా కనిపించలేదు. తొలుత బ్యాటింగ్ తీసుకొని 200 పైగా స్కోరు చేస్తే గెలుపు ఖాయమే. మంచు ప్రభావం అంతగా ఉండకపోవచ్చు.

కోచ్‌పై క్రికెటర్ల దాడి



తీవ్ర గాయాలు ● పుదుచ్చేరిలో ఘటన

పుదుచ్చేరి: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 టోర్నీకి తమను ఎంపిక చేయలేదన్న కోపంతో పుదుచ్చేరి అండర్-19 జట్టు ప్రధాన కోచ్ వెంకటరామన్‌పై ముగ్గురు స్థానిక క్రికెటర్లు అమానుషంగా దాడి చేశారు. ఈ దాడిలో కోచ్ నుదుటిపై 20 కుట్లు పడ్డాయి. భుజం విరిగింది. వెంకటరామన్ చేసిన ఫిర్యాదుపై సీనియర్ క్రికెటర్ కార్తికేయన్, అరవింద రాజ్, సంతోష్ కుమరన్‌పై ఎఫ్ఐఆర్ దాఖలు చేసి..వారి కోసం గాలింపు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

పారా షూటింగ్‌లో పావనికి మూడు రజతాలు



న్యూఢిల్లీ: తెలంగాణకు చెందిన బానోత్ పావని జాతీయ పారా షూటింగ్‌లో మూడు రజతాలతో అదరగొట్టింది. ఇక్కడ జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్‌లో వ్యక్తిగత జూనియర్, మిక్స్‌డ్ జూనియర్, మిక్స్‌డ్ సీనియర్ విభాగాల్లో రెండోస్థానంలో నిలిచింది. ఇక ఏపీ షూటర్ సత్య జనార్దన శ్రీధర్ 50 మీటర్ల ఈవెంట్‌లో స్వర్ణం నెగ్గాడు.

రోహిత్ 1.. విరాట్ 2

వన్డే ర్యాంకింగ్స్



దుబాయ్: టీమిం డియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో మరింత ముందు కెళ్లాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో వరుసగా రెండు సెంచరీలతో సత్తాచాటిన 37 ఏళ్ల విరాట్.. బుధవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో రెండుస్థానాలు ఎగబాకాడు. ఈ క్రమంలో నాలుగు నుంచి రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. 773 పాయింట్లతో కోహ్లీ.. నెంబర్‌వన్ బ్యాటర్ రోహిత్ శర్మ (781)కు చేరువగా ఉన్నాడు. గిల్ ఐదో స్థానంలో ఉండగా, కేఎల్ రాహుల్ రెండుస్థానాలు మెరుగై 12వ ర్యాంక్‌లో నిలిచాడు. బౌలర్ల జాబితాలో కుల్దీప్ యాదవ్ మూడుస్థానాలు ఎగబాకి 3వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

మెస్సీనా..మజాకా!

స్టార్‌తో ఫొటో దిగాలంటే రూ.12 లక్షలు





2 రోజుల్లో.. హైదరాబాద్‌కు

ఫుట్‌బాల్ సూపర్ స్టార్ లియోనెల్ మెస్సీ భారత్ రానుండడం.. ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం.. అందులోనూ అతను హైదరాబాద్‌లో అడుగుపెట్టనుండడం.. ఇక్కడ సీఎం రేవంత్ రెడ్డితో పాటు సెలెబ్రిటీలంతా సాకర్ దిగ్గజంతో కలిసి మైదానంలో కాలు కదపనుండడం.. తారలతో కలిసి మ్యాచ్‌లు, సంగీత కచేరీలు, సత్కార వేడుక, ఫుట్‌బాల్ క్లినిక్‌లు.. ఇలా మెస్సీ పర్యటన షెడ్యూల్ ఆద్యంతం అత్యంత ఆకర్షణీయంగా మారనుంది. ఆ సాకర్ మాంత్రికుడి మెరుపులను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులంతా ఇప్పుడు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. శనివారం ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగే మెస్సీ ఎగ్జిబిషన్ మ్యాచ్‌కోసం ఇప్పటికే టిక్కెట్లన్నీ దాదాపు అమ్ముడయ్యాయన్నది నిర్వాహకుల మాట. మెస్సీ ఆటను దగ్గరుండి చూడడమే గాకుండా అతడిని స్వయంగా కలిసి ఫొటోలు దిగే అవకాశం కూడా అభిమానులకు ఉంది. అయితే, అందుకు భారీగా వెచ్చించాల్సి ఉంటుంది.

మీట్ అండ్ గ్రీట్..

మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం కింద అభిమానులతో మెస్సీ ముచ్చటించే కార్యక్రమాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకుగాను ఒక్కో అభిమానికి రూ. 9.95 లక్షలుగా ధర నిర్ణయించారు. దీనికి జీఎస్టీ అదనం. అంటే.. మెస్సీతో ఫొటో దిగాలంటే దాదాపు రూ. 12 లక్షల దాకా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫొటోతో పాటు మెస్సీ సంతకం చేసిన అర్జెంటీనా జట్టు జెర్సీని కూడా అందజేస్తారు.

నా హీరో...

హార్దిక్‌పై గర్ల్‌ఫ్రెండ్ ప్రశంసలు



ముంబై: ఆసియా కప్ సందర్భంగా గాయపడి సుదీర్ఘ కాలం ఆటకు దూరంగా ఉండి జట్టులోకి పునరాగమనం చేసిన హార్దిక్ పాండ్యా దక్షిణాఫ్రికాతో తొలి టీ20లో అదరగొట్టాడు. టీమిండియా 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన మ్యాచ్‌లో హార్దిక్ బ్యాటుతో, బంతితో కీలక భూమిక పోషించాడు. ఈ నేపథ్యంలో హార్దిక్ గర్ల్‌ఫ్రెండ్, మోడల్ మహిక శర్మ అతడి ప్రదర్శనపై ప్రశంసల జల్లు కురిపించింది. 'అతడు కింగ్. నా హీరో. ఎవరు తిరిగొచ్చారో ఊహించండి' అని ఇన్‌స్టాలో ఆమె పోస్ట్ చేసింది.



కియా సెల్టోస్ సరికొత్తగా..

నేటి నుంచి బుకింగ్స్ ప్రారంభం

హైదరాబాద్: కియా ఇండియా ప్రముఖ ఎస్‌యూవీ మోడల్ సెల్టోస్‌ను సరికొత్త రూపంలో బుధవారం హైదరాబాద్ వేదికగా ఆవిష్కరించింది. ఈ కొత్త కారు బుకింగ్స్ దేశవ్యాప్తంగా గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు సంస్థ వెల్లడించింది. రూ.25,000 చెల్లించి ఈ కారును బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. దీని ధరను 2026 జనవరి 2న ప్రకటించనున్నట్లు తెలిపింది.

వెండి కిలో రూ.1.92 లక్షలు

ఈ ఏడాదిలో ఇప్పటివరకు 114% అప్

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్‌లో ర్యాలీ కొనసాగుతోంది. బుధవారం ఒక్క రోజే ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర రూ.11,500 పెరిగి రూ.1.92 లక్షలకు చేరింది. ఇది సరికొత్త రికార్డు. గత రెండు నెలల్లో కిలో వెండి ధర ఒకే రోజు ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటి సారి. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు దేశీయ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,02,300 (114.04%) పెరిగి మదుపరులకు బంపర్ లాభాలు పంచింది. గత ఏడాది డిసెంబరు 31న ఢిల్లీలో కిలో వెండి ధర రూ.89,700 వద్ద ట్రేడైంది.

అరోరియల్టీ చేతికి తాజ్ బంజారా

డీల్ విలువ రూ.315 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక అరబిందో గ్రూప్ రియల్టీ కంపెనీ అరో రియల్టీ, హైదరాబాద్‌లో మరో విలువైన స్థిరాస్తిని కొనుగోలు చేసింది. హైదరాబాద్ బంజారా హిల్స్‌లోని తాజ్ బంజారా స్టార్ హోటల్‌ను రూ.315 కోట్లకు దక్కించు కుంది. మొత్తం 16,645 చదరపు గజాల్లో 1.2 లక్షల చదరపు అడుగుల బిల్టప్ ఏరియాలో ఈ స్టార్ హోటల్ ఉంది. జీహెచ్ఎంసీకి పన్నులు చెల్లించకపోవడంతో కొద్ది కాలంగా ఈ స్టార్ హోటల్ మూతపడి ఉంది. అరో రియల్టీ తాజ్ బంజారా హోటల్‌ను రినొవేట్ చేసి స్టార్ హోటల్‌గా కొనసాగిస్తుందా లేక రియల్టీ వెంచర్‌గా మారుస్తుందా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు.

పెరగనున్న మొబైల్ ఛార్జీలు!

న్యూఢిల్లీ: కొత్త సంవత్సరం మొబైల్ టెలికం సేవల ఛార్జీలు మరింత ప్రియం కానున్నాయి. వొడాఫోన్ ఐడియా, ఎయిర్‌టెల్ ఇప్పటికే ప్రీపెయిడ్ ప్లాన్ల ధరలు పెంచేశాయి. వొడాఫోన్ ఐడియా ఏడాది ప్రీపెయిడ్ ప్లాన్ ధరను రూ.1,999 నుంచి 12%, 84 రోజులు చెల్లుబాటయ్యే ప్లాన్ ధరను ఏడు శాతం పెంచింది. ఎయిర్‌టెల్ కూడా రూ.189 ప్రీ పెయిడ్ ప్లాన్ ధరను రూ.10 పెంచింది. ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్ మాత్రం ధరలు పెంచకుండా, ప్లాన్ చెల్లుబాటయ్యే రోజులను తగ్గించింది. రిలయన్స్ జియో వచ్చే ఏడాది ప్రారంభం నుంచి అదనపు వడ్డింపులు చేస్తుందని భావిస్తున్నారు.

కోస్టల్ క్లౌడ్‌ను కొనుగోలు చేసిన టీసీఎస్

ముంబై: అమెరికాకు చెందిన కోస్టల్ క్లౌడ్‌ను 70 కోట్ల డాలర్లకు (సుమారు రూ.6,300 కోట్లు) కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు టీసీఎస్ బుధవారం ప్రకటించింది. పూర్తిగా నగదు రూపంలో జరగనున్న ఈ డీల్ ద్వారా టీసీఎస్ ప్రపంచంలోని టాప్-5 సేల్స్‌ఫోర్స్ అడ్వైజరీ అండ్ కన్సల్టింగ్ కంపెనీగా అవతరించనుంది.

2030 నాటికి అమెజాన్ ఇండియా రూ.3.15 లక్షల కోట్ల పెట్టుబడులు

10 లక్షల ఉద్యోగాల కల్పనకు దోహదం



న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారత్‌లో అమెరికన్ టెక్నాలజీ దిగ్గజ కంపెనీలు పోటాపోటీగా పెట్టుబడులు గుమ్మరిస్తున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్ ఇప్పటికే భారీ పెట్టుబడులను ప్రకటించగా.. తాజాగా అమెజాన్ కూడా వీటి సరసన చేరింది. భారత మార్కెట్లో క్విక్ కామర్స్, క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ (ఏఐ) వ్యాపారాల విస్తరణ కోసం వచ్చే ఐదేళ్లలో మరో 3,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.15 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు అమెజాన్ బుధవారం ప్రకటించింది.

వచ్చే ఐదేళ్లలో 8,000 కోట్ల డాలర్లకు ఎగుమతులు: ఈ పెట్టుబడులు వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగాల కల్పనకు దోహదపడగలవని ఢిల్లీలో నిర్వహించిన సంభవ్ సమ్మిట్‌లో పేర్కొంది. భారత్ నుంచి కంపెనీ ఎగుమతులను ప్రస్తుత 2,000 కోట్ల డాలర్ల స్థాయి నుంచి 8,000 కోట్ల డాలర్లకు పెంచేందుకు, 15 లక్షల మంది చిన్న వ్యాపారులు, కోట్లాది దుకాణాలకు ఏఐ ప్రయోజనాలు అందించేందుకు, 40 లక్షల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ శిక్షణ అందించేందుకు ఈ పెట్టుబడులు ఉపయోగపడనున్నాయంటోంది.

ఇప్పటికే 4,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు : భారత మార్కెట్లో అమెజాన్ 2010 నుంచి ఇప్పటి వరకు 4,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టింది. 2023లో 2,600 కోట్ల డాలర్ల పెట్టుబడులను ప్రకటించింది. కీస్టోన్ రిపోర్టు ప్రకారం.. భారత్‌లో అమెజానే అతిపెద్ద విదేశీ పెట్టుబడిదారు అని కంపెనీ వర్ధమాన మార్కెట్ల అధిపతి అమిత్ అగర్వాల్ అన్నారు.

దిగ్గజ త్రయం ఇన్వెస్ట్‌మెంట్లు 6,750 కోట్ల డాలర్లు

అమెజాన్‌తోపాటు మైక్రోసాఫ్ట్, గూగుల్ ప్రకటించిన మొత్తం పెట్టుబడులు 6,750 కోట్ల డాలర్లకు చేరాయి. మైక్రోసాఫ్ట్ మంగళవారం 1,750 కోట్ల డాలర్లు (రూ.1.58 లక్షల కోట్లు), విశాఖపట్నంలో ఒక గిగావాట్ సామర్థ్యంతో ప్రపంచ స్థాయి ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు కోసం 1,500 కోట్ల డాలర్లు (రూ.87,520 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు గూగుల్ ఈ అక్టోబరు 14న ప్రకటించింది. అమెరికా వెలుపల గూగుల్‌కు ఇదే అతిపెద్ద పెట్టుబడి.

ఏఐ రేసులో వినియోగ దేశాలే విజేతలు

మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల



న్యూఢిల్లీ: ప్రపంచ కృత్రిమ మేధ (ఏఐ) రేసులో సాంకేతికతను సృష్టించే దేశాల కంటే దాని వినియోగంలో ముందుండే దేశాలే విజేతలవుతాయని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అన్నారు. "ఆధునిక టెక్నాలజీని ఆవిష్కరించిన దేశాలు, కంపెనీలు, సమాజాలకు బదులు దాన్ని వేగంగా స్వీకరించి తరువాత తరం ఆవిష్కరణలు చేపట్టిన దేశాలే విజయం సాధించాయని గత సాంకేతికత విప్లవాలను అధ్యయనం చేసిన వారు గుర్తించారు" అని నీతి ఆయోగ్‌కు చెందిన దేవయానీ ఘోష్‌తో జరిగిన ఫైర్‌సైడ్ చాట్‌లో పేర్కొన్నారు. భారత్ కీలకమైన దశలో ఉందని.. ఏఐ టెక్నాలజీ వేగవంత వినియోగం ప్రజలతో పాటు సంస్థలకు గణనీయ ఫలితాలు అందించగలదన్నారు. వచ్చే ఐదేళ్లలో భారత్ 5.75 కోట్ల డెవలపర్లతో ప్రపంచంలో అతిపెద్ద డెవలపర్ కమ్యూనిటీగా అవతరించనుందని నాదెళ్ల అన్నారు. వచ్చే ఏడాది ప్రథమార్థం చివరికల్లా హైదరాబాద్‌లోనూ క్లౌడ్ రీజియన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా కేంద్ర కార్మిక శాఖ బుధవారం మైక్రోసాఫ్ట్‌లో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

ఊబకాయానికి సిప్లా ఔషధం

న్యూఢిల్లీ: దేశంలో పలువురి వేధిస్తున్న ఊబకాయం, టైప్ 2 మధుమేహ మెల్లిటస్ వ్యాధులకు ఔషధాన్ని విడుదల చేసినట్టు సిప్లా ప్రకటించింది. యుర్‌పీక్ (టిర్జెపెటైడ్) పేరిట విడుదల చేసిన ఈ ఔషధాన్ని వారానికి ఒకసారి ఇంజెక్షన్ రూపంలో తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ఎలీ లిల్లీకి చెందిన ఈ ఔషధానికి డీజీసీఐ అనుమతి లభించడంతో దీన్ని ప్రచారం చేసి, పంపిణీ చేసే హక్కులు తాము పొందినట్టు తెలియచేసింది.

రూ.8 లక్షల కోట్లు ఆవిరి

మార్కెట్లో ఆగని కరెక్షన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో కరెక్షన్ కొనసాగుతోంది. బుధవారం నాడు కూడా కీలక సూచీలు నేల చూపులు చూశాయి. అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ 275.01 పాయింట్ల నష్టంతో 84,391.27 వద్ద ముగియగా నిఫ్టీ 81.65 పాయింట్ల నష్టంతో 25,758 వద్ద ముగిసింది. గత నెల 11 తర్వాత సెన్సెక్స్, నిఫ్టీ ఇంత కనిష్ఠ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. ఈ మూడు రోజుల కరెక్షన్‌లో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ దాదాపు రూ.8 లక్షల కోట్లు తుడిచి పెట్టుకుపోయింది. ఎడతెగని ఎఫ్‌పీఐ అమ్మకాలు, డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం, భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంపై కొనసాగుతున్న అనిశ్చితి ప్రస్తుత కరెక్షన్‌కు కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవడం సైతం దేశీయ మార్కెట్‌లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. వడ్డీరేట్లపై బుధవారం రాత్రి వెలువడే అమెరికన్ ఫెడ్ నిర్ణయం, భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంపై వెలువడే అధికారిక ప్రకటన వచ్చే కొద్ది రోజుల్లో మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ సంస్థ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

వచ్చే ఏడాది నిఫ్టీ టార్గెట్ 29,120 పాయింట్లు: కోటక్

ప్రస్తుతం ఆటుపోట్లు ఎదుర్కొంటున్నా వచ్చే ఏడాది మార్కెట్ మదుపరులకు మంచి లాభాలే పంచుతుందని ప్రముఖ బ్రోకరేజి సంస్థ కోటక్ సెక్యూరిటీస్ తెలిపింది. నిఫ్టీ కూడా వచ్చే ఏడాది చివరికల్లా 29,120 పాయింట్లకు చేరే అవకాశం ఉందని ఆ సంస్థ ఎండీ, సీఈఓ శ్రీపాల్ షా చెప్పారు. కంపెనీల ఆదాయాలు 17% వరకు పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదం చేయనుందన్నారు. భారత స్టాక్ మార్కెట్‌లో గాలి బుడగలు ఏర్పడుతున్నాయన్న వార్తలను షా తోసిపుచ్చారు. ఎఫ్‌పీఐలు కూడా వచ్చే ఏడాది కొనుగోళ్లకు దిగే అవకాశం ఉందన్నారు.

బిజినెస్

manepally Jewellers Pvt. Ltd. trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP Ph: 99120 10888

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,310 ▲	1,19,450 ▲	2,07,000 ▲
విజయవాడ	1,32,000 ▲	1,23,000 ▲	1,89,000 ▲
విశాఖపట్నం	1,31,860 ▼	1,19,250 ▼	2,07,000 ▲
రాజమండ్రి	1,30,310 ▲	1,15,450 ▼	1,82,000 ▼
ప్రొద్దుటూరు	1,27,800 ▲	1,17,580 ▲	1,83,000 ▲
ముంబై	1,27,790 ▼	1,17,050 ▼	1,85,490 ▲

ఈ ఏడాది వృద్ధి 7.2%: ఏడీబీ

న్యూఢిల్లీ: ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) కూడా భారత జీడీపీ వృద్ధిరేటు అంచనాలను భారీగా పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృద్ధిరేటు 6.5% ఉండొచ్చునంటూ గతంలో చేసిన అంచనాలను ఇప్పుడు 7.2 శాతానికి పెంచింది. జోరు మీద ఉన్న దేశీయ వినియోగం, ఇటీవలి జీఎస్టీ రేట్ల తగ్గింపు జీడీపీ వృద్ధిరేటును పెంచబోతున్నట్టు పేర్కొంది. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరానికి వృద్ధిరేటు అంచనాలను మాత్రం 6.5% వద్దే కొనసాగించింది. భారత వృద్ధిరేటు ఊపందుకోవడం తో ఈ సంవత్సరం ఆసియా దేశాల సగటు వృద్ధిరేటు అంచనాలను సైతం ఏడీబీ 4.8% నుంచి 5.1 శాతానికి పెంచింది.

ఏడాది లోగా ఎస్‌బీఐ ఎంఎఫ్ ఐపీఓ

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఐపీఓ ఏడాది లోగా ఉంటుందని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. ఇందుకోసం మర్చంట్ బ్యాంకర్లు, ఇతర సర్వీస్ ప్రొవైడర్ల ఎంపిక ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎస్‌బీఐ ఎఫ్ఎంఎల్) పేరుతో ఎస్‌బీఐ, మ్యూచువల్ ఫండ్స్ బిజినెస్‌లో ఉంది. ఈ జయింట్ వెంచర్ కంపెనీ ఈక్విటీలో ఎస్‌బీఐకి 61.98%, ఫ్రాన్స్ కంపెనీ అముండికి సంస్థకు 36.40% వాటాలున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ



హైదరాబాద్	651	విజయవాడ	670
వరంగల్	653	గోదావరి	650
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	119	విజయవాడ	120
వరంగల్	119	గుంటూరు	125
కరీంనగర్	119	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	119	చిత్తూరు	127
కర్నూలు	119	నెల్లూరు	132
విశాఖపట్నం	121	అనంతపురం	132
గోదావరి	120		

ఐడీపీఎల్ భూములు కృష్ణార్పణం

కృష్ణారావు అవినీతిని బయటపెడతా

» నాపై వ్యక్తిగత ఆరోపణలు ఆయనలోని ఫ్రస్ట్రేషన్‌కు నిదర్శనం

» ఆరోపణలకు ఆధారాలతో సమాధానం ఇస్తా: కవిత



బోయినపల్లి/యూసుఫ్‌గూడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తనపై చేసిన విమర్శలకు ఆధారాలతో సహా సమాధానం చెప్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తనపై వ్యక్తిగత విమర్శలు చేయటం ద్వారా కృష్ణారావు ఆయనలోని ఫ్రస్ట్రేషన్‌ను బయటపెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. రెండు రోజుల్లో విలేకరుల సమావేశం పెట్టి, ఆయన చేసిన ప్రతి ఆరోపణకు డాక్యుమెంట్లతో సహా వివరాలు వెల్లడిస్తానని చెప్పారు. కూకట్‌పల్లిలో 15 ఏళ్లుగా ఉన్న సమస్యలనే తాను ప్రస్తావించానని తెలిపారు. కృష్ణారావు మాటలకు తానేమీ బాధపడటం లేదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. జాగృతి జనం బాటలో భాగంగా కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోయినపల్లి రామన్నకుంట చెరువు, బోయినపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. అనంతరం మనోవికాస్‌నగర్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిసేబిలిటీస్ (ఎన్‌ఐఈపీఐడీ)ను సందర్శించి దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. కృష్ణారావు చేసిన వ్యక్తిగత ఆరోపణలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాని చెప్పారు. త్వరలో ఆయన అవినీతి పనులను బయటపెడతానని ప్రకటించారు. ఇటు యూసుఫ్‌గూడలోనూ పర్యటించారు. అక్కడ ఆమె మాట్లాడుతూ.. 'కృష్ణారావు మానసిక ఒత్తిడిలో ఉన్నారు. ఆడాల్సిన టెస్టులు ఇంకా ఉన్నాయి' అని అన్నారు.

టెన్త్ పరీక్షల మధ్య విరామం విద్యార్థుల ప్రయోజనాలకే : నవీన్ నికోలస్

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్‌పై ఉపాధ్యాయ సంఘాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలపై పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ బుధవారం స్పష్టత ఇచ్చారు. ఎలాంటి విరామం లేకుండా పరీక్షల నిర్వహణతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి ఉందన్నారు. పరీక్షకు పరీక్షకు మధ్య విరామం ఇస్తే సిలబస్‌ను విద్యార్థులు రివిజన్ చేసుకునే సమయం లభిస్తుందన్నారు. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా చూడాలన్న ఏకైక లక్ష్యంతోనే ప్రభుత్వం షెడ్యూల్‌లో మార్పు చేసిందని ఆయన స్పష్టం చేశారు. ఈసారి టెన్త్ పరీక్షల నిర్వహణకు నెలకు పైగా సమయాన్ని కేటాయించారు. ఇది విద్యార్థులపై మానసిక ఒత్తిడిని పెంచుతుందని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు నవీన్ నికోలస్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వగా.. ఆయన స్పష్టత ఇచ్చారు.

'100 వారాంతపు అద్భుతాల తెలంగాణ' పోటీలు

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రచారానికి నోచుకోని పర్యాటక కేంద్రాలను గుర్తించడం కోసం పర్యాటక శాఖ '100 వారాంతపు అద్భుతాల తెలంగాణ' పేరిట పోటీలు నిర్వహిస్తోంది. వారాంతపు సెలవు దినాల్లో ఔత్సాహికులు తప్పనిసరిగా ఆయా పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రచారం కల్పించడానికి సన్నాహాలు చేస్తోంది. ప్రకృతి, వన్యప్రాణులు, సంస్కృతి, వారసత్వం, ప్రత్యేక వంటలు, నీటి వనరులు, వ్యవసాయ, గ్రామీణ బసలు, ఆధ్యాత్మిక ప్రదేశాలతో సహా విస్తృత శ్రేణి ఇతివృత్తాలను అన్వేషించేవారిని ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఎంట్రీలో వారాంతపు విహారాలకు అనువైన ప్రత్యేక ప్రదేశాలకు సంబంధించిన ఫొటోలు, రవాణా, గూగుల్ మ్యాప్ లింక్, బడ్జెట్ తదితర అంశాలకు సంబంధించి 100 పదాలతో వివరించాలని అధికారులు సూచించారు. జనవరి 5లోగా ఎంట్రీలు పంపాలన్నారు. ప్రథమ బహుమతిగా రూ.50 వేలు అందించనున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో 902 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. తర్వాత కాలక్రమంలో ఆ పరిశ్రమ మూతపడింది. నగరం విస్తరించే క్రమంలో.. ఐడీపీఎల్ భూముల విలువ అమాంతం పెరిగిపోయింది! దీంతో ఆ భూములపై ఎమ్మెల్యే కన్ను పడిందని.. ఆయనకు మరికొందరు బడాబాబులు, చోటామోటా నేతలు కూడా తోడై.. ఎవరికి దొరికిన భూమిని వారు కబ్జా చేసి నకిలీ పత్రాలతో అమ్మేసినట్టు తెలుస్తోంది. ఇలా ఇప్పటికే 150 ఎకరాలు కబ్జాకు గురై చేతులు మారినట్టు సమాచారం! వాటి విలువ దాదాపు రూ.4000 కోట్ల దాకా ఉంటుందని అంచనా. ఈ దందాలో ఐడీపీఎల్‌కు చెందిన కొంత మంది ఉన్నతోద్యోగుల పాత్ర కూడా ఉందని సమాచారం. పైకి ఆ భూముల్ని కాపాడుతున్నట్లు నటిస్తూ.. లోపల మాత్రం కబ్జాదారులతో లోపాయకారీ ఒప్పందాలు చేసుకుని వారు కూడా లాభపడుతున్నట్టు తెలిసింది. ఈ కబ్జాలు, విక్రయాల గురించి తెలిసినా.. ఆ భూములను కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం స్పందించకపోవడం, పరిశ్రమను మూసివేసిన కేంద్రం.. భూములను కాపాడుకునే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.



ఐడీపీఎల్‌లో నిషేధిత భూములంటూ ఏర్పాటు చేసిన బోర్డు

ఆనవాళ్లు చెరిపేస్తూ..

ఐడీపీఎల్ భూములను కబ్జా చేస్తున్నవారు.. ఆ భూముల్లో కొత్తగా రోడ్లు వేయించడం, డ్రైనేజీలు నిర్మించడం వంటి పనులు చేస్తున్నారు. అక్కడ అసలు పాత ఆనవాళ్లేవీ కనపడకుండా చెరిపేసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో వారు.. రైల్వే శాఖ నిర్మించిన ట్రాక్‌ను సైతం లేకుండా చేయడం గమనార్హం. పరిశ్రమలో తయారు చేసిన ఔషధాలను ఇతర ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో సనత్‌నగర్ రైల్వే స్టేషన్ నుంచి ఐడీపీఎల్ పరిశ్రమ వరకు రైల్వే శాఖ ఒక ట్రాక్ వేసింది. కానీ.. ఇప్పుడు అక్కడ నివాస గృహాలు తప్ప ట్రాక్ ఆనవాళ్లే లేవు. ఇటీవల గూడ్స్ బోగీల పార్కింగ్‌కు ఐడీపీఎల్ ట్రాక్‌ను ప్రత్యామ్నాయంగా వినియోగించుకోవాలని భావించి పరిశీలనకు వచ్చిన రైల్వే శాఖ అధికారులు.. అక్కడ అసలు ట్రాకే కనిపించక బిత్తరపోయారు. ప్రస్తుతం ఆ ట్రాక్ ఉన్న ప్రాంతంలో ఓ కాలనీ ఏర్పడింది. ట్రాక్ మీద సీసీరోడ్లు వచ్చేశాయి. అక్కడ సుమారు 80 ఎకరాల దాకా భూమి అన్యాక్రాంతం అయి ఉంటుందని ఐడీపీఎల్ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఐడీపీఎల్ భూములను.. 2019 నుంచి ఎమ్మెల్యేనే దగ్గరుండి కబ్జా చేసి, అమ్మకానికి పెట్టారని ఉద్యోగులు చెబుతున్నారు. అడ్డుకునేందుకు వెళితే.. టిప్పర్‌తో తొక్కి చంపించేస్తానంటూ ఆయన హెచ్చరించారని ఆరోపిస్తున్నారు. అలాగే.. బాలానగర్ డిమార్ట్ వెనుక సబ్‌స్టేషన్‌ను ఆనుకునే ఐడీపీఎల్ భూమి ఉంది. అక్కడ 20 ఎకరాలను కబ్జా చేసి రియల్టర్లకు కట్టబెట్టినట్టు సమాచారం. ఐడీపీఎల్ భూముల కబ్జాపై కొందరు ఉద్యోగులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. సదరు ఎమ్మెల్యే తన బినామీలతో ఆ ఉద్యోగులపైనే తిరిగి ఫిర్యాదులు చేయించి.. వేధింపులకు పాల్పడినట్టు చెబుతున్నారు.

పేదల జోలికి వస్తే ఊరుకోం



ఇంద్రా నగర్ భూములు వారివే అయితే ఐడీపీఎల్ వాళ్లను తీసుకోమనండి. ఆ భూముల్లో 70 ఏళ్ల నుంచి గుడిసెలున్నాయి. ఇళ్లు కట్టాం. ఇయాల పుట్టింది కాదు. రేవంత్ ఎంపీగా ఉన్నప్పుడు ఎంపీ నిధుల నుంచి రూ.కోటి ఇచ్చారు. నేనూ రూ.3 కోట్లు జీహెచ్ఎంసీ నిధులు తెచ్చి రోడ్లు వేయించా. దాన్ని ఆక్రమణ అనరు. పేదల గురించి నేను కొట్లాడతా. భూములు ఆక్రమిస్తే.. ఆక్రమించిన వారిపైన ఐడీపీఎల్ వాళ్లను కొట్లాడమనండి. ఇంద్రా నగర్‌లో 1600 గుడిసెలున్నాయి. అది వారి సొంత భూమి. ఆ భూములు ఐడీపీఎల్‌వి కావు. పరిశ్రమకు చెందిన 16 ఎకరాల కబ్జా మీద నేను కూడా ఫిర్యాదు చేశా. అది ఐడీపీఎల్ భూమి అని గత ప్రభుత్వంలో, ఈ ప్రభుత్వంలో కూడా ఫిర్యాదు చేశా. సర్వే నంబరు 20, 21, 22 కూకట్‌పల్లిలో ఓవర్ ల్యాపింగ్ భూమి.. కవిత భర్త పేరిట ఉందని నిన్న నేను చెప్పా. ఆమె భర్త ఫొటో కూడా మీడియాకు చూపించా. చెప్పింది ఆ భూమి గురించే. ఐడీపీఎల్ పరిశ్రమ వాళ్లు సర్వే అడిగితే దగ్గరుండి చేయిస్తా కదా. ఇంద్రా నగర్ ప్రైవేటు భూమా? పరిశ్రమదా? నవాబుల దా? తేల్చమని నేనే అడిగా. ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి ఉంటే వారిని కొట్లాడమనండి.. నేను కూడా వచ్చి నిలబడతా.

- మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే

ఎన్ని లేఖలు రాసినా..

ఐడీపీఎల్ భూములను కాపాడాలని కోరుతూ ఫిర్యాదులు అందినా అధికారులు స్పందించలేదు.

- కబ్జాదారులు ప్రైవేటు సర్వేయర్లతో కలిసి భూములు పంచుకుంటున్నారని తెలుపుతూ 2017జూన్ 3న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- ఐడీపీఎల్ భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుధాన్షు పంత్ 2017 అక్టోబరు 23న అప్పటి కలెక్టర్ ఎంవీ రెడ్డికి లేఖ రాశారు.
- రూ.100 కోట్ల భూమి ఆక్రమణకు గురైందని పేర్కొంటూ ఐడీపీఎల్ అధికారులు 2018 మే 15న పోలీసు కమిషనర్‌కు లేఖ రాశారు. మరో 14 ఎకరాలు కబ్జా చేశారని తెలుపుతూ ఐడీపీఎల్ ఉద్యోగులు 2018 జూలై 7న కలెక్టర్‌కు లేఖ రాశారు. ఆక్రమణల నుంచి సంస్థ భూములను కాపాడాలని ఐడీపీఎల్ ప్లాంట్ ఇన్‌చార్జిగా ఉన్న కేఎస్ఎన్ రాజు ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్, డీజీపీకి 2018 జూలై 9న లేఖలు రాశారు.
- కూకట్‌పల్లి సర్వే నంబరు 376లో ఉన్న భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమి అని.. తహసీల్దార్ తప్పు నివేదిక ఇచ్చారంటూ 2020 జనవరి 24న అప్పటి ఆర్డీవో కలెక్టర్‌కు లేఖ రాశారు.
- ఐడీపీఎల్ భూములను కాపాడాలని ఆ సంస్థ అధికారులు మేడ్చల్ కలెక్టర్‌కు 2021 సెప్టెంబరు 13న లేఖ రాశారు.
- కూకట్‌పల్లి సర్వే నంబరు 376లో 16 ఎకరాలను ఆక్రమించుకున్నారని తెలుపుతూ ఐడీపీఎల్ ఉద్యోగులు 2021 డిసెంబరు 16న బాలానగర్ సీఐకి లేఖ రాశారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరారు. 2021 డిసెంబరు 20న ఇవే అంశాలతో జిల్లా కలెక్టర్‌కు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కూడా లేఖ రాశారు.
- ఐడీపీఎల్‌కు చెందిన 4 ఎకరాల్లో లే-అవుట్ వేసి రోడ్లు నిర్మించారని..దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ 2022 ఫిబ్రవరి 14న ఉద్యోగులు కలెక్టర్‌కు లేఖ రాశారు.
- సర్వేనంబరు 376లో నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతులు లేవని.. ఆర్టీఐ కింద అడిగిన ఓ ప్రశ్నకు అధికారులు సమాధానమిచ్చారు.

...ఇలా ఎన్ని లేఖలు రాసినా ఎలాంటి స్పందనా లేదు. పోలీసులు సైతం కబ్జాదారులకే వంత పాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓవర్ ల్యాప్ పేరుతో ఐడీపీఎల్ భూములు అన్యాక్రాంతం చేస్తున్నారని పరిశ్రమ ఉద్యోగులు.. పేదల భూములను పరిశ్రమ భూములుగా చూపుతూ కేసులు పెడుతున్నారని ప్రజాప్రతినిధులు వాదిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం సర్వే చేయించాలని, అన్యాక్రాంతం అవుతున్న భూములను కాపాడాలని ఉద్యోగులు కోరుతున్నారు.

వివేకా హత్య కేసులో మరింత దర్యాప్తునకు ఓకే!

» పాక్షిక విచారణకు అనుమతించిన నాంపల్లి సీబీఐ కోర్టు.. నెలలో పూర్తిచేయాలని నిర్దేశం

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో మరింత లోతైన దర్యాప్తు చేసేందుకు సీబీఐ కోర్టు పాక్షికంగా అనుమతించింది. ఈ కేసులోని అసలు సూత్రధారులు తప్పించుకోకుండా ఉండాలంటే మరోసారి సమగ్ర దర్యాప్తు చేయాలని గత నెల 21వ తేదీన నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టులో వివేక కుమార్తె నర్రా సునీతారెడ్డి పిటిషన్ వేయడం తెలిసిందే. దీనిపై విచారించిన న్యాయాధికారి టి.రఘురాం కొన్ని షరతులతో దర్యాప్తు చేసేందుకు అనుమతి ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న సునీల్ యాదవ్, అతడి సోదరుడు కిరణ్ యాదవ్‌తో వైఎస్ ప్రకాశ్‌రెడ్డి, వైసీపీ యువజన విభాగంలో కీలకంగా పని చేసిన ప్రకాశ్‌రెడ్డి మనవడు అర్జున్‌రెడ్డి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, మెసేజ్‌ల డేటా ఆధారంగా నెలలోపు విచారణ చేయాలని ఆదేశించింది. తన తండ్రి హత్య కేసులో లోతైన దర్యాప్తు చేయాలని సునీతారెడ్డి వేసిన పిటిషన్‌కు మద్దతుగా సునీల్‌యాదవ్ కౌంటర్ దాఖలు చేయడం తెలిసిందే. పలు అంశాలపై సీబీఐ దర్యాప్తు అసమగ్రంగా ఉందని నిందితుల్లోనే కొందరు ప్రస్తావించడం, కోర్టు ఆదేశిస్తే దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీబీఐ సంసిద్ధత వ్యక్తం చేయడం, చట్టపరంగా దర్యాప్తు కొనసాగించడానికి అడ్డంకులు లేకపోవడంతో.. పాక్షిక విచారణకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. కాల్ రికార్డ్స్ డేటా ఆధారంగా దర్యాప్తు జరపాలని ఆదేశించింది.

కృష్ణాపై కొత్త ప్రాజెక్టులను అడ్డుకోండి

» తెలంగాణ డీపీఆర్‌లను నిలువరించండి..

» కేంద్రం, సీడబ్ల్యూసీ, కృష్ణా బోర్డులకు ఏపీ లేఖ

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లో 16 ప్రాజెక్టులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్‌ల తయారీకి ఆదేశించింది, తక్షణమే ఆ ప్రక్రియను అడ్డుకోవాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. కృష్ణా బేసిన్‌లో ఆయా ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు/సామర్థ్యం పెంచుతూ తెలంగాణ సర్కారు జీవో 34ను జారీ చేసిందని తెలిపింది. వాటిని అడ్డుకోవాలంటూ కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ), కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)లకు ఏపీ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ లేఖ రాశారు. కృష్ణా జలాల కేటాయింపుపై కృష్ణా ట్రైబ్యునల్-2లో విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఈ జీవో జారీ చేయడం అనుచితమని తెలిపారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్-84(3)(2), సెక్షన్-85(8)(డి)తోపాటు 11వ షెడ్యూల్‌లోని పేరా-7 ప్రకారం కృష్ణా బేసిన్‌లో ఏ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలన్నా.. విధిగా కృష్ణా బోర్డు ప్రాజెక్టు డీపీఆర్‌ను మదింపు చేయాల్సి ఉంటుందని, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ అనుమతుల తర్వాతే ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉంటుందని గుర్తు చేశారు. కృష్ణా నదిపై తెలంగాణ ప్రతిపాదించిన ప్రాజెక్టుల డీపీఆర్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిశీలించరాదని.. తక్షణమే ఆ ప్రాజెక్టులను అడ్డుకోవాలని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



మనసుకు హత్తుకునేలా..

రోషన్, అనస్వర రాజన్ జంటగా ప్రదీప్ అద్వైతం తెరకెక్కిస్తున్న సినిమా 'ఛాంపియన్'. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ నెల 25న చిత్రం విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి రెండో పాట 'సల్లంగుండాలే'ను విడుదల చేశారు మేకర్స్. వివాహం చేసుకుని పుట్టినింటిని, సొంతూరును వదిలి వెళ్తున్నామని బాధపడే వధువుకు నచ్చజెప్పే సందర్భంలో వచ్చే ఈ పాట మనసుకు హత్తుకునేలా ఉంది. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను రితేశ్ జి రావు, మనీశా ఈరబత్తిని ఆలపించారు. మిక్కీ జే మేయర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వర రావు, సినిమాటోగ్రఫీ: ఆర్.మధీ.

అదిరిపోయే యాక్షన్ హంగామా



నందమూరి బాలకృష్ణ టైటిల్ రోల్‌లో బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'అఖండ 2: తాండవం' చిత్రం రిలీజ్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇది ఇప్పటికే సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచేసింది. 'అఖండ' అవతార్‌లో అదరగొట్టారు బాలకృష్ణ. ధర్మ రక్షకుడిగా ఆయన పోషించిన ఈ పాత్ర సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లేలా ఉంది. అద్భుతమైన పోరాట ఘట్టాలు, ఆకట్టుకునే విజువల్స్, గూస్‌బంప్స్ తెప్పించే నేపథ్య సంగీతంతో నిండిన ఈ టీజర్ ప్రస్తుతం అందర్నీ ఆకట్టుకుంటోంది. బాలకృష్ణ కుమార్తె తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట 14 రీల్స్ ప్లస్ బేనర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ శుక్రవారం విడుదల అవుతోంది.

టికెట్ ధరల పెంపు: 'అఖండ 2:తాండవం' విడుదల నేపథ్యంలో ఈ సినిమాకు టికెట్ ధరలను పెంచుతూ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి. ఈ రోజు సాయంత్రం ఎనిమిది గంటల నుంచి ప్రీమియర్ షోలను ప్రదర్శించుకునేలా అనుమతులు జారీ అయ్యాయి. ప్రీమియర్ షో బుకింగ్స్ నేడు ప్రారంభం కానున్నాయి.

తెలంగాణలో ఇలా..: సింగిల్ స్క్రీన్స్‌లో రూ. 50 (జీఎస్టీ అదనం), మల్టీప్లెక్సుల్లో రూ.100 (జీఎస్టీ అదనం) చొప్పున పెంచుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెల 12 నుంచి 14 వరకు ఈ ధరలు అమల్లో ఉంటాయి. ప్రీమియర్ షో టికెట్ ధరను రూ.600గా నిర్ణయించింది. ఈ టికెట్ ధరల ఆదాయంలో 20 శాతం మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌కు వెళ్లనుంది.

ఏపీలో..: సింగిల్ స్క్రీన్స్‌లో రూ.75 (జీఎస్టీ అదనం), మల్టీప్లెక్సుల్లో రూ.100 (జీఎస్టీ అదనం) చొప్పున ధరలు పెంపునకు అనుమతి ఇచ్చింది ప్రభుత్వం. ఈ నెల 12 నుంచి పది రోజుల పాటు ఈ ధరలు అమల్లో ఉండనున్నాయి. ప్రీమియర్ షోకు రూ. 600(జీఎస్టీ అదనం)గా టికెట్ ధర నిర్ణయించారు.

అఖండ 2 విడుదల తేదీ మార్పు చిన్న సినిమాలకు భారమే

● ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ కేఎల్ దామోదర ప్రసాద్



భారీ అంచనాలున్న 'అఖండ 2' చిత్రం విడుదల కొత్త తేదీ (డిసెంబర్ 12)కు మారడం చిన్న సినిమాలపై కచ్చితంగా ప్రభావం చూపుతుందని ప్రముఖ నిర్మాత, ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ కేఎల్ దామోదర ప్రసాద్ అభిప్రాయపడ్డారు. అఖండ కొత్త విడుదల తేదీ కారణంగా ఆ రోజున రావాల్సిన చిన్న సినిమాలు తమ షెడ్యూళ్లను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది మిగిలిన సినిమాలకు భారమేనని ఆయన బుధవారం జరిగిన 'ఈషా' చిత్రం ప్రెస్‌మీట్‌లో వ్యాఖ్యానించారు.

తేదీల గందరగోళం: అఖండ సినిమా ప్రభావం చిన్న సినిమాలపై పడిందని తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదనీ, ఆ తేదీన ఎన్ని చిన్న సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయో అందరికీ తెలిసిన విషయమేనని దామోదర్ ప్రసాద్ అన్నారు. 'అఖండ 2' ఈ నెల 12కు మారడం వల్ల మిగిలిన నిర్మాతలు తమ తేదీలను మార్చుకుంటున్నారు కదా అన్నారు. అయితే జరిగిన సంఘటన దురదృష్టకరమని, ఇండస్ట్రీలో ఇలాంటివి మామూలేనని ఆయన పేర్కొన్నారు. పరిస్థితులు మన చేతిలో లేనప్పుడు జరిగినదాన్ని సానుకూలంగా స్వీకరించి ముందుకెళ్లడమే మనం చేయగలిగిన పని అని దామోదర ప్రసాద్ అన్నారు. సినిమా చిన్నదైనా, పెద్దదైనా అంతిమంగా అది వ్యాపారమేనని చెప్పారు.

అన్‌ఆర్గనైజ్డ్ ఇండస్ట్రీ: సినిమా పరిశ్రమ ప్రాథమికంగా ఒక అన్‌ఆర్గనైజ్డ్ సెక్టార్ అని దామోదర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. చిన్న సినిమాలకు సేఫ్టీ ఉండాలని కోరుకుంటామనీ, పరిస్థితులను బట్టి మరో మార్గం చూసుకుంటామని అన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం ఫిల్మ్ ఛాంబర్‌లో చాలా మాట్లాడుకుంటామని, కానీ ఒక నెల తర్వాత మళ్లీ అంతా మామూలేనని ఆయన అన్నారు.

కుటుంబ కథా చిత్రంతో వస్తున్న వెంకీ



వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ఇటీవలె ప్రారంభమైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. 'ఆదర్శ కుటుంబం' అనే టైటిల్‌తో వస్తున్న ఈ సినిమాకు 'హౌస్ నెం47' (ఏకే 47) అనేది ఉపశీర్షిక. వెంకటేశ్ ఫస్ట్ లుక్ విడుదల చేసి రెగ్యులర్ షూటింగ్ మొదలైందని మేకర్స్ తెలిపారు. ఫ్యామిలీ మ్యాన్ లుక్‌లో క్లాస్‌గా కనిపించారు వెంకీ. ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే ఓ మంచి కుటుంబ కథా చిత్రంగా ఇది నిలిచిపోనుందని మేకర్స్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది వేసవిలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ బేనర్‌పై ఎస్ రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఇద్దరు కథానాయికలకు చోటు ఉందని సమాచారం. త్రిష, రుక్మిణీ వసంత్, నిధి అగర్వాల్ పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.





అబ్బురం... ఆశ్చర్యం

» గ్లోబల్ సమ్మిట్‌లో సందర్శకుల సందడి

రంగారెడ్డి అర్బన్, హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్శనకు విద్యార్థులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భారీగా తరలివచ్చారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్-బేగరికంచలో ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేసింది. 6 ఖండాలు, 44 దేశాలు, దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులతో ఈ ప్రాంగణంలో సందడి నెలకొంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన సమ్మిట్ ప్రాంగణాన్ని సాధారణ ప్రజలు సందర్శించేందుకు ప్రభుత్వం శనివారం వరకు అనుమతించింది. దీంతో సమ్మిట్ ప్రాంగణంలోకి బుధవారం జనం భారీగా తరలి వచ్చారు. ఎంపిక చేసిన విద్యాసంస్థల నుంచి విద్యార్థులను పెద్ద ఎత్తున ప్రత్యేక బస్సుల్లో తరలించారు. పలు ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు 2500 మంది, 2 వేల మంది ప్రజలు కూడా ఈ ప్రాంగణాన్ని సందర్శించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఏఐ రోబోలు, టచ్ కియోస్క్‌లు, త్రీడీ తెరలు చూసి సందర్శకులు మంత్రముగ్ధులయ్యారు. సమ్మిట్ జరిగే చోటకు వెళ్లేందుకు గురువారం నుంచి డిసెంబరు 13 శనివారం వరకు ఉచిత బస్సులు నడుపుతున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రాజశేఖర్ తెలిపారు. ఉచిత బస్సులు ఎంజీబీఎస్, జేబీఎస్, మియాపూర్, గచ్చిబౌలి, ఎల్బీనగర్, ఉప్పల్, శంషాబాద్ నుంచి ఉదయం 9, 10, 11, 12 గంటలకు ప్రాంగణానికి బయలుదేరతాయి. సాయంత్రం 4, 5, 6, 7 గంటలకు తిరుగుముఖం పడతాయి. ఇతర వివరాలకు ఈ నెంబరు 9959226160లో సంప్రదించవచ్చన్నారు.



గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలోని ఓ స్టాల్‌ను సందర్శిస్తున్న విద్యార్థినులు

తెలంగాణలో 10 నెలల్లో 1,40,947 రేషన్ కార్డుల రద్దు

» లోక్‌సభలో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో గత పది నెలల్లో 1,40,947 రేషన్ కార్డులు రద్దు అయ్యాయని కేంద్రం వెల్లడించింది. 2020 నుంచి పోల్చితే ఈ ఏడాదే అత్యధికంగా రేషన్ కార్డులు రద్దు చేసినట్లు స్పష్టం చేసింది. లోక్‌సభలో ఎంపీ ఆర్.రఘురామిరెడ్డి వేసిన ప్రశ్నకు కేంద్ర మంత్రి నిముబెన్ జయంతిభాయ్ లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. 2020లో 12,154 కార్డులు, 2022లో 4,988 కార్డులు, 2023లో 34,064 కార్డులు, 2024లో 3,424 కార్డులు, 2025లో (అక్టోబరు వరకు) 1,40,947 రేషన్ కార్డులను రద్దు చేసినట్లు కేంద్ర మంత్రి వివరించారు. నకిలీ కార్డుల ఏరివేత, అనర్హుల గుర్తింపు, కుటుంబ సభ్యుల మరణాలు, శాశ్వత వలసలు వంటి కారణాలతోనే ఈ కార్డులను రద్దు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం నివేదించిందని చెప్పారు. ఈ - కేవైసీ లేదా ఆధార్ ధ్రువీకరణ పూర్తి కాలేదనే కారణాలతో ఒక్క రేషన్ కార్డును కూడా రద్దు చేయలేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో మొత్తం 56,60,367 రేషన్ కార్డులు అమలులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. మరోపక్క, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 88,37,973 రేషన్ కార్డులు ఉండగా ఈ ఏడాది అక్టోబరు 7వ తేదీ నాటికి 50,681 కార్డులు రద్దయినట్లు పేర్కొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా గ్లోబల్ సమ్మిట్

» సీపీఐ నారాయణ



హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు చురుగ్గా పని చేసి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారని సీపీఐ జాతీయ నేత కె.నారాయణ ప్రశంసించారు. ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. గ్రామీణ అభివృద్ధికి, వ్యవసాయానికి, పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తూనే సమన్వయం చేసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. రెవెన్యూ శాఖ భూములకు అనుమతులు ఇచ్చే విషయంలో అక్రమాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆనాటికి లైఫ్ అదరహో!

(మొదటిపేజీ తరువాయి)

అందిస్తామని చెబుతోంది. ముఖ్యంగా అత్యంత ప్రతిభావంతులు, సంస్థలను ఆహ్వానించడం, హైదరాబాద్‌ను శక్తివంతమైన ద్వితీయ శ్రేణి నగరాలతో అనుసంధానించడం, ప్రజలు సౌకర్యవంతంగా నివసించడానికి అనువైన పచ్చదనాన్ని పెంపొందించడం కల్పించడం వంటి చర్యల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా ఈ నెల 9న 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించింది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మిస్తామని డాక్యుమెంట్‌లో ప్రకటించిన సంగతి తెలిసిందే. అదే సందర్భంలో ప్రజల తలసరి ఆదాయాన్ని ప్రస్తుతమున్న దాని కంటే 6.2 రెట్లు పెంచి రూ.24 లక్షలకు చేరుస్తామని ప్రకటించింది. ఇంత భారీ స్థాయిలో తలసరి ఆదాయం పెరిగితే ప్రజల కొనుగోలు శక్తి కూడా పెరుగుతుందని, తద్వారా అన్ని రకాల జీవన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఆ నేపథ్యంలోనే 2047 నాటికి తెలంగాణ ప్రజల జీవన విధానంలో భారీ మార్పులు సంభవించబోతున్నాయని స్పష్టం చేస్తోంది.

జీవన ప్రమాణాల పెరుగుదలకు తీసుకునే చర్యలు

ప్రతిభే పెట్టుబడి: దేశ, విదేశీ ప్రతిభావంతులు, సంస్థలను ఆకర్షించడానికి రాష్ట్రంలోని నగరాలను అత్యంత సురక్షితమైన, పచ్చదనంతో కూడిన, సాంస్కృతిక చలనశీలత్వం గల ప్రాంతాలుగా ప్రభుత్వం తీర్చిదిద్దనుంది. ఆవిష్కరణలకు హైదరాబాద్ ముఖద్వారంగా పనిచేయనుంది. ఇది పోటీతత్వంతో కూడిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వనుంది.

స్మార్ట్ పౌర సదుపాయాలు: ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలు, అవాంతరాలు లేని రవాణా సౌకర్యాలు కల్పించనుంది. స్మార్ట్ పౌర సదుపాయాలు కల్పిస్తూ, పచ్చదనాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురానుంది. హైదరాబాద్‌లాంటి జీవన ప్రమాణాలను రాష్ట్రంలోని ఇతర ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించనుంది.



డిజిటల్ గవర్నెన్స్‌తో..

ప్రజా సంక్షేమ ప్రాధమ్య నగరాలను అభివృద్ధి చేయనుంది. బాధ్యతాయుతమైన పంపిణీ వ్యవస్థ, స్పష్టమైన ప్రమాణాల అమలు, కచ్చితత్వ ఫలితాల ద్వారా డిజిటల్ గవర్నెన్స్ తీసుకురానుంది. సమర్థమైన రవాణా వ్యవస్థ, పచ్చదనాన్ని అభివృద్ధి చేయనుంది. విశ్వసనీయ ప్రభుత్వ సేవలు, అత్యంత భద్రత గల వీధులు, ఆహ్లాదకరమైన ఖాళీ స్థలాలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

నైట్ ఎకానమీ: పట్టణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆహార పదార్థాల విక్రయాలు, వినోదం వంటి వాటిని అనుమతించనుంది. తద్వారా కొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనుంది. పర్యాటకాన్ని పెంచనుంది.

ఒకేచోట సేవలు: రాష్ట్రంలో మిశ్రమ వినియోగ సమూహాల కాన్సెప్ట్‌ను అభివృద్ధి చేయనుంది. అంటే పలు రకాల సేవలు ఒకేచోట లభించేలా చర్యలు తీసుకోనుంది. తద్వారా వృత్తిదారులకు రవాణా సమయం తగ్గుతుంది. ఇది ఉత్పాదకత పెరుగుదల, సామాజిక ఐక్యత, ప్రజా సంక్షేమానికి దోహదపడుతుంది.

పచ్చదనం, సమ్మిళిత వృద్ధి: 'నెట్ జీరో' విజన్‌లో భాగంగా రాష్ట్రంలోని ప్రతి నగరాన్ని కర్బన ఉద్గారాల రహిత ప్రాంతంగా మార్చనుంది. సురక్షితమైన రవాణా సౌకర్యాలు, పచ్చదనాన్ని అందుబాటులోకి తెస్తూ క్లీన్ ఎనర్జీని, పునర్వినియోగ వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. ఈ విధానం ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది.

స్మార్ట్ అర్బన్ కారిడార్లు: సమగ్ర రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడం, వివిధ రకాల సేవలను మెరుగుపర్చడం, ఆర్థిక పరిస్థితులను పటిష్ఠపర్చడం ద్వారా వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం వంటి నగరాల్లో ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించనుంది.

అతివేగంతో కారు బోల్తా.. ముగ్గురి మృతి

» ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో దుర్ఘటన



మోహినొద్దీన్, మోహిన్, కీర్తి సాగర్(ఫైల్)

జైనథ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రగాయాలతో బయటపడ్డారు. మృతులను ఆదిలాబాద్‌లోని చిల్కూరి లక్ష్మీ నగర్, జైజవాన్ నగర్ వాసులుగా గుర్తించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని పోలీసులు తెలిపారు. స్థానికులు, జైనథ్ మండల ఎస్ఐ గౌతంపవార్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన షేక్ మోయినుద్దీన్(30), షేక్‌మోహిన్(29), కీర్తి సాగర్(28), కోటికర్ యోగేష్‌లు భవన నిర్మాణ పనుల కోసం మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న బేల మండలానికి కారులో వెళుతుంటారు. రోజు మాదిరిగానే మంగళవారం మేస్త్రీ పనులకు వెళ్లి.. పనులు ముగించుకుని స్వస్థలాలకు తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి జైనథ్ మండలం తర్నం జాతీయ రహదారి మూలమలుపు వద్ద బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో కారు డ్రైవర్ సహా ముగ్గురు మరణించగా, తీవ్రంగా గాయపడ్డ యోగేష్‌ను స్థానికులు ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

కామారెడ్డి జిల్లాలో ఆటో బోల్తా.. విద్యార్థి మృతి

జుక్కల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ నిండుప్రాణం బలైంది. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం సావర్గం గ్రామం వద్ద.. స్కూల్ విద్యార్థులతో వెళ్తున్న ఆటో బోల్తా పడగా, ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బుధవారం సావర్గం నుంచి కండెవల్లూరు ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులతో వెళుతున్న ఆటో.. డ్రైవర్ అజాగ్రత్తతో అదుపు తప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో మొత్తం 12 మంది విద్యార్థులు ప్రయాణిస్తుండగా.. పదో తరగతి చదువుతున్న ప్రణవ్(15) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు విద్యార్థులు శ్రీకాంత్, బాలాజీలకు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడంతోనే బోల్తా పడినట్లు స్థానికులు ఆరోపించారు.

కొనసాగుతోన్న చలి తీవ్రత

» కోహీర్‌లో 5.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. పలుచోట్ల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో బుధవారం ఉదయం 5.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదయ్యింది. రాష్ట్రంలోనే ఇది అత్యంత తక్కువ ఉష్ణోగ్రత. ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గిన్నెధరి, సిర్పూర్(యు) మండలాల్లో 6 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టి)లో 6.2 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా రెడ్డిపల్లిలో 6.6, వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 6.9, సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేటలో 7.4, ఆదిలాబాద్ జిల్లా సోనాలలో 7.6, బోరజ్, ఆదిలాబాద్ రూరల్‌లో 7.9, మెదక్ జిల్లా శివ్వంపేటలో 7.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భద్రాద్రి జిల్లాలోనూ చలి తీవ్రత పెరిగింది. జిల్లాలోని గుండాలలో బుధవారం 9.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఈ జిల్లా సగటు కనిష్ఠ ఉష్ణోగ్రత 12.6 డిగ్రీలుగా నమోదయ్యింది. భద్రాద్రి జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఇంత తక్కువగా నమోదవడం ఇదే తొలిసారి. ఖమ్మం జిల్లాలోనూ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. రాష్ట్ర వ్యాప్తంగా 25 జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర, పశ్చిమ తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో గురువారం చలి గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

65 ఎలక్ట్రిక్ బస్సులకు పచ్చజెండా

» హైదరాబాద్‌లో ప్రారంభించిన మంత్రి పొన్నం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో 373 కొత్త కాలనీలకు ఆర్టీసీ బస్సులను నడపనుండటంతో రింగ్ రోడ్డు వెలుపలున్న 7 లక్షల మందికి కొత్తగా ప్రజా రవాణా సౌకర్యం ఏర్పడనుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభించి రెండేళ్లయిన సందర్భంగా బుధవారం బస్ భవన్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 97 డిపోల్లో ఉన్న ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇటు సికింద్రాబాద్‌లోని రాణిగంజ్ డిపోలో 65 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మేయర్ విజయలక్ష్మిలతో కలిసి మంత్రి ప్రారంభించారు.

15 మంది నక్సల్స్ లొంగుబాటు

» మహారాష్ట్రలో 11 మంది.. ఛత్తీస్‌గఢ్‌లో నలుగురు

ములుగు/చర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం మహారాష్ట్రలో 11 మంది, ఛత్తీస్‌గఢ్‌లో నలుగురు నక్సల్స్ లొంగిపోయారు. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో డీజీపీ రస్మీ శుక్లా ఎదుట 11 మంది మావోయిస్టులు ఆయుధాలను అప్పగించి లొంగిపోయారు. వీరిపై 82 రూ.లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. 2022 నుంచి ఇప్పటివరకు మహారాష్ట్రలో 146 మంది లొంగిపోయారని డీజీపీ తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఇద్దరు మహిళా మావోయిస్టులు సహా నలుగురు లొంగిపోయారు. ఆ నలుగురిపై రూ.23 లక్షల రివార్డు ఉన్నట్లు కాంకేర్ ఎస్పీ ఐకే ఎలసెలా తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటివరకు 2,380 మంది మావోయిస్టులు లొంగిపోయారని వివరించారు.

ములుగులో ఇద్దరు మహిళా నక్సల్స్ కూడా..

ఇటు ములుగు జిల్లా పోలీసుల ఎదుట ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఇద్దరు మహిళా మావోయిస్టులు కూడా లొంగిపోయారు. సుక్మా జిల్లా జబ్బగుట్టకు చెందిన ఆకాశ్ (డీవీసీఎం) టీం సభ్యురాలు మడకం మల్లి, బీజాపూర్ జిల్లా జోజూరుకు చెందిన తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఒయం రామే లొంగిపోయినట్లు ఎస్పీ సుధీర రామ్నాథ్ కేకాన్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'పోరు కన్నా ఊరు మిన్న.. మన ఊరికి తిరిగి రండి' కార్యక్రమం ప్రభావంతో వీరు లొంగిపోయారన్నారు. వీరికి తక్షణ సాయంగా రూ.25 వేల చొప్పున అందించామని ఎస్పీ పేర్కొన్నారు.

ఫ్యూచర్ సిటీ అన్ని జోన్లలో పెట్టుబడులు

గ్లోబల్ సమ్మిట్‌తో పారిశ్రామికవేత్తల్లో పెరిగిన ఆసక్తి

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైంది. భారత్ ఫ్యూచర్ సిటీపై పారిశ్రామిక వేత్తలకు ఆసక్తి పెరిగింది. దాదాపు 30వేల ఎకరాల్లో అభివృద్ధి చేయనున్న భారత్ ఫ్యూచర్ సిటీలో పది రంగాల్లో పెట్టుబడులు సాధించడంపై ప్రభుత్వం ఈ సదస్సులో దృష్టి సారించింది. పది రంగాలను పది జోన్లుగా విభజించింది. ఇందులోని అన్ని జోన్లలో పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఎడ్యుకేషన్ జోన్‌లో ఆఫ్ క్యాంపస్ పెట్టేందుకు యూనివర్సిటీ ఆఫ్ లండన్ ముందుకొచ్చింది. స్పోర్ట్స్ హబ్ పెట్టుబడులకు దుబాయ్ స్పోర్ట్స్ సిటీ ఒప్పందం కుదుర్చుకుంది. ఫారెస్ట్ జోన్‌లో గుజరాత్ జామ్‌నగర్ తరహాలో వంతారా ఏర్పాటుకు రిలయన్స్ సిద్ధమైంది. మెడికల్ టూరిజం విభాగంలో అపోలో హాస్పిటల్స్, ఆతిథ్య రంగంలో స్టార్ హోటళ్ల నిర్మాణానికి నోవాటెల్, ఫర్నిచర్ పార్క్ జోన్‌లో మలేషియన్ కంపెనీ జేవీ భారత కంపెనీ బాంటియాతో కలిసి పెట్టుబడులు పెట్టనుంది. 100 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఏఐ సిటీలో ఏఐ యూనివర్సిటీ, మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌లో సెంబ్‌కార్ప్ ఇండస్ట్రియల్ పార్క్, టౌన్‌షిప్‌లో ట్రంప్ గ్రూప్, రిక్రియేషన్ జోన్‌లో ఫిల్మ్ స్టూడియో నిర్మాణానికి సల్మాన్ ఖాన్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. రెండు రోజుల సమ్మిట్‌తో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చెప్పడంలో విజయవంతమయ్యామని, పారిశ్రామిక వర్గాల్లో తెలంగాణపై ఆసక్తి పెరిగిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

రియల్ ఎస్టేట్‌కు కొత్త ఊపు

గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ దక్షిణ దిశలో రియల్ ఎస్టేట్ రంగానికి కూడా కొత్త ఊపు తెచ్చింది. ఫ్యూచర్ సిటీ పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ సంస్థలు వెంచర్లు వేస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలోని కడ్తాల్ సమీపంలో, మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు ప్రాంతంలో, శ్రీశైలం హైవే, నాగార్జున సాగర్ మార్గంలో ఇప్పటికే వేసిన లేఅవుట్లలో సైట్ విజిట్‌లు జోరందుకున్నాయి. ఫ్యూచర్ సిటీ ప్రాంతంలో భూములను కొనుగోలు చేయడంతో పాటు భారీ లేఅవుట్లను తీసుకొచ్చేందుకు రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది.

పంచాయతీ బరిలో ప్రవాసులు

» మాతృభూమిపై మమకారంతో విదేశాల్లో ఉద్యోగ, వ్యాపారాలు వదులుకొని వెళ్లి పోటీ

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

పలువురు ప్రవాసులు మాతృభూమిపై మమకారంతో విదేశాల్లోని తమ ఉద్యోగ, వ్యాపారాలను వదులుకొని స్వస్థలాలకు వెళ్లి పంచాయతీ ఎన్నికల్లో తలపడుతున్నారు. దుబాయిలో పనిచేసే రాజన్న సిరిసిల్లా జిల్లా చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస రెడ్డి తన ఉద్యోగానికి రాజీనామా చేసి స్వగ్రామానికి వెళ్లి.. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ సర్పంచ్‌గా గట్టి పోటీనిస్తున్నారు. సౌదీ అరేబియాలో చమురు రంగంలో ఉద్యోగాన్ని వదులుకొని స్వదేశానికి వెళ్లిన ఎనుగల లచ్చయ్య తన స్వగ్రామం జగిత్యాల జిల్లా భీమారం మండలం మోత్కురావుపేటలో సర్పంచ్ బరిలో ఉన్నారు. పొరుగున ఉన్న మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామ సర్పంచ్ పదవికి తోగరి రాజమణి పోటీ పడుతున్నారు. ఆమె భర్త లక్ష్మీపతి సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు సౌదీలో ఉద్యోగం వదులుకొని వెళ్లారు. అయితే ఆ పదవి మహిళలకు రిజర్వు కావడంతో తన భార్యను రంగంలోకి దింపారు. ఆర్మూర్ మండలం కొమనపల్లి గ్రామానికి చెందిన బండి రాజరాం కూడా పోటీకి ఆసక్తి కనబరిచినా ఈసారి అక్కడ సర్పంచ్ పదవి మహిళలకు రిజర్వు కావడంతో దుబాయిలోనే ఉండిపోయారు. రాజారాం గత పంచాయతీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమిపాలయ్యారు. ఖతర్‌లో పనిచేసిన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం సిరికొండ గ్రామానికి చెందిన పంచిత ధర్మరాజు యాదవ్ సర్పంచ్ పదవికి పోటీ పడుతున్నారు. అమెరికాలోని జార్జియాలో వ్యాపారం చేసుకొనే ఆర్మూర్ మండలం అంకపూర్ గ్రామానికి చెందిన గడ్డం రమేశ్ రెడ్డి పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేయగా ఓటరు జాబితాలో పేరు లేదని తిరస్కరించారు. ఇదే మండలం పచ్చలనడకుడ గ్రామానికి చెందిన కోల నర్సయ్య ఇజ్రాయెల్ నుంచి వెళ్లి పోటీ పడుతున్నారు. అమెరికాలో ఉద్యోగం వద్దనుకొని గ్రామ సేవ ముఖ్యమంటున్నారు మెదక్ జిల్లా చిన్నశంకరంపేటకు చెందిన కంజర్ల చంద్రశేఖర్! తమ పిల్లల వద్దకు విదేశాలకు వచ్చిన కొందరు కూడా ఎన్నికల కోసం స్వదేశానికి తిరిగి వెళ్తున్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి పాటుపడే యువకుల పక్షాన తాను పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నట్లు బహ్రెయిన్‌లో పనిచేసే సామాజిక సేవకుడు కోటగిరి నవీన్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కమ్మరపల్లి మండలం హాసకొత్తూరుకు చెందిన నవీన్ ఎన్నికల ప్రచారం చేసేందుకు స్వస్థలంలో గడుపుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ కింద రూ.1,685 కోట్ల సాయం

» రెండేళ్లలో 3.76 లక్షల మందికి లబ్ధి

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త రికార్డు నెలకొల్పిందని ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో) బుధవారం ప్రకటించింది. 2023 డిసెంబరు 7 నుంచి 2025 డిసెంబరు 5 మధ్య కాలంలో ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ కింద మొత్తం రూ. 1685.59 కోట్ల సాయం చేసినట్టు వెల్లడించింది. ఈ రెండేళ్ల వ్యవధిలో మొత్తం 3,76,373 మంది సీఎంఆర్ఎఫ్ కింద లబ్ధి పొందినట్లు పేర్కొంది. అందులో లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) ద్వారా 27,421 మంది, రీయింబర్స్‌మెంట్ ద్వారా 3,48,952 మంది లబ్ధి పొందినట్లు వెల్లడించింది. ఎల్‌వోసీలను నిమ్స్, ఎంఎన్‌జే, ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రులకు జారీ చేసినట్లు తెలిపింది. కాగా, 2014-2023 మధ్య కాలంలో సంవత్సరానికి సగటున సీఎంఆర్ఎఫ్ కింద కేవలం రూ.450 కోట్లే ఇచ్చారని సీఎంవో పేర్కొంది. అదే ప్రస్తుత ప్రభుత్వం ఏడాదికి సగటున రూ.850 కోట్లు ఇచ్చిందని వెల్లడించింది.

రాష్ట్రంలో 2,757 అంగన్‌వాడీల ఖాళీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఈ ఏడాది అక్టోబరు వరకు 2,757 అంగన్‌వాడీ వర్కర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ తెలిపారు. రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆమె సమాధానం ఇచ్చారు.

సమ్మిట్ ఎంఓయూల వెనుక చీకటి ఒప్పందాలు: హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెట్టుబడుల కట్టుకథలు చెప్పి గ్లోబల్ సమ్మిట్‌ను అట్టర్ ఫ్లాప్ చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. విజన్ డాక్యుమెంట్‌లో విజన్ లేదని, దాన్ని చేరుకునే మిషన్ లేదని ఎద్దేవా చేశారు. క్యూర్, ప్యూర్, రేర్ అంటున్న రేవంత్ రెడ్డి తెలంగాణను కొల్లగొడుతున్న చోర్ అని హరీశ్‌రావు ఆరోపించారు. గ్లోబల్ సమ్మిట్‌లో ఎంఓయుల వెనుక చీకటి ఒప్పందాలు, అంకెల గారడీ తప్ప ప్రజలకు పనికొచ్చే పనులు లేవన్నారు. రెండేళ్లలో రేవంత్ రెడ్డి జరిపిన విదేశీ పర్యటనలు, సమ్మిట్‌ల ద్వారా ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి, ఎన్ని కంపెనీలు ప్రారంభమయ్యాయి, ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయనే విషయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌లా లేదని, భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ ఎక్స్‌పో లా ఉందని, ఫ్యూచర్ సిటీ వేదికగా ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో పరువు పోగొట్టుకుందని హరీశ్‌రావు చెప్పారు.

నారాయణపేటలో ఆదిమానవుల ఆనవాళ్లు

» త్వరలో తవ్వకాలు చేపడతాం: హెరిటేజ్ శాఖ డైరెక్టర్

హైదరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలోని ముడుమాల్ ప్రాంతంలో ఆదిమానవుల ఆనవాళ్ల కోసం తవ్వకాలు చేపట్టేందుకు కేంద్రానికి నివేదిక పంపామని, త్వరలో అనుమతి లభించనుందని పురావస్తు, వారసత్వ శాఖ డైరెక్టర్ ఆచార్య అర్జున్‌రావు కుత్తడి తెలిపారు. ఈ ప్రాంతాన్ని ఇప్పటికే యునెస్కో తాత్కాలిక గుర్తింపు జాబితాలో చేర్చిందని, తవ్వకాల ఫలితాలను యునెస్కోకు సమర్పించాల్సి ఉంటుందని ఆయన ప్రకటించారు. బుధవారం నాడు హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని స్టేట్ మ్యూజియంలో అర్జున్‌రావు మాట్లాడుతూ.. నుమిస్మాటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఐ), రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో 'నాణాలు, దక్షిణ భారత ఆర్థిక చరిత్ర' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో నిర్వహించనున్న ఈ సదస్సుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతున్నారన్నారు. రెండు రోజుల సదస్సులో దక్షిణాది రాష్ట్రాల్లో పురాతన నాణాలపై 70 మంది పరిశోధన పత్రాలు సమర్పించనున్నారని వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి 300కి పైగా పరిశోధకులు, చరిత్రకారులు పాల్గొంటారని అర్జున్‌రావు పేర్కొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
I.T. శాఖ, తి.తి.దే., తిరుపతి
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Adv.No.16/TTD-11021(91)/5/2025-IT-TTD, తేది: 09.12.2025
దిగువ NIT No.లతో పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ఆన్‌లైన్ బహిరంగ టెండర్లు కోరబడుతున్నవి:
NIT No. 95 TO 114/EDPM/TTD/TPT/2025-26
టెండరు ప్రకటన కొరకు http://www.tirumala.org ను దర్శించగలరు. ఇ-టెండరులో పాల్గొనుటకు https://tender.apeprocurement.gov.in కు లేదా https://www.apeprocurement.gov.inకు లాగాన్ కాగలరు.
TTD-40021/10/2025-PRO SEC (Adv. No.316) Dt. 10.12.2025 కార్యనిర్వహణాధికారి

ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్
కార్పొరేట్ గుర్తింపు సంఖ్య: U40109TG2000SGC034119
టెండరు ప్రకటన
తయారీదారుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా మెటీరియల్స్ కొనుగోలు చేయాలని TGNPDCL భావిస్తోంది. స్పెసిఫికేషన్ నం.: CE/P&MM/(STN-51 to STN-100/2025-26 and OT-26 to OT-50/2025-26), మెటీరియల్ పేరు: వివిధ మెటీరియల్స్, బిడ్ సెక్యూరిటీ Exపనులపై 2% వంతున ఉంటుంది. ఆన్‌లైన్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల డౌన్‌లోడింగ్ 12.12.2025 న ఉ.11.00 గం.నుండి ప్రారంభమవుతుంది. తదుపరి వివరాలకు www.tender.telangana.gov.in మరియు www.tgnpdcl.comను దర్శించగలరు. డిజిటల్ కీ పొందుట కొరకు www.tsts.telangana.gov.in ను దర్శించగలరు. ఫోన్: 8712481302, email: cgmpmm@tgnpdcl.com సం/- చీఫ్ ఇంజనీర్ (P&MM)
DIPR RO No: 11905-PP/CL/ADVT/1/2025-26, తేది:10.12.2025

నల్గొండ పురపాలక సంఘ కార్యాలయం, నల్గొండ
RFP నోటీస్ No.E1/354/C&D Waste Unit/RFP/MCN/NLG/2025-26, తేది: 12.12.2025
పని పేరు: క్లస్టర్-II (నల్గొండ పురపాలక సంఘం+ 9 ULBs) కొరకు DBFOT ప్రాతిపదికన కన్‌స్ట్రక్షన్ & డిమాలిషన్ (C&D) వేస్ట్ సేకరణ, రవాణా, ప్రాసెసింగ్ మరియు డిస్పోజల్ కొరకు ఏజెన్సీ ఎంపిక.(2వ పిలుపు). బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 12.12.2025., ప్రీ బిడ్ సమావేశం కొరకు తేది మరియు సమయం: 16.12.2025న ఉ.11.00 గం.లకు. నల్గొండ పురపాలక సంఘ కార్యాలయంలో. విచారణల స్వీకరణకు ఆఖరి తేది: 18.12.2025న సా.5.00 గం.వరకు. విచారణలకు ప్రతిస్పందన తేది: 20.12.2025న ఉ.11.00 గం.లకు. బిడ్ దాఖలు ప్రారంభ తేది: 20.12.2025న మ.1.00 గం.ల నుండి. బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది: 29.12.2025న సా.4.00 గం.వరకు. సాంకేతిక బిడ్లు తెరచు తేది: 29.12.2025న సా.4.30 గం. వరకు. గమనిక: తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.telangana.gov.inలో చూడవచ్చును.
DIPR RO No.11906-PP/CL/ADVT/1/2025-26, Dt.10.12.2025 సం/- కమిషనర్, నల్గొండ పురపాలక సంఘం.

భారీ నీటి ప్లాంట్, మణుగూరు
Heavy Water Plant, Manuguru
ఇ-టెండర్లు కోరుతూ ప్రకటన
Notice Inviting e-Tenders
ఇ. నిట్ నం: eNIT No. HWPM/CIVIL/COL/NIT/2025/35
భారత రాష్ట్రపతి తరఫున జనరల్ మేనేజర్, HWP (M) వారు దిగువ పనుల కొరకు రెండు బిడ్ విధానంపై ఆన్‌లైన్ ఐటెమ్ రేట్ బిడ్‌లు కోరుతున్నారు. The General Manager, HWP (M), for and on behalf of President of India, invites online item rate bids, in two bid system for the followings work(s).
పని పేరు: HWPM కాలనీ వద్ద A3, A4, A5 & A6 క్లస్టర్లకు వరద నీటి కాలువల మరమ్మత్తు మరియు RCC రోడ్ల నిర్మాణం.
Name of work: Repair of storm water drains and Laying of RCC roads for A3, A4, A5 & A6 clusters at HWPM Colony.
అంచనా వ్యయం Estimated cost: రూ.45,84,000/-
బయానా EMD: రూ.91,680/-.
పూర్తిచేయు వ్యవధి: 06 నెలలు Period of Completion: 6 Months
Dates of availability of tender documents: From 04/12/2025 09.00 Hrs . టెండరు డాక్యుమెంట్ల లభ్యత తేదీలు: 04.12.2025న 09.00 గం.లకు.
బిడ్ దాఖలుకు ఆఖరి తేది & సమయం : 18/12/2025, 18:00 గం.ల వరకు.
Last time and date of submission of bid: Up to 18:00 hrs on 18/12/2025.
టెక్నికల్ బిడ్ (భాగం-ఎ) ఆన్‌లైన్‌లో తెరుచు తేది & సమయం: 26/12/2025 (14:30 గం.లకు)
Date & Time of online opening of Technical Bid (Part-A): 26/12/2025 (14:30 Hrs.)
బిడ్ ఫారమ్‌లు మరియు ఇతర వివరాలను వెబ్‌సైట్ https://eprocure.gov.in/eprocure/app నుండి పొందవచ్చు. ఈ ప్రకటన వెబ్‌సైట్ www.hwb.gov.in లో లభించును.
The bid forms and other details can be obtained from the website: https://eprocure.gov.in/eprocure/app. The Notice is also available on website www.hwb.gov.in
జనరల్ మేనేజర్ General Manager
భారీ నీటి ప్లాంట్, మణుగూరు,
Heavy Water Plant, Manuguru
cbc48115/12/0027/2526

పట్టుకు తిరగడం కాదు.. రాజ్యాంగాన్ని ఒకసారి చదవండి

» 'సర్'పై రాహుల్ వ్యాఖ్యలు హాస్యాస్పదం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకొని తిరగడం కాదని, దానిని ఓసారి చదివితే అందులో ఏముందో తెలుస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హితవు పలికారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)పై లోక్‌సభలో రాహుల్‌గాంధీ మాట్లాడిన మాటలు హాస్యాస్పదమన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల వ్యవస్థపై కనీస అవగాహన లేదని రాహుల్‌గాంధీ మాటలతో మరోసారి నిరూపితమైందని విమర్శించారు. ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సంస్కరించేందుకు ఎస్‌ఐఆర్ అవసరమనే విషయాన్ని రాహుల్‌గాంధీ తెలుసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా తప్పులతడకగా ఉందని ఒకపక్క ఎన్నికల కమిషన్‌పై ఆరోపణలు చేయడం, మరోపక్క ఆ తప్పులను సరిదిద్దేందుకు ప్రభుత్వం చేపట్టిన సవరణను విమర్శించడం రాహుల్ గాంధీ రెండు నాలుకల ధోరణికి, వితండవాదానికి, అవగాహనారాహిత్యానికి అద్దం పడుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు వారి అసమర్థతకు కారణాలను తెలుసుకోకుండా, ఎన్నికల కమిషన్ లాంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై దుష్ప్రచారం మానుకోవాలన్నారు. లేకపోతే ప్రజలు మరింత తిరస్కరిస్తారని గుర్తుంచుకోవాలన్నారు

రాజకీయ లాభం కోసం జీహెచ్‌ఎంసీ విస్తరణ

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధ్వజం

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీలో 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్లను విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనుక రాజకీయ స్వలాభమే ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన.. జీహెచ్‌ఎంసీ విస్తరణ చేపట్టింది మజ్లిస్ పార్టీకి ప్రత్యేక ప్రయోజనం కల్పించడం కోసమే అని ఆరోపించారు. బీజేపీ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తోందన్నారు. నేటికీ అనేక వార్డుల్లో రహదారులు, మురుగునీటి వ్యవస్థ, మౌలిక వసతులు సరిగా లేవని.. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా విస్తరణ పేరుతో ఉత్తర్వులు ఇవ్వడం అన్యాయం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని వల్ల ప్రజలపై పన్నుల భారం పడుతుందన్నారు. గతంలో బీఆర్‌ఎస్ కూడా మజ్లిస్‌కు రాజకీయ లబ్ధి చేకూర్చేలా నిర్ణయం తీసుకుందని ధ్వజమెత్తారు. తెలంగాణ రైజింగ్ పేరుతో ప్రభుత్వం కుదుర్చుకున్న రూ.5.50 లక్షల కోట్ల పెట్టుబడులపై అనుమానాలు ఉన్నాయని రాంచందర్‌రావు అన్నారు. డొల్ల కంపెనీలు, గతంలో బ్లాక్ లిస్టు చేసిన కంపెనీల పేర్లు ఉన్నాయని ఆరోపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె. శ్రీనివాస్. టంకశాల అశోక్, గౌరీశంకర్, వర్ధెల్లి మురళి, కె. రామచంద్రమూర్తి, కట్టా శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి

ఎస్సారెస్పీ రెండోదశ కాల్వకు భీమిరెడ్డి పేరు పెట్టాలి

» రౌండ్ టేబుల్ సమావేశంలో మేధావుల డిమాండ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) రెండో దశ కాల్వకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి(బీఎన్) పేరు పెట్టాలని పలువురు మేధావులు, విద్యావేత్తలు, ప్రముఖ పాత్రికేయులు డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం సుదీర్ఘకాలం పోరాడి, ఆనాటి ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి మరీ విజయం సాధించిన బీఎన్ పేరు కాకుండా, దానికి మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి(ఆర్డీఆర్) పేరు ప్రకటించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఎన్ ఆలోచనా వేదిక ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా "భీమిరెడ్డి నర్సింహారెడ్డి జ్ఞాపకాలు, ఎస్సారెస్పీ కాల్వ పేరు మార్పుపై సమాలోచనలు" అంశంపై సీనియర్ జర్నలిస్టు వర్ధెల్లి మురళి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎస్సారెస్పీ రెండో దశ కాల్వకు, సూర్యాపేట జిల్లాకు బీఎన్ పేరు పెట్టాలని సభలో జూలూరు గౌరీశంకర్ తీర్మానాన్ని ప్రతిపాదించారు. కార్యక్రమానికి హాజరైన పాత్రికేయులు కె. రామచంద్రమూర్తి, కె. శ్రీనివాస్, అల్లం నారాయణ, టంకశాల అశోక్, కట్టా శేఖర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సినీ దర్శకుడు ఎన్. శంకర్, విశ్రాంత ప్రొఫెసర్లు వినాయక్‌రెడ్డి, భగవంత్‌రెడ్డి తదితరులంతా తీర్మానానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆర్డీఆర్ ఎస్సారెస్పీ-స్టేజ్2గా నామకరణం చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెనక్కి తీసుకోవాలని వారంతా ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు ప్రభాకర్ రావు సహకరించడం లేదు

» సుప్రీంలో రాష్ట్ర సర్కారు వాదనలు.. నేడూ విచారణ

న్యూఢిల్లీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణకు సహకరించడం లేదని సుప్రీంకోర్టుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా ఫోన్ అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు 2023 మార్చి 10న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎస్ఐబీకి నేతృత్వం వహించిన ప్రభాకర్ రావును ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు. దాంతో ఆయన అమెరికా వెళ్లిపోయారు. ముందస్తు బెయిల్ ఇస్తేనే భారతదేశానికి తిరిగి వస్తానని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, న్యాయస్థానం తిరస్కరించింది. హైకోర్టు తీర్పును ఈ ఏడాది మే 9న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుప్రీంకోర్టు మధ్యంతర రక్షణ కల్పించడంతో ఆయన దేశానికి వచ్చి సిట్ విచారణకు హాజరవుతున్నారు. ఆ కేసు బుధవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ విచారణకు ప్రభాకర్ రావు ఏమాత్రం సహకరించడం లేదని తెలిపారు. ఐదింటిలో కేవలం రెండు ఐక్లౌడ్లను మాత్రమే రీసెట్ చేశామని, మరో మూడు ఐక్లౌడ్లు రీసెట్ చేయాల్సి ఉందన్నారు. ప్రభాకర్ రావు తరఫున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ సమాధానం ఇస్తూ ప్రభుత్వం గతంలో మోపిన అభియోగాలపై అఫిడవిట్ దాఖలు చేశామని తెలిపారు. మంగళవారమే అఫిడవిట్ దాఖలు చేశారని, దీనిపై కౌంటర్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వాలని లూథ్రా కోరారు. ఈ నేపథ్యంలో ధర్మాసనం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

పంచాయతీ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం

» 77 మంది సస్పెండ్.. 130 మందికి షోకాజ్‌లు

వికారాబాద్/రంగారెడ్డి/కామారెడ్డి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో తొలి విడత పంచాయతీ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, ఉద్యోగులపై ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు చేపట్టారు. గురువారం తొలి విడత ఎన్నికలు జరగనుండగా.. పలువురు సిబ్బంది విధులకు రిపోర్టు చేయలేదు. వికారాబాద్‌లో 17 మందిపై సస్పెన్షన్ వేటు పడింది. వారిలో ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ అధికారులు ఉన్నారు. ఇటీవల నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరైన వారిపైనా చర్యలు తీసుకోనున్నారని సమాచారం. రంగారెడ్డి జిల్లాలో దాదాపు 60 మంది ఎన్నికల సిబ్బందిపై సస్పెన్షన్ వేటుకు రంగం సిద్ధమైంది. మరో 80 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి చర్యలకు ఆదేశించినట్లు సమాచారం. కామారెడ్డి జిల్లాలో ఎన్నికల విధులకు రిపోర్టు చేయని 53 మంది పీవో, ఓపీవోలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

నేడే తొలి విడత పల్లె పోరు

ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలివిడత పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియను నేడు (గురువారం) నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ (ఎస్ఈసీ) రాణి కుముదిని తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వెల్లడించారు. బుధవారం ఎస్ఈసీ కార్యాలయంలో ఏడీజీపీ మహేశ్ భగవత్, పీఆర్ డైరెక్టర్ సృజన, ఎస్ఈసీ కార్యదర్శి మంద మకరంద్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం తొలి విడతలో 189 మండలాల పరిధిలో 4,236 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, అందులో 395 పంచాయతీల్లో సర్పంచ్ పదవులు ఏకగ్రీవం అయ్యాయని చెప్పారు. 3,834 గ్రామ పంచాయతీలకు గురువారం పోలింగ్ జరగనున్నట్లు తెలిపారు. మిగిలిన 5 గ్రామాల్లో ఒక్క నామినేషన్ దాఖలు కాకపోవటంతో పోలింగ్ జరగటం లేదు. అదేవిధంగా 9,633 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమైనట్లు వెల్లడించారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 37,562 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, సుమారు 93,905 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తిచేశారు. తొలి విడతలో 3,834 సర్పంచ్ స్థానాల్లో 12,960 మంది, 27,628 వార్డు స్థానాల్లో 65,455 మంది పోటీపడుతున్నట్లు వివరించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు. సాయంత్రంలోపే ఉప సర్పంచ్‌ల ఎన్నిక ప్రక్రియను కూడా పూర్తిచేస్తామని



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

తెలిపారు. తొలి విడతలో మొత్తం 56,19,430 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు. పోలీసుల తనిఖీల్లో ఇప్పటివరకు రూ.7,54,78,535 విలువైన వస్తువులు, నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. అందులో రూ.1.70 కోట్ల నగదు, రూ.2.84 కోట్ల విలువైన మద్యం, రూ.2.22 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు, రూ.64.15 లక్షల విలువైన ఇతర వస్తువులు ఉన్నాయని వివరించారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన 3,214 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, 31,428 మంది పోలీసుల సమక్షంలో బైండోవర్ అయినట్లు వివరించారు.

ఓటర్ల కోసం 'టీ పోల్' యాప్..!

గ్రామీణ ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల సంఘం టీ పోల్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని రాణి కుముదిని తెలిపారు. ఈ యాప్ ద్వారా ఓటరు స్లిప్పులను డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు, పోలింగ్ కేంద్రం ఎక్కడుందో తెలుసుకోవచ్చని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి పౌరులు ఫిర్యాదులు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్: 92400 21456ను సంప్రదించాలని సూచించారు.

పల్లె బాట పట్టిన ప్రజలు

పోలింగ్ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉంటున్న ఆయా ప్రాంతాల ప్రజలు గ్రామాల బాట పట్టారు. ఎంజీబీఎస్, జేబీఎస్, ఎల్‌బీనగర్, అఫ్జల్‌గంజ్, ఆరాంఘర్ వంటి ప్రధాన బస్టాండ్లు బుధవారం కిటకిటలాడాయి. బస్సుల్లో సీట్ల కోసం ఫీట్లు చేయాల్సి వచ్చింది. చాలా బస్సుల్లో సీట్లు దొరక్క నిల్చునే ప్రయాణం చేశారు. కొన్ని రూట్లలో ఆర్టీసీ అదనపు బస్సులు నడుపుతోంది. అవి కూడా చాలక ప్రజలు ప్రైవేటు వాహనాల్లో సొంత గ్రామాలకు వెళ్లారు. గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా ఓటర్ల కోసం సొంతంగా వాహనాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ నుంచి అన్ని రూట్లలో అదనపు బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

537 ఫ్లయింగ్ స్క్వాడ్స్: డీజీపీ

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. తొలిదశ పోలింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో 537 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఆయుధాలతో సిద్ధంగా ఉంటారని, 155 సర్వేలెన్స్ బృందాలను రంగంలో దింపామని బుధవారం వెల్లడించారు. 54 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 1,053 నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు జారీ చేసినట్లు వెల్లడించారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గాల ఘర్షణ

» బీఆర్‌ఎస్ నేత మృతి.. ఇరుపార్టీలకు చెందిన ఐదుగురికి గాయాలు

» కాంగ్రెస్ హత్యా రాజకీయాలను సహించబోం: కేటీఆర్

నూతనకల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్, కాంగ్రెస్ స్థానిక నేతల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందగా, ఐదుగురికి గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం లింగంపల్లిలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. గ్రామంలోని నాలుగో వార్డు మెంబర్‌గా బీఆర్‌ఎస్ నేత ఉప్పుల మల్లయ్యయాదవ్ కోడలు పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఆయన, మరికొందరు బీఆర్‌ఎస్ నేతలు కలిసి ఎన్నికలపై మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఉప్పుల సతీష్, కొరివి గంగయ్య, మరికొందరితో ఘర్షణ జరిగింది. పరస్పరం కర్రలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో ఉప్పుల మల్లయ్యయాదవ్ తలకు గాయమై స్పృహతప్పి పడిపోయారు. మరో ముగ్గురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలకు గాయాలయ్యాయి. పోలీసులు మల్లయ్యయాదవ్‌ను సూర్యాపేటలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కానీ ఆయన అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు సూర్యాపేట ఏఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్ కార్యకర్తలపై జరిగిన దాడి దారుణమని, అధికార మదంతో కాంగ్రెస్ గూండాలు సాగిస్తున్న హత్యా రాజకీయాలను సహించబోమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఉప్పుల మల్లయ్య మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఓటుకు 3వేల దాకా

(మొదటిపేజీ తరువాయి)

క్వార్టర్ పంచడం పాతదైపోయి.. ఒక్కో ఫుల్ బాటిల్, అదీ కాస్త బ్రాండెడ్ కావాలన్న డిమాండ్ వరకు వెళ్లింది. తెల్లవారితే పోలింగ్ ఉండటంతో ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో చాలాచోట్ల అభ్యర్థులు బుధవారమే అడిగినవన్నీ పంచేశారు. అనుచరులతో ఇంటింటికీ నగదుతోపాటు చికెన్, మందు పంపిణీ చేశారు.

ఓటుకు రూ.30 వేలు!

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని ఓ గ్రామంలో ఇద్దరు కీలక అభ్యర్థులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కావడం, పెద్ద నేతల అనుచరులు కావడంతో గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. దీనితో పోటాపోటీగా ఓటుకు రూ.30 వేల వరకు కూడా పంచినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై సమాచారమున్నా నేతల నుంచి ఒత్తిళ్లురావడంతో పోలీసులు ఏమీచేయలేకపోతున్నారని అంటున్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజవర్గంలోని బండోనిగూడ, బుక్కోని గూడలో ఓటుకు రూ.10వేల వరకు, శంషాబాద్ మండలం పాల్మాకుల్, పెద్ద షాపూర్, నర్కూడల్ కూడా ఓటుకు రూ. 5 నుంచి 7వేల వరకు పంపిణీ చేసినట్టు స్థానికులు తెలిపారు. ఖమ్మం జిల్లాలో కొన్ని పంచాయతీల్లో ఓటు రేటు రూ.5వేలు దాటింది. ఓట్లు వేయించాలంటూ కుల పెద్దలు, కాలనీ పెద్దలకు అదనంగా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఇవ్వడం కనిపించింది. మధిర మండలం వెంకటాపురం, చింతకాని మండలం బస్వాపురంలో ఓటుకు రూ.5వేలు పంచినట్టు స్థానికులు తెలిపారు. ఇదే మండలంలో పలు పంచాయతీల్లో ఓటర్లకు చీరలు, లుంగీలు, కుక్కర్లు పంపిణీ చేశారని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ ఓట్ల కోసం నోట్ల కట్టలు తెగాయి. నల్లగొండ, మునుగోడు, సూర్యాపేట, తుంగతుర్తి, నకిరేకల్, ఆలేరు నియోజకవర్గాల పరిధిలోనూ ఈసారి పంచాయతీల్లో పంపకాలు బాగా పెరిగాయని స్థానికులు చెబుతున్నారు. హనుమకొండ జిల్లాలోని పలు మేజర్ గ్రామ పంచాయతీలలో ఓట్ల కోసం యూత్ అసోసియేషన్లతో ఒప్పందం చేసుకుంటున్న సర్పంచ్ అభ్యర్థులు.. తాము గెలిస్తే వారిని గోవా టూర్‌కు తీసుకెళతామని హామీ ఇచ్చారు.



ఓట్లు కొనబోమని ఏర్పాటు చేసిన బోర్డు

ఊరికే విసిగించొద్దు.. ఓట్లు కొనం

ఓటుకు ఎంతిస్తారు? మద్యం, డబ్బులు ఎప్పుడు పంచుతారు అంటూ ఓటర్లు అడుగుతుండటంతో.. కామారెడ్డి జిల్లా భిక్కనూరులో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మైత్రేయి.. తన ఇంటి ముందు బోర్డు పెట్టేశారు. 'మమ్మల్ని విసిగించకండి.. ఓట్లు కొనం, పైసలు పంచం, నిజాయతీగా ఆలోచించి ఓటు వేయండి' అని రాసిపెట్టారు.

మా ఆయనకు ఓటేయొద్దు

భద్రాద్రికొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని ఓ గ్రామంలో ఒక వార్డు మెంబర్ అభ్యర్థి భార్య స్వయంగా ఇల్లిల్లూ తిరుగుతూ తన భర్తకు ఓటేయవద్దని చెబుతుండటం ఆశ్చర్యం కలిగించింది. ఈ వార్డు మెంబర్ అభ్యర్థి ఓ పార్టీ మద్దతుతో బరిలోకి దిగారు, వారి బంధువు మరో పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. దీనితో తమ వార్డులో ఓట్లు చీలకూడదని ఇలా చేశారని అంటున్నారు.

పెళ్లికి, ఇల్లుకు.. రూ.25,116!

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం కోలుకుందలో సర్పంచ్ అభ్యర్థి కరణం కీర్తి రామకృష్ణ ఎన్నికల కోసం ఆరు గ్యారెంటీలతో మేనిఫెస్టో ఇచ్చారు. పెళ్లికి, ఇల్లుకు, పుట్టినరోజులు, ఫంక్షన్లకు ఆర్థిక సాయం అందిస్తానంటూ, అన్ని మతాల పండుగల సమయంలో చీరల పంపిణీ, భోజనాలు ఏర్పాటు చేస్తానంటూ బాండ్ పేపర్ రాసిచ్చారు.

గ్రామంలో కార్మికులకు ఉచిత బీమా..

రంగారెడ్డి జిల్లా తక్కళ్లపల్లిలో సర్పంచ్ అభ్యర్థి పి.శ్రీశైలం వినూత్న హామీలతో బాండ్ పేపర్ రాసిచ్చారు. గ్రామంలో కూలీలు, కార్మికులకు ఉచిత బీమా కల్పిస్తానని, ఆరు నెలలకోసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనులు చేసి పెడతానని.. ఇలా 25 హామీలు ఇచ్చారు.



కొండాపూర్ మండలంలో సర్పంచ్‌గా గెలిపించాలని ఓ అభ్యర్థి అందజేసిన చెక్కు

చెక్కు పట్టు.. ఓటేయకుంటే ఒట్టు!

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి ఓటర్లకు రూ.10 వేలు సొమ్ము రాసిన చెక్కులు పంపిణీ చేశారు. డబ్బు, మద్యం పంచకుండా ప్రత్యర్థులు, పోలీసులు అడ్డుకోవడం వల్లే ఇలా ఇస్తున్నానని చెప్పుకొచ్చారు. మరోవైపు అవి చెల్లని చెక్కులంటూ ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్.. పంచాయతీ దోస్తీ!

కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులకూ మద్దతు.. పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ సిత్రాలు

పంచాయతీ ఎన్నికలు పేరుకు పార్టీల రహితమే అయినా.. చాలా చోట్ల అభ్యర్థులు తమ పార్టీ జెండాలు, రంగులతో ప్రచారం చేశారు. అయితే కొన్ని చోట్ల మాత్రం పరిస్థితి భిన్నంగా మారింది. రాష్ట్రస్థాయిలో, జాతీయ స్థాయిలో ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలవారు కూడా గ్రామాల్లో కలిసి పనిచేయడం, మద్దతు ఇచ్చుకోవడం కనిపించింది. హనుమకొండ జిల్లాలో పలుచోట్ల బీఆర్‌ఎస్, బీజేపీ పరస్పరం సహకరించుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బీజేపీ నేతలు పెద్దగా పోటీ చేయడం లేదు. దానితో చాలా చోట్ల బీఆర్‌ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతిస్తున్నారు. ప్రతిగా ఆయా గ్రామాల్లో కొన్ని వార్డుల్లో బీజేపీ మద్దతుదారులకు బీఆర్‌ఎస్ మద్దతు ఇస్తోంది. షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలో 24 గ్రామాల్లో బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులకు బీజేపీ నేతలు మద్దతు ఇస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇక ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఉప్పరిగూడలో కాంగ్రెస్ అభ్యర్థికి బీజేపీ నేతలు మద్దతు ఇస్తున్నారు. పొల్కంపల్లిలో బీజేపీ అభ్యర్థికి బీఆర్‌ఎస్, మేడిపల్లిలో బీజేపీ నేతలు సీపీఎంకు, తులేకలాన్‌లో బీఆర్‌ఎస్‌కు సీపీఎం నేతలు, కప్పాడులో బీఆర్‌ఎస్‌కు బీజేపీ నేతలు మద్దతు ఇస్తున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో పలుచోట్ల బీఆర్‌ఎస్, బీజేపీ కలిసి అభ్యర్థులను రంగంలో దింపాయి. వికారాబాద్ జిల్లా చౌడాపూర్, యాలాల్ మండలాల్లోనూ ఇదే పరిస్థితి. దోమలో ఇద్దరు కాంగ్రెస్ నేతలు సర్పంచ్ పదవికి పోటీ చేస్తుండగా.. ఒకరికి బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు ఇస్తున్నారు. ఇక ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లోని కొన్ని పంచాయతీల్లో సర్పంచ్ పదవుల కోసం బీఆర్‌ఎస్‌కు బీజేపీ మద్దతు ఇస్తోంది. ఆ పంచాయతీల్లో ఒకటి, రెండు వార్డు స్థానాల్లో తమవారికి బీఆర్‌ఎస్ మద్దతు తీసుకుంటోంది. ఇక కాంగ్రెస్ రెబెల్స్ బరిలో ఉన్న చోట వారికి బీఆర్‌ఎస్ మద్దతు ఇస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీజేపీ తక్కువ సర్పంచ్ స్థానాలకు పోటీ చేస్తోంది. కొన్ని చోట్ల బీఆర్‌ఎస్ మద్దతు తీసుకుని.. మిగతా చోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇస్తోంది. అలాంటి చోట్ల ఉప సర్పంచ్ పదవులనూ పంచుకునే అవగాహన కుదుర్చుకుంటున్నాయి.

నకిలీ విత్తనాలు అమ్మితే 30 లక్షల దాకా జరిమానా!

» మూడేళ్ల జైలు సహా విత్తన సంస్థలపై ఐదేళ్ల నిషేధం

» విత్తన ధరలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయించాలి

» కేంద్ర విత్తన చట్టం-25 ముసాయిదాకు ప్రతిపాదనలు

» రాష్ట్ర ప్రభుత్వ సూచనలు వెల్లడించిన మంత్రి తుమ్మల

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫారసు చేసింది. ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా విత్తనాల విక్రయం, నకిలీ/నాసిరకం విత్తనాలు రైతులకు అంటగట్టడం, లేబుల్స్ లేకుండా సరఫరా చేయడం లాంటి అక్రమాలకు పాల్పడే విత్తనోత్పత్తి సంస్థలకు రూ.50 వేల నుంచి 30 లక్షల వరకు జరిమానా విధించాలని సూచించింది. విత్తనచట్టం-2025 ముసాయిదాపై నెల రోజుల పాటు వివిధ వర్గాలతో చర్చించిన రాష్ట్ర వ్యవసాయశాఖ.. పలు సూచనలతో తుది నివేదికను సిద్ధం చేసింది. అభ్యంతరాలు తెలపడానికి గురువారంతో గడువు ముగుస్తోంది. ఈ క్రమంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతుల ప్రయోజనాల కోసం ముసాయిదాలో చేర్చాల్సిన, మార్చాల్సిన అంశాలను తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ సూచనలు

- ప్రత్యేకమైన రకాలను నమోదు చేయడానికి రాష్ట్ర విత్తన కమిటీకి, రాష్ట్రానికి అధికారం ఇవ్వాలి. ఎందుకంటే స్థానిక రైతులకు ఎలాంటి విత్తనాలు కావాలి? వారి అవసరాలేంటి? వాతావరణం ఎలా ఉంటుంది? అనే వివరాలు రాష్ట్ర ప్రభుత్వం వద్దే ఉంటాయి.
- ప్రతి విత్తనోత్పత్తి సంస్థ నిర్వాహకుడు, విత్తన డీలర్లు, పంపిణీదారులు కనీస విద్యార్హతగా వ్యవసాయంలో డిగ్రీ/డిప్లొమా కలిగి ఉండాలి. లేదంటే ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలో 3 నెలల సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసి ఉండాలి.
- అన్నిరకాల విత్తనాలను గుర్తింపు పొందిన సంస్థతో ధ్రువీకరించాలి. స్వీయ ధ్రువీకరణకు అనుమతి ఇవ్వకూడదు.
- రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలకు విత్తన ధరలను నియంత్రించే అధికారం కల్పించాలి.
- దిగుమతి చేసుకున్న విత్తనాలన్నింటికీ కనీసం రెండేళ్లు.. ఐసీఏఆర్, ఎస్ఏయూ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించి, విజయవంతమైన తర్వాతే ఇక్కడి రైతులకు మార్కెటింగ్ చేయాలి.

రైతులు, రైతు సంఘాల సూచనలు

- నకిలీ/నాసిరకం విత్తనాలతో నష్టపోయిన రైతులకు 60రోజుల్లోగా పరిహారం అందించాలి. అత్యధిక దిగుబడి ఆధారంగానే పరిహారాన్ని లెక్కించాలి. విత్తనాలను సరసమైన ధరల్లో రైతులకు అమ్మడానికి విత్తన ధరల నియంత్రణ తప్పనిసరిగా ఉండాలి.
- సంప్రదాయ విత్తనాలు, వారసత్వ విత్తనాలు, డిజిటల్ సీక్వెన్స్ ఇన్‌ఫర్మేషన్ (డీఎస్ఐ)ను రక్షించడానికి ప్రత్యేక చర్యలు ఉండాలి.

రాష్ట్ర ప్రతిపాదనలను బిల్లులో చేర్చాలి: తుమ్మల

"విత్తన చట్టంపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను కేంద్రం పరిగణనలోకి తీసుకొని విత్తన బిల్లులో చేర్చాలి. నకిలీ, నాసిరకం విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతుల ప్రయోజనాలను పరిరక్షించేలా చట్టాలు లేకపోవడంతో నష్టపోతున్నారు. ఈ క్రమంలో కఠినమైన చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఉంది" అని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

భూకేటాయింపులో అందరికీ సమన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

గద్వాల్ విజయలక్ష్మికి సర్వే నెంబర్ 403లో రూ.350 చొప్పున కేటాయించిన 425 చదరపు గజాల భూమిని రెగ్యులరైజ్ చేస్తూ అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 56ను జారీచేసింది. మార్కెట్ రేటు ప్రకారం కాకుండా అతి తక్కువ ధరకు సదరు భూమిని రెగ్యులరైజ్ చేయడం చెల్లదని పేర్కొంటూ గడీల రఘువీర్‌రెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో గత ఏడాది పిల్ వేశారు. బుధవారం దీనిపై చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ జరిపింది. నిబంధనలను పక్కనబెట్టి సదరు భూమిని రెగ్యులరైజ్ చేసిన జీవోను కొట్టేయాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ.. సదరు భూములపై ఇప్పటికీ కోర్టులో అనేక కేసులు నడుస్తున్నాయని, పూర్తి వివరాలు అందజేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. నిబంధనలకు విరుద్ధంగా ప్రతివాదులకు భూమిని రెగ్యులరైజ్ చేస్తూ జీవో ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ జీవో అందరికీ వర్తిస్తుందా? అని ప్రశ్నించింది. అందరికీ సమన్యాయం ఉండాలని వ్యాఖ్యానించింది. కచ్చితంగా సదరు భూమిని వారికే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం ఇప్పటికీ భావిస్తున్నట్లయితే మార్కెట్ ధర ప్రకారం జీవోను సవరించాలని స్పష్టం చేసింది. పొరపాటును సరిదిద్దుకోవాలని, లేకపోతే తాము జోక్యం చేసుకోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియజేయాలని పేర్కొంటూ విచారణను వచ్చే ఏడాది జనవరి 7కు వాయిదా వేసింది.

వర్సిటీల బాగు బీఆర్‌ఎస్‌కు ఇష్టం లేదు: అద్దంకి

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా సహా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు బాగుపడటం బీఆర్‌ఎస్‌కు ఇష్టం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు. తమను గద్దె దించారని చెప్పి ఓయూ విద్యార్థులపై వారికి ఇంకా అక్కసు ఉందని ఓ ప్రకటనలో విమర్శించారు. అందుకే ఓయూ సీఎం పర్యటనలో బీఆర్‌ఎస్‌కు చెందిన కొందరు అలజడి సృష్టించే ప్రయత్నం చేశారన్నారు. నిధులు లేక బోసిపోయిన ఉస్మానియా వర్సిటీపై సీఎం సిరులు కురిపించారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ గౌడ్ అన్నారు. నెహ్రూను తలపించేలా రేవంత్ నిర్ణయాలు తీసుకుంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ కొనియాడారు.



'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్' ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రి దుద్దిళ్ల

స్టార్టప్‌ల రాజధాని

ఆవిష్కరణల రంగానికి కేంద్రబిందువుగా హైదరాబాద్

» 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్'

ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్/శంషాబాద్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను దేశానికే స్టార్టప్‌ల రాజధానిగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. భారత దేశ ఆవిష్కరణల రంగానికి హైదరాబాద్ కేంద్రబిందువుగా నిలుస్తోందన్నారు. ఉన్నత ఆశయాలతో 1998లో ఇద్దరు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మిత్రులు కలిసి కాలిఫోర్నియాలో ఒక గ్యారేజీలో ఓ స్టార్టప్‌ను ప్రారంభించారని.. అదే నేటి ప్రఖ్యాత గూగుల్ కంపెనీ అని గుర్తుచేశారు. బుధవారం టీ హబ్‌లో జరిగిన 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్' ప్రారంభోత్సవానికి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గూగుల్ సంస్థ గ్లోబల్ నైపుణ్యం, టీహబ్ స్టార్టప్ కమ్యూనిటీ, దానికితోడు ప్రభుత్వ మద్దతు.. ఈ మూడు శక్తులు కలగలిసిన ప్రత్యేక భాగస్వామ్యం భారత ఆవిష్కరణకర్తలకు కొత్త అవకాశాలు అందిస్తోందని తెలిపారు. 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన అనేక స్టార్టప్‌లు నేడు బిలియన్ డాలర్ కంపెనీలుగా ఎదిగాయన్నారు. హైదరాబాద్ కేవలం స్టార్టప్‌ల కేంద్రంగా ఎదగడమే కాదు.. ఆ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని కోరుకుంటున్నామని అన్నారు. నగరం నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆవిష్కర్తలకు అవసరమైన సహకారం అందించడానికి తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ సంస్థ సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. స్టార్టప్‌ల కోసం తమ ప్రభుత్వం రూ.1000 కోట్లతో స్టార్టప్స్ ఫండ్ ఏర్పాటు చేస్తుందని రేవంత్ చెప్పారు. ఆ నిధులను వినియోగించుకొని, స్టార్టప్‌లు బిలియన్ డాలర్ల కంపెనీలుగా ఎదగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. గత 25 ఏళ్లలో సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్‌లో చాలా స్టార్టప్‌లు పెద్ద కంపెనీలుగా ఎదిగాయని సీఎం చెప్పారు.

వర్సిటీల్లో 'ఇంక్యుబేషన్' కేంద్రాలు: శ్రీధర్‌బాబు

కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 'ఇంక్యుబేషన్' కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బుధవారం టీ హబ్‌లో 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్'ను సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. 'మేం స్టార్టప్‌లను కేవలం చిన్న కంపెనీలుగా చూడడం లేదు. సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలు అందిస్తూ.. కొత్త ఉద్యోగాలను సృష్టించే ఆర్థిక ఇంజన్లుగా చూస్తున్నాం. 2024లో ఇక్కడి స్టార్టప్‌లు 571మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 160 శాతం అధికం' అని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

జీఎంఆర్ స్పోర్ట్స్, ప్రభుత్వం మధ్య ఒప్పందం

జీఎంఆర్ స్పోర్ట్స్ సంస్థ, తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. గ్లోబల్ సమ్మిట్‌లో ఈ ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా దుబాయ్ స్పోర్ట్స్ సిటీని భాగస్వామ్య సంస్థగా చేసుకొని, జీఎంఆర్‌స్పోర్ట్స్ భారత్ ఫ్యూచర్ సిటీలో శాటిలైట్ స్పోర్ట్స్ సిటీని అభివృద్ధి చేయనుంది. ప్రాజెక్టులో ఆధునిక శిక్షణా కేంద్రాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియాలు, సదుపాయాలు ఏర్పాటు చేస్తామని జీఎంఆర్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్‌కుమార్ తెలిపారు.


సీఎం రేవంత్‌రెడ్డితో భాంటియా ప్రతినిధులు సురేందర్ భాంటియా, అమిత్ భాంటియా

'భాంటియా' పెట్టుబడులు 511 కోట్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భాంటియా ఫర్నిచర్స్ సంస్థ తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఈ సంస్థ రూ.511 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. ఈ ఒప్పందంతో 1,550 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో భాంటియా ప్రతినిధులు సురేందర్ భాంటియా, అమిత్ భాంటియా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో భాంటియా ప్రతినిధులు మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ఫర్నిచర్ రంగంలో వృద్ధి దిశను మార్చేందుకు, విస్తరణ మార్గాన్ని మెరుగుపరిచేందుకు కీలక అడుగు అని పేర్కొన్నారు.

సమస్యలపై విద్యార్థులకు కొట్లాడే స్వేచ్ఛ



(మొదటిపేజీ తరువాయి)

చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వర్సిటీ అభివృద్ధికి సిద్ధం చేసిన మాస్టర్‌ప్లాన్, డిజైన్లను, విద్యార్థుల సూచనల కోసం రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, "మీకు స్వేచ్ఛ ఉంది.. సామాజిక న్యాయం జరుగుతుంది.. సమానమైన అవకాశాలిస్తాం. రాజకీయ పార్టీల ఉచ్చులో పడకండి. చదువుకోండి.. భవిష్యత్తును నిర్మించుకోండి. సమస్యలపై కొట్లాడతానంటే వద్దనను. రాష్ట్రానికి ఏది ప్రయోజనమో దానికోసం కొట్లాడండి. సర్వ స్వతంత్రతను మీరు నిరూపించుకోండి. కష్టపడితే ఫలితాలు వస్తాయి. డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లుగా ఎదగడంతోపాటు నాయకులై ఈ రాష్ట్రాన్ని పాలించాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

తమ్ముళ్లు, చెల్లెళ్లు ఉన్నారనే వచ్చాను..

108 ఏళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా వర్సిటీ దేశంలోనే అత్యంత ప్రాచీన వర్సిటీల్లో ఏడో స్థానం, దక్షిణ భారతదేశంలో మూడో ప్రాధాన్యం కలిగి ఉందని అన్నారు. అలనాటి స్ఫూర్తితో భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందించుకోవడానికి అందరినీ కలిసేందుకు ఓయూకు వచ్చానని తెలిపారు. "ఓయూలో మంత్రులు, సీఎంలను అడ్డుకునే చరిత్ర ఉందని, మీరెందుకు వెళ్తున్నారని నన్ను కొందరు అడిగారు. మీరు చాలా ధైర్యం చేస్తున్నారని కొందరన్నారు. కానీ, నాది ధైర్యం కాదు.. అభిమానం. నా చెల్లెళ్లు, తమ్ముళ్లు ఉన్న వర్సిటీకి వెళ్లేందుకు ధైర్యం అవసరమా? గుండెల నిండా అభిమానంతో భవిష్యత్తు ప్రణాళిక కోసం ఇక్కడికి వచ్చాను. తెలంగాణ గడ్డకు ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఆధిపత్యం చెలాయించాలని చూసిన ప్రతిసారీ తెలంగాణలో తిరుగుబాటు మొదలైంది. తెలంగాణ తొలిదశ ఉద్యమం ఓయూలోనే పుట్టింది. మలిదశ ఉద్యమంలో ఓయూ ముందు బాగాన నిలిచింది. సమాజానికి ఏ సమస్య వచ్చినా యూనివర్సిటీ విద్యార్థులు కదలడం వల్లే ఆ సమస్యకు పరిష్కారం లభించింది" అని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు.

ఫామ్‌హౌజ్‌లు కావాలని అడగలేదు..

తెలంగాణ వచ్చాక తమ్ముళ్లు, చెల్లెళ్లు ఎవరి ఆస్తులనూ అడగలేదని, ఎర్రవల్లి, జన్వాడ, అజీజ్‌నగర్, శంకర్‌పల్లిలో కట్టుకున్న ఫామ్‌హౌజ్‌లు కావాలనీ అడగలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు మాత్రమే అడిగారని తెలిపారు. కానీ, పదేళ్లలో యూనివర్సిటీని పట్టించుకోకపోగా.. కాలగర్భంలో కలపడానికి కుట్రలు పన్నారని ఆరోపించారు. 'ప్రజా ప్రభుత్వంలో స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందిస్తున్నాం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడని అంటున్నారు. అవును.. నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నా. నాకు విదేశీ భాష రాకపోవచ్చు. కానీ, పేదవాడి మనసును చదవడం వచ్చు. గుంటూరులో చదివి గూడుపుఠాణీలు చేయడం లేదు. ఒకాయన చేతనైతే ఆర్ట్స్ కాలేజీ దగ్గరకు పోయిరా అంటూ సవాల్ విసిరిండు. వాళ్లలా దొంగను కాదు. ఫామ్‌హౌజ్‌లు, గడీలు కట్టుకోలేదు. పేదలకు సంక్షేమం అందేలా పరిపాలన చేయడం వచ్చు" అని సీఎం అన్నారు.


ఉస్మానియా వర్సిటీకి రూ. వెయ్యి కోట్లు విడుదల చేస్తూ జారీ చేసిన జీవో కాపీని వీసీకి అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

చరిత్ర గుర్తుంచుకునేలా పాలించాలి..

చరిత్ర గుర్తుంచుకునేలా పరిపాలన ఉండాలన్నదే తన ఆకాంక్ష అని రేవంత్ తెలిపారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవంటే విమర్శిస్తున్నారని, మరి.. దళితులకు మూడెకరాలు ఇస్తామని హామీ ఇచ్చి పదేళ్లలో ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. 3వేల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లు కట్టుకొని దళితులకు ఎకరం భూమి ఇచ్చారా? అని ప్రశ్నించారు. భూమి లేకపోవడం పేదరికం కావచ్చునేమో కానీ, చదువు లేకపోవడం వెనుకబాటుతనమని అన్నారు. విద్య ఒక్కటే ఈ వెనుకబాటుతనాన్ని రూపుమాపుతుందన్నారు. అందరికీ నాణ్యమైన విద్య అందించాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. ఓయూకు వచ్చేటప్పుడు ఉత్తచేతులతో రానని ఆనాడే చెప్పానని, రూ.వెయ్యి కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామని ప్రకటించారు. రెండేళ్లలో వర్సిటీకి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తాను వ్యవసాయం చేసినవాణ్నని, చేనుకు ఏ పురుగు పడితే ఏ మందు కొట్టాలో తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు పట్టిన చీడను ఎలా వదిలించాలో కూడా తనకు తెలుసునన్నారు. "ప్రపంచాన్ని ఏలుతున్న జర్మనీ, జపాన్, చైనాలకు ఇంగ్లీషు రాదు. మనం కనీసం ఏబీసీడీలైనా రాయగలుగుతున్నాం. ప్రపంచాన్ని శాసిస్తూ ఇంగ్లీషు మాట్లాడే అమెరికాకు చైనా సర్‌ప్లస్ ఆపితే గంట కూడా జీవించలేదు. యువ మిత్రులెవరూ ఇంగ్లీషు రాదని ఏమీ పెట్టుకోవద్దు. అదీ విషయమేమీ కాదు. కావాలంటే ఇంగ్లీషు వచ్చిన పది మందిని ఉద్యోగులుగా పెట్టుకుంటా. భాష అనేది కమ్యూనికేషన్ మాత్రమే. నాలెడ్జ్ వేరు.. కమ్యూనికేషన్ వేరు" అని రేవంత్ వ్యాఖ్యానించారు. నాలెడ్జ్, కమిట్‌మెంట్, కన్విక్షన్ ఉంటే దేశంలో ఏ స్థాయికైనా ఎదగవచ్చన్నారు. వర్సిటీలో టీచింగ్ స్టాఫ్ కోసం కమిటీ వేశామని, నియామకాలు చేసుకునే స్వతంత్ర ప్రతిపత్తి కల్పించామని తెలిపారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పైరవీలతో వస్తే తనకు చెప్పాలని, వారి ఉద్యోగాలు పీకేస్తామన్నారు. ముగ్గురు ప్రముఖ ఆర్కిటెక్ట్‌లతో యూనివర్సిటీ అభివృద్ధి డిజైన్లను రూపొందించారని, వీటిపై అధ్యాపకులు సూచనలిస్తే నెలాఖరుకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మెల్సీ వెంకట్‌ను అడ్డుకున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓయూ పర్యటనలో ఉద్యోగ నోటిఫికేషన్లపై ఎటువంటి ప్రకటన చేయలేదంటూ విద్యార్థులు నిరసన తెలిపారు. తమకు ఉద్యోగాలు కావాలంటూ నినాదాలు చేశారు. సీఎం ప్రసంగం ముగించుకొని వెళ్తుండగా విద్యార్థులు కాన్వాయ్ వైపు వెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే ఉన్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను అడ్డుకుని నిలదీశారు. పోలీసులు వారిని చెదరగొట్టే క్రమంలో మీడియా ప్రతినిధులను కూడా నెట్టేశారు. దీంతో పోలీసులకు, మీడియా ప్రతినిధులకు మధ్య కొంత వాగ్వాదం జరిగింది. మరోవైపు ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను సీఎం పట్టించుకోలేదంటూ ఓయూ ఉద్యోగులు నిరసన తెలిపారు. కాగా, సీఎం పర్యటన నేపథ్యంలో కొంత మంది విద్యార్థి నాయకులను పోలీసులు ముందు రోజు అర్ధరాత్రి నుంచే అరెస్టు చేశారు.

ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్

శంషాబాద్ రూరల్: కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు మేరకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లారు. అక్కడ ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ ఇంట్లో జరిగిన విందుకు హాజరయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీతో కలిసి ఈ విందులో రేవంత్ పాల్గొన్నారు. గురువారం పార్లమెంట్‌లో ఖర్గే, రాహుల్, ప్రియాంక, వేణుగోపాల్‌ను రేవంత్ కలవనున్నట్లు తెలిసింది.

రాహుల్, ప్రియాంకతో మాట్లాడుతున్న రేవంత్


నెలాఖరు కల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావడం చూసి హరీశ్‌రావుకు గుబులు పుట్టిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రానికి ఎన్ని పెట్టుబడులు వచ్చాయో ఆయన చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ దశాబ్ద ఏలుబడి కంటే కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో నాలుగింతల అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. తెలంగాణ భవిష్యత్తుకు గ్లోబల్ సమ్మిట్ కొత్త దిశను చూపిందని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో కాంగ్రెస్ పార్టీ కోసం స్థలం తీసుకుంటామని చెప్పారు. ఆస్తులకు సంబంధించిన లావాదేవాల వల్లనే ఎమ్మెల్సీ కవిత విమర్శలు చేస్తున్నారని, అయితే ఆమె విమర్శల వల్ల బీఆర్ఎస్ నేతలు చేసిన దోపిడీలు బయటికి వస్తున్నాయని పేర్కొన్నారు. కవిత లూటీ వ్యాఖ్యలపైన విచారణ జరపాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరతానని చెప్పారు. తెలంగాణకు భవిష్యత్తులో ఒక బీసీ ముఖ్యమంత్రి కావాలన్నది తమ ఆకాంక్ష అని, అది కాంగ్రెస్ నేతృత్వంలోనే జరుగుతుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య అంతరం ఏర్పడిందన్నది అసత్య ప్రచారమని మహేశ్‌గౌడ్ స్పష్టం చేశారు.

సమకాలీన నైపుణ్యాలే విజయ రహస్యం

» 'పాత్ వే టు తైవాన్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యువత కేవలం సంప్రదాయ విద్యపైనే కాకుండా, ప్రపంచ అవసరాలకు సరిపోయే విధంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. సవాళ్లను అధిగమించి నిరంతరం నేర్చుకునే వారికే కెరీర్‌లో శాశ్వత విజయం దక్కుతుందని అన్నారు. బుధవారం టీ-వర్క్స్ ప్రాంగణంలో 'పాత్ వే టు తైవాన్' పేరుతో అంతర్జాతీయ ఉపాధి కల్పన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తైవాన్ ప్రభుత్వ సంస్థ 'టాలెంట్ తైవాన్', టీ వర్క్స్ మధ్య కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. టీ- వర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్ల, టాలెంట్ తైవాన్ ప్రతినిధి ఈడెన్ లియోన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేసారు. ఈ సందర్భంగా యువతనుద్దేశించి మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. తైవాన్‌లో కేవలం 2.2కోట్ల జనాభా ఉన్నప్పటికీ.. సెమీకండక్టర్ల తయారీ, టెక్నాలజీ రంగాల్లో ప్రపంచ అగ్రగామిగా ఉందని అన్నారు. ప్రతిభావంతుల వేటలో తైవాన్ కంపెనీలు దేశం మొత్తం మీద తెలంగాణను ఎంపిక చేసుకున్నందుకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. తైవాన్ కు చెందిన రియల్ టెక్, లాజిటెక్ వంటి ఎనిమిది ప్రముఖ కంపెనీలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యాయి.

దోచుకోవడం.. దాచుకోవడమే బీఆర్ఎస్ విజన్

» రాష్ట్ర ప్రతిష్ఠను పెంచిన గ్లోబల్ సమ్మిట్: అడ్లూరి

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచంలోని ప్రముఖ పెట్టుబడిదారులు తెలంగాణపై చూపిన నమ్మకం.. రాష్ట్ర ప్రతిష్ఠను మరింత పెంచిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు సమష్టిగా నిర్వహించిన ఈ సమ్మిట్.. ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని చెప్పారు. బుధవారం సీఎల్పీ మీడియా హాల్లో మంత్రి అడ్లూరి మాట్లాడారు. పేదలకు సంక్షేమం, రైతులకు భద్రత, యువతకు ఉద్యోగాల కల్పనపైన సీఎం రేవంత్‌రెడ్డికి స్పష్టమైన విజన్ ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ విజన్.. దోచుకోవడం, దాచుకోవడం, పేదల భూములను ఆక్రమించుకోవడం మాత్రమేనని దుయ్యబట్టారు.గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావడం పట్ల కేటీఆర్, హరీశ్‌రావులు ఈర్ష్య పడుతున్నారన్నారు. ట్రంప్ కూతురు ఇవాంకా హైదరాబాద్‌కు వస్తే పేదలను బందీలను చేసి డ్రైనేజీలపై రెడ్ కార్పెట్లు పరిచిన బీఆర్ఎస్‌కు గ్లోబల్ సమ్మిట్‌పైన మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు.

3 నెలల్లో తుమ్మిడిహెట్టి డీపీఆర్

» ఏడాదిలోగా అనుమతులు సాధించాలి

» ఆర్వీ అసోసియేట్స్‌కు బాధ్యతల అప్పగింత

హైదరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తుమ్మిడిహెట్టి బ్యారేజీ సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సిద్ధం చేసే బాధ్యతను ప్రభుత్వం ఆర్వీ అసోసియేట్స్‌కే అప్పగించింది. ఈ మేరకు ఉత్తర్వులు ఇవ్వడంతో ఆ సంస్థ సర్వే ప్రక్రియను ప్రారంభించింది. ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఈ డీపీఆర్‌ను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. బ్యారేజీ ప్రతిపాదిత నిర్మిత ప్రదేశం నుంచి మైలారం గ్రామం దాకా 75 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్ సర్వే, మైలారం నుంచి సుందిళ్ల బ్యారేజీ దాకా టన్నెల్ అలైన్‌మెంట్‌పై సర్వే కూడా ఆ సంస్థ చేపట్టాల్సి ఉంటుంది. డీపీఆర్‌కు అనుమతులు సాధించే బాధ్యతను కూడా ప్రభుత్వం ఆ సంస్థకే అప్పగించింది. డీపీఆర్ తయారీని మూడు నెలల్లో, కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ)లోని వివిధ డైరెక్టరేట్ల నుంచి క్లియరెన్స్ తీసుకోవడం వంటి ప్రక్రియను ఏడాదిలోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. బ్యారేజీని 148, 150, 152 మీటర్ల ఎత్తుతో కట్టడం వల్ల కలిగే ముంపుపై పుణెలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) ఇప్పటికే అధ్యయనం చేసింది. ఈ విషయంలో నిపుణుల అంచనాలు, లెక్కలు సరైనవేనా? కావా? నిర్ధారించే బాధ్యతను కూడా ప్రభుత్వం ఆర్వీ అసోసియేట్స్‌కే అప్పగించింది. కాగా, తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని 148 మీటర్ల ఎత్తుతో కట్టుకోవడానికి 2016 మార్చి 8న మహారాష్ట్రతో ఒప్పందం జరిగిన విషయం విదితమే. పర్యావరణ అనుమతి కోసం తెలంగాణలో 2011 ఏప్రిల్‌లో బహిరంగ విచారణ జరగ్గా మహారాష్ట్రలో మాత్రం పూర్తికాలేదు. దాంతో తాజాగా అక్కడ ప్రజాభిప్రాయ సేకరణ జరపాల్సి ఉంటుంది. పలు అనుమతులు ఇదివరకే ఉండటంతో బ్యారేజీ ఎత్తును కేవలం ఒక మీటరు పెంచుకున్నా నిర్దిష్ట లక్ష్యం మేరకు నీటిని తరలించవచ్చని అధికారులు లెక్క వేశారు. దీనికోసం మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పిస్తే చాలని పలువురు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇప్పటిదాకా కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ జోలికి పోకుండానే తుమ్మిడిహెట్టి డీపీఆర్ సిద్ధం చేయాలని సూచనలు వస్తున్నాయి. అయితే కాళేశ్వరంలో భాగంగా అయితేనే ప్రాజెక్టు బెన్‌ఫిట్ కాస్ట్ రేషియో (ప్రాజెక్టుకు వెచ్చించేది ఎంత.. తిరిగి వచ్చేదెంత)పై కచ్చితంగా లెక్కలు సరిపోతాయని అధికారులు పేర్కొంటున్నారు. మేడిగడ్డ నుంచైనా తుమ్మిడిహెట్టి నుంచైనా నీళ్లు అంతిమంగా చేరాల్సింది శ్రీపాద ఎల్లంపల్లికేనని, ఆ ప్రాజెక్టు వద్ద ఉన్న కాళేశ్వరం పంపులతో పాటు సుందిళ్ల బ్యారేజీని కూడా వాడుకుంటున్నప్పుడు తుమ్మిడిహెట్టి బ్యారేజీ కూడా కాళేశ్వరంలో భాగంగానే కడుతున్నామని ప్రభుత్వం ముందు ప్రకటించనుంది. పుణె సీడబ్ల్యూపీఆర్ఎస్ చేస్తున్న అధ్యయనం పూర్తయిన తర్వాత వచ్చే నివేదికల ఆధారంగా మేడిగడ్డ బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లు సిద్ధం చేయనున్నారు. ఆ తర్వాత నీటి నిల్వను గణనీయంగా తగ్గించుకొంటేనే బ్యారేజీలు ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

మెస్సీ వర్సెస్ సీఎం రేవంత్

13న ఉప్పల్ స్టేడియంలో ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్.. 20 నిమిషాల మ్యాచ్.. ఆఖరి 5 నిమిషాల్లో బరిలోకి రేవంత్, మెస్సీ

హైదరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ దిగ్గజం.. అర్జెంటీనాకు చెందిన లియోనెల్ మెస్సీ.. ది గోట్ ఇండియా టూర్-2025లో భాగంగా హైదరాబాద్ వస్తున్నారు. డిసెంబరు 13వ తేదీ, శనివారం నాడు హైదరాబాద్ వస్తున్న మెస్సీ.. ఉప్పల్ స్టేడియంలో ఆ రోజు నిర్వహిస్తున్న ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తలపడనున్నారు. మెస్సీ హైదరాబాద్ పర్యటనకు సంబంధించిన వివరాలను ఆ టూర్ ప్రమోటర్ పార్వతిరెడ్డి బుధవారం విలేకరులకు వెల్లడించారు. మెస్సీ హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఉప్పల్ స్టేడియంలో 13వ తేదీన సింగరేణి ఆర్ఆర్-9, అపర్ణ జట్ల మధ్య ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్ ఉంటుందన్నారు. ఇందులో సింగరేణి జట్టు తరఫున రేవంత్ రెడ్డి, అపర్ణ జట్టు తరఫున మెస్సీ ఆడుతున్నారని వెల్లడించారు. రాత్రి ఏడు గంటలకు మొదలయ్యే మ్యాచ్ 20 నిమిషాల పాటు జరుగుతుందని, మ్యాచ్ చివరి ఐదు నిమిషాల్లో సీఎం రేవంత్, సాకర్ దిగ్గజం మెస్సీ తమ జట్ల తరఫున బరిలోకి దిగుతారని చెప్పారు. మ్యాచ్ అనంతరం ఇరు జట్లకు 'ది గోట్ కప్'ను అందజేస్తామని తెలిపారు. మెస్సీతో పాటు స్టార్ ఆటగాళ్లు.. అర్జెంటీనాకు చెందిన రొడ్రిగో డి పాల్, ఉరుగ్వేకు చెందిన లూయిస్ సువారెజ్ కూడా 'ది గోట్ కప్' మ్యాచ్‌కు హాజరవుతారని ఆమె చెప్పారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను చూడాలనుకునే వారి కోసం డిస్ట్రిక్ట్ యాప్‌లో టికెట్లు అందుబాటులో ఉంచామని పార్వతిరెడ్డి తెలియజేశారు. టికెట్ ప్రారంభ ధర రూ.1,300 అని కార్పొరేట్ బాక్సుల్లోని టికెట్ల ధర రూ.22 వేల నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆఫ్‌లైన్ విధానంలో టికెట్ల విక్రయం లేదని, ఆన్‌లైన్‌లో మాత్రమే కొనుగోలు చేయాలని ప్రేక్షకులకు సూచించారు. మ్యాచ్‌ను సోనీ లైవ్ ద్వారా స్ట్రీమింగ్ చేస్తున్నామని ప్రకటించారు. ఇక, 13వ తేదీ సాయంత్రం 5.30 గంటల నుంచి ప్రముఖ సంగీత దర్శకుడు దేవీశ్రీ ప్రసాద్ నేతృత్వంలో స్టేడియంలో సంగీత విభావరి ఉంటుందని ఆమె తెలియజేశారు. ఈ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ప్రముఖ క్రికెటర్లతో పాటు, పలువురు సినీ ప్రముఖులు కూడా హాజరవుతారని పార్వతి రెడ్డి చెప్పారు. టీమిండియా స్టార్ క్రికెటర్, హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ సిరాజ్‌ను మ్యాచ్‌కు ఆహ్వానించనున్నామని తెలిపారు. కాగా, మ్యాచ్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, పాస్‌లు ఉన్నవారిని మాత్రమే స్టేడియంలోకి అనుమతిస్తామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు బుధవారం విలేకరులకు వెల్లడించారు.



తెలంగాణ ఫుట్‌బాల్ అంబాసిడర్‌గా మెస్సీ ?

తెలంగాణ ఫుట్‌బాల్‌కు అర్జెంటీనా స్టార్ ఆటగాడు మెస్సీని బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి 13వ తేదీన ప్రభుత్వం ఓ ప్రకటన చేయనుందని విశ్వసనీయ సమాచారం. అయితే మెస్సీతో చర్చించిన తర్వాతే ఈ అంశంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

ఆ 20 మందికి మెస్సీ సూచనలు

మెస్సీ హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా 'ఫుట్‌బాల్ చిల్డ్రన్ క్లినిక్' కింద ఫుట్‌బాల్‌పై ఆసక్తితోపాటు ప్రతిభ కలిగిన రాష్ట్రానికి చెందిన 20 మంది పిల్లలను, నలుగురు కోచ్‌లను నిర్వాహకులు ఎంపిక చేశారు. అండర్ ప్రివిలేజ్డ్ విభాగంలో 10 మందిని, టాలెంటెడ్ విభాగంలో ఐదుగురిని, బై సర్టిఫికెట్స్ విభాగంలో ఐదుగురిని కలిపి మొత్తం 20 మంది పిల్లలను ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. ఈ పిల్లలు, కోచ్‌లతో ప్రత్యేకంగా ముఖాముఖి అవ్వనున్న మెస్సీ, రొడ్రిగో, సువారెజ్.. వారికి ఆటకు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు.

మెస్సీ టూర్ ఇలా..

మెస్సీ శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తారు. నాలుగు గంటలకు ఫలక్‌నుమా ప్యాలెస్ చేరుకుంటారు. కొద్దిసేపు విశ్రాంతి అనంతరం 4.30-5.10 గంటల వరకు మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొంటారు. 5.30 గంటలకు ఉప్పల్ స్టేడియం చేరుకుంటారు. 7.15గంటలకు సీఎం రేవంత్, మెస్సీ తమ జట్ల తరఫున బరిలోకి దిగుతారు.

పట్టు కాదు.. పాలిస్టర్

టీటీడీలో వెలుగుచూసిన మరో స్కామ్

» శ్రీవారిని దర్శించే ప్రముఖులు, భక్తులకు కప్పే పట్టు వస్త్రాల కొనుగోళ్లలో కక్కుర్తి


» 350 విలువైనది 1,389కు కొనుగోలు

» 2015-25 మధ్య 54 కోట్లకు సరఫరా

» ఏసీబీ విచారణకు టీటీడీ లేఖ

తిరుమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ప్రసాదానికి వినియోగించిన నెయ్యి కల్తీ.. తిరుమల పరకామణిలో చోరీ కేసు రాజీ.. చివరకు శ్రీవారిని దర్శించే ప్రముఖులు, భక్తులకు కప్పే పట్టువస్త్రాల పేరిట పాలిస్టర్ వస్త్రాలు కొనుగోలు చేసి మోసం చేశారు. గత పాలక మండళ్ల హయాంలో ఈ స్కామ్ తాజాగా వెలుగులోకి వచ్చింది. సిల్క్ పేరుతో పాలిస్టర్ వస్త్రాలను సరఫరా చేసి భారీగా అవినీతికి పాల్పడినట్టు తేలింది. వ్యక్తిగత వినియోగం కోసం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఇటీవల కొన్ని పట్టు వస్త్రాలను కొనుగోలు చేయగా కేవలం రూ.350 ధరకే లభించాయి. అయితే టీటీడీ కొనుగోలు చేస్తున్న పట్టు వస్త్రాల ధర మాత్రం రూ.1389గా ఉంది. దీంతో ఈ అంశంపై బోర్డు విచారణకు ఆదేశించింది. సాధారణంగా శ్రీవారిని దర్శించుకునే ప్రముఖులకు, వేదాశీర్వచనం టికెట్ కొనే భక్తులకు పట్టువస్త్రాలు కప్పి ఆశీర్వచనం చేస్తారు. టెండర్ల నిబంధనల ప్రకారం.. ఈ వస్త్రాలు స్వచ్ఛమైన మల్బరీ సిల్క్‌తోనే నేయాలి. తప్పనిసరిగా సిల్క్ మార్క్ హాలోగ్రామ్ ట్యాగ్ ఉండాలి. విజిలెన్స్ విభాగం ఇటీవల తిరుపతిలో మార్కెటింగ్ విభాగంలో నూతన స్టాక్ నుంచి, తిరుమలలోని వైభోత్సవ మండపం నుంచి రెండేసి చొప్పున శాంపిల్స్‌ను సేకరించింది. వీటిని ల్యాబ్‌కు పంపించగా.. రిపోర్టుల్లో పాలిస్టర్ వర్సెస్ పాలిస్టర్‌గా ఉండటంతో అధికారులు షాకయ్యారు. సిల్క్‌మార్క్ హాలోగ్రామ్ కూడా లేనట్టు తేలింది. విజిలెన్స్ విభాగం సేకరించిన వస్త్రాలన్నీ నగరికి చెందిన వీఆర్‌ఎస్ ఎక్స్‌పోర్ట్సు అనే సంస్థ సరఫరా చేసినట్టు గుర్తించారు. 2015-25 మధ్య వీటి నుంచి మొత్తం రూ.54.95 కోట్ల విలువైన వస్త్రాలు కొనుగోలు చేసినట్టు ఉన్న రికార్డులను కూడా స్వాధీనం చేసుకున్నారు. తాజాగా మరో 15 వేల వస్త్రాల కోసం రూ.1,389 చొప్పున సరఫరా చేసేందుకు ఇదే సంస్థ కాంట్రాక్ట్ తీసుకుంది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఆ సంస్థకు కేటాయించిన కాంట్రాక్ట్‌ను టీటీడీ రద్దు చేసింది. ఈ వస్త్రాల కొనుగోలుపై ఏసీబీతో విచారణ చేయించాలని నిర్ణయించింది. టీటీడీలో అవినీతి అక్రమాలను అడ్డుకోవడంతోపాటు గతంలో జరిగిన అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చి దొంగలకు శిక్ష వేయిస్తామని బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.


MARUTI SUZUKI
NEXA
UNMISSABLE. UNMATCHED.
Grab the boldest deal of the year on your Baleno.
BALENO
EFFECTIVE PRICE OF
₹ 5.54 LAKH^
THE NEW AGE
BALENO
TECH GOES BOLD
1st in Segment
360 VIEW CAMERA
1st in Segment
HEAD UP DISPLAY
6 AIRBAGS AS STANDARD
IN-BUILT SUZUKI CONNECT
3 years 100 000 km WARRANTY*
EXTENDABLE UPTO 6 YEARS
NEXA SAFETY SHIELD
SCAN TO CONNECT TO A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY @ WWW.NEXAEXPERIENCE.COM
Contact us at
1800-200-[6392]
1800-102-[6392]
^Ex Showroom Price of ₹ 5.99 lakh, Consumer Offer (-) ₹ 25 000, Exchange Bonus (-) ₹ 15 000, Corporate Offer (-) ₹ 5 000, = ₹ 5.54 lakh. The actual Effective Price mentioned may vary based on the customer's eligibility, profile, and applicable offers at the time of purchase. T&C available at your nearest dealership. Creative visualization. For details on safety features, refer to the owner's manual, NEXA dealers exclusively provide all offers, which vary by model and variant and city. Offers are subject to availability of stock. Offer valid on Baleno SIGMA VARIANT till 31st Dec 2025. Not valid on CNG variants. Maruti Suzuki may withdraw offers without notice. Features and accessories shown can vary by variant. *3 years or 1 00 000 km, whichever is earlier.